VISALAANDHRA VIJAYAWADA PHONE : NO 376

ఉదయం

706197**

8 పేజీలు 13 నయాపైసలు రిజిష్టర్డు నెం A-193

విశాలాంధ్ర

సంపుటి 9] విజయవాడ * 8 మే 1960 * ఆదివారం [సంచిక 40

కడపజిల్లాగ్రామంలో పోలీసు కాల్పులు

హైదరాబాద్, మే 7

కడపజిల్లాలోని [illegible] గ్రామంలో నిన్న [illegible] సందర్భంలో పోలీసులు తుపాకులు కాల్చారు. ఈ సంఘటనలో ఇద్దరు చనిపోయారు. ఆరుగురు గాయపడ్డారు. పోలీసు కాల్పులవల్ల చనిపోయారో, లేక కొట్లాటల్లో అనేది అధికారులు తెలుపలేదు.

రేపే ప్రారంభం
9-5-60 నుండి శాఖాహార భోజనం
అనుభవమైన వంటవారిచే, స్వచ్ఛమైన నేతితో, భోజనము ఏర్పాటు చేయుచున్నామని సంతోషముతో తెలియపరచు చున్నాము.
నియో మోడరన్ లాడ్జి
(ఫోన్ నెం. 1155)
కాళేశ్వరరావు రోడ్, గవర్నరుపేట, విజయవాడ-2.

కామన్వెల్తు పునాదులన్నీ కదలిపోయే ప్రమాదం

దక్షిణాఫ్రికా సమస్యపై లండన్ బహిరంగసభలో ప్రధాని నెహ్రూ హెచ్చరిక

ఆఫ్రికాలోని భారతీయులు అక్కడి ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్య మివ్వాలని సలహా

లండన్, మే 6

దక్షిణాఫ్రికా ప్రభుత్వం అనుసరిస్తున్న జాతి దురహంకార, జాతి వివక్షా విధానం ఫలితంగా అసలు కామన్వెల్తు పునాదులే కదలిపోయే ప్రమాదమున్నదని ప్రధాని నెహ్రూ నేడిక్కడ హెచ్చరించారు.

ఇండియాలీగు ఆధ్వర్యాన జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ పై విధంగా అన్నారు. ఈ సభకు బ్రిటిష్ మాజీ ప్రధాని ఎరల్ అట్లీ కూడ హాజరైనారు.

ప్రధాని నెహ్రూ ఇంకా ఇలా అన్నారు:

"ఈ సమస్య స్వాతంత్ర్యం పట్ల మనకున్న భావాలకు, జాతివిచక్షణా విధానం అంటే మనకుండే అయిష్టతకు వ్యతిరేకంగా పనిచేస్తూంది.

"ఈ సమస్యవల్ల నష్టపోతున్నది ఒక్క దక్షిణాఫ్రికా ప్రజలే కాదు; ఆఫ్రికా ఆసియా ఖండాలలో ప్రతి ఒక్కరికీ ఇది నష్టం కలిగిస్తోంది.

"జాతిరీత్యా చూపబడే వివక్ష ఏ వ్యక్తికైనా ఇబ్బంది కలిగిస్తుంది. అలాంటిది ఒక జాతికే సంబంధించి వున్నప్పుడు దానివల్ల ఇబ్బంది మాత్రమే కాక అవమానంకూడ జరుగుతుంది.

"[illegible] ఎలా పరిణమించినప్పటికీ నేను ఒక్కటి చెప్పదలచాను. ఈ పరిస్థితి కొనసాగినందువల్ల అతి ప్రమాదకరమైన ప్రమాదాలు ఎదురవుతాయి.

"అయితే యీ సమస్యకు ఏదో ఇంద్రజాలం లాగ హఠాత్తుగా ఒక పరిష్కారం దొరుకుతుందని మాత్రం నేను ఆశించడం లేదు. కాని పరిష్కారాన్ని సాధించడానికి ఇప్పుడే ఒక ఆరంభం అంటూ ఏదయినా చేయకపోతే అది మరింత ప్రమాదకర ఫలితానికి దారితీయక మానదు.

"ఈ సమస్యతో కామన్వెల్తు చాల తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ సమస్యను ఇష్టాగోష్ఠిగా చర్చించుకొన్నా లేక అధికార పూర్వకంగా చర్చించినా అసలు ఆ సమస్య వుండనే వుంటుంది; అంతేగాని దాని ముఖం చూడనని మనముఖం ప్రక్కకు త్రిప్పుకున్నా లేక [illegible] కబుర్లకు అదేమీ తగిన విషయం కాదంటున్నా త్రోసిపుచ్చినా సమస్యను దాటవేయడం ఎన్నటికీ జరగదు.

"ప్రస్తుతం కామన్వెల్తు చాలా ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అసలు యీ కామన్వెల్తే చాలా అస్పష్టమయిన సంస్థగా, ఫలానాది అని చెప్పడానికి వీలులేనిదిగా తయారవడం లేదా అనే ప్రశ్న ఎదురవుతున్నది.

కామన్‌వెల్తుకు ఒకరూపమే లేకుండా పోయే ప్రమాదం

"ఈ కామన్వెల్తును నిర్వచించడం ఎల్లప్పుడూ కష్టంగానే వుంది. అయితే యీ సంస్థ క్రియా పూర్వకంగా వుంటూనే, అదే సమయంలో చాలా ఉపయుక్తంగా వ్యవహరించుకోడానికి కూడా అవకాశమిస్తోంది. అదే దీనిలోని సుగుణం. కాని ఇప్పుడసలే దీనికొక రూపం అంటూ లేకుండా పోయే ప్రమాదంకూడ ఏర్పడింది.

"కామన్వెల్తు నిర్మాణంలో రెండు అంశాలు ముఖ్యమైనవని అందరు గుర్తిస్తారు. కాని ఎప్పుడూ అందుకనుగుణంగా ఆచరించకపోవడం అనేదికూడ వుంది. ఆ రెండు అంశాలు ఇవి: (1) దాని నిర్మాణం రాజకీయ స్వాతంత్ర్యం పొందిన భాగాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. (2) వివిధ జాతులకు చెందిన ప్రజలను చేరదీసినందువల్ల జాతిరీత్యా సహకారాన్ని, సమైక్యతను పెంపొందిస్తున్నది.

"ఇది చాలా ముఖ్య విషయం. ఎందుకంటే నేటి ప్రపంచంలో వివిధ జాతుల ప్రజలు ఒకరినొకరు విధ్వంసమైనా చేసుకోవాలి లేదా ఒకరిసరసన ఇంకొకరు ప్రశాంతంగా జీవించనైనా జీవించాలి. మరో మధ్యేమార్గం లేదు"

(మిగతా 2 వ పేజీలో)

కమ్యూనిస్టుపార్టీజాతీయసమితి సమావేశంకలకత్తాలోప్రారంభం

ముసాయిదా తీర్మానానికి శ్రీ అహమ్మద్ ప్రతిపాదించిన ప్రధాన సవరణపై చర్చ

(విశాలాంధ్ర విలేఖరి)

కలకత్తా, మే 7

కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సమావేశం నిన్న ఇక్కడ ప్రారంభమైంది. ఈ సమావేశం ఏడురోజులు జరుగుతుంది. శ్రీ నంబూద్రిపాద్, శ్రీమతి హాజ్రాబేగం, శ్రీ తరిమెల నాగిరెడ్డిగార్లను అధ్యక్షవర్గంగా ఎన్నుకున్నారు.

పార్టీ కేంద్ర కార్యవర్గం తయారుచేసిన ముసాయిదా తీర్మానం, కేరళపై నివేదిక, పార్టీ కేంద్రం కార్యకలాపాలు, వచ్చే పార్టీ మహాసభకు టైము టేబిల్, నిర్మాణ సమస్యలు ఇతరేతర విషయాలను ఈ సమావేశంలో చర్చిస్తారు. కార్యవర్గం తరఫున శ్రీ పి. రామమూర్తి ముసాయిదా తీర్మానాన్ని చర్చకు ప్రవేశపెట్టారు.

డాక్టర్ జడ్. ఎ. అహమ్మద్ ఈ తీర్మానానికి ఒక ప్రధాన సవరణను ప్రతిపాదించారు. చర్చ సాగుతూంది.

దక్షిణాఫ్రికాపై తీర్మానం

దక్షిణాఫ్రికా అమలుజరుపుతున్న జాతివిచక్షణా విధానం ఐరాస ప్రకటించిన మానవహక్కులకు విరుద్ధమనీ ఆఫ్రికా జాతి ప్రజలను ఆఫ్రికాలోనే బానిసలుగా దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఉంచుతున్నదనీ ఖండిస్తూ సమావేశం వారు ఒక తీర్మానం చేశారు. ప్రభుత్వ దారుణ హింసాకాండను వీరోచితంగా ప్రతిఘటించి పోరాడుతున్న ఆఫ్రికా జాతి ప్రజలకు జేజేలర్పించారు. దక్షిణాఫ్రికాలోని భారతీయ పౌరులు జాతి విచక్షణా విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు అభినందించారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై నిర్దిష్ట చర్య తీసుకోవాలని ఆఫ్రికా జాతి ప్రజలు కోరుతున్న కోర్కెను సమావేశంవారు బలపర్చారు. కామన్వెల్తు సమావేశంలో ఇందుకు తగిన చర్య తీసుకొనేటట్లు శ్రీ నెహ్రూ చూడాలని విజ్ఞప్తిచేశారు. తీర్మానంలో ఇంకా ఈవిధంగా తెలియజేశారు:

"దక్షిణాఫ్రికాపై కామన్వెల్తు తగుచర్య తీసుకోనిపక్షంలో ఆసియా-ఆఫ్రికాదేశాల ప్రధానులతో కలిసి ప్రధాని నెహ్రూ ఈ సమావేశంనుండి వాకౌటు చేయాలి. భారతప్రభుత్వం ఈ విషయంలో తగు చొరవ తీసుకొని దక్షిణాఫ్రికాను దౌత్య వ్యవహారాల్లోను, ఆర్థిక వ్యవహారాల్లోను ఆసియా-ఆఫ్రికాదేశాలు బహిష్కరించేటట్లు చేయాలి. దక్షిణాఫ్రికాపై ఆంక్షలు విధించడానికి ఐరాసలో తీర్మానం ప్రతిపాదించాలి.

దక్షిణాఫ్రికా ప్రజలు పోరాటాన్ని బలపరుస్తూ పార్టీ కమిటీలన్నీ పెద్దయెత్తున ఆందోళన సాగించాలి. జూన్ 26 వ తేదీన దక్షిణాఫ్రికా దినం జరపాలి"

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సమావేశం

రేపల్లెలో 28 న ప్రారంభం

హైద్రాబాద్, మే 7

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సమావేశము మే 28 వ తారీఖునుండి జూన్ 1 వ తారీఖు వరకు గుంటూరు జిల్లా రేపల్లెలో జరుగుతుందని రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యాలయం నేడు ప్రకటించింది.

చర్చనీయాంశములు: (1) ప్రదేశ్ కార్యవర్గ కార్యకలాపాల నివేదిక, (2) పార్టీ జాతీయ సమితి రాజకీయ తీర్మానము; (3) ఆంధ్ర ప్రదేశ్‌లో భవిష్యత్ కార్యక్రమ ప్రణాళిక, (4) బ్లాకు ప్రాతిపదికపై పార్టీ నిర్మాణమును యేర్పాటు చేయుట, (5) సందేశము పత్రికా నిర్వహణకు సంబంధించిన సమస్యలు.

సమావేశం 28 వ తారీఖు పుదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. రేపల్లె తెనాలికి 20 మైళ్ళలోవుంది. తెనాలి నుండి రైళ్ళు, బస్సులు వున్నాయి. సమితి సభ్యులంతా 27 వ తేదీ రాత్రికే రేపల్లె చేరుకోవలసి వుంటుంది.

అక్రమంగా రష్యాపైకి వచ్చిన అమెరికా వైమానికుడు

సజీవంగా సోవియట్ బందీగా ఉన్నాడని క్రుశ్చేవ్ ప్రకటన

మాస్కో, మే 7

మే దినోత్సవంనాడు సోవియట్ భూభాగంపైకి అక్రమంగా వచ్చిన అమెరికా విమానం వైమానికుడు బ్రతికే ఉన్నాడనీ, అతనిప్పుడు సోవియట్ అధికారుల అధీనంలో ఉన్నాడనీ ప్రధాని క్రుశ్చేవ్ నేడు సుప్రీమ్ సోవియట్ సమావేశంలో ప్రకటించారు. అతనిప్పుడు మాస్కోలోనే ఉన్నాడనీ బాగా ఆరోగ్యంగాకూడా ఉన్నాడనీ క్రుశ్చేవ్ తెలిపారు.

మేదినోత్సవంనాడు ప్రాతఃకాలంలో దక్షిణాన్నుండి సోవియట్ సీమాతిక్రమణ చేసిన అమెరికా విమానాన్ని రాకెట్ ద్వారా ప్రయోగించిన ఒక్క గుండుతోనే సోవియట్ వారు కూల్చిన విషయం నిన్న సుప్రీం సోవియట్‌లో ప్రకటితమైన విషయం పాఠకులకు విదితమే.

మూడురోజులు జరిగిన సుప్రీమ్ సోవియట్ సమావేశం నేడు ముగిసింది. ముగింపు ఉపన్యాసంలో క్రుశ్చేవ్ ఈ విమానం వైమానికుడిని గురించి వివరాలు వెల్లడిచేశారు. క్రుశ్చేవ్ ఉపన్యాసాన్ని మాస్కో రేడియో ప్రసారం చేసింది. క్రుశ్చేవ్ తన ప్రసంగంలో ఈదిగువ వివరాలను తెలిపారు:

సైబీరియాలోని స్వెర్డ్‌లోవ్‌స్కు ప్రాంతంపైని ఈ అమెరికా విమానాన్ని సోవియట్ వారు కూల్చివేశారు.

దీని వైమానికుడు ఫ్రాన్సిస్ హేరీ పవర్స్. అతనివయసు 30 సంవత్సరాలు.

1956 వ సంవత్సరంలో తనను అమెరికా కేంద్ర గూఢచారిశాఖకు బదిలీ చేశారనీ, అంతవరకూ అతను అమెరికా వైమానిక దళంలో కాప్టన్‌గా ఉండేవాడిననీ పవర్స్ తెలిపాడు.

ఇతను తన విమానంలో టర్కీలోని అదానా నుండి బయలుదేరాడు.

ఇతను తన విమానంలోనుండి గాలి గుమ్మటంద్వారా దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు.

ఇతరులచేత బడకుండా అవసరం వస్తే ఆవిమానం ధ్వంసంఅయిపోడానికి తగిన ఆత్మవిధ్వంసక పరికరాలను ఆ విమానానికి అమర్చారు. అందుచేతనే అతను సకాలంలో గాలి గుమ్మటం ద్వారా బయటపడ్డాడు.

ఆత్మహత్య అయినా చేసుకోవాలిగాని, ప్రాణాలతో సోవియటు వారికి చిక్కకూడదని అతని అధికారులు పవర్స్‌కి ఉత్తరువు లిచ్చారు. అందుకోసం, ప్రత్యేకమైన విషంపూసిన ఒక సూదినికూడా అతని కిచ్చారు. దానితో ఒక్కసారి గుచ్చుకుంటే చాలు తక్షణమే చనిపోతారు. కాని, అతను ఆ సూదిని ఉపయోగించలేదు.

ఈ విమానం ఉదంతం గురించి అమెరికావారు ఏమి ప్రకటించారో చదివివినిపిస్తాను. సోవియటుపైకివచ్చిన ఈ విమానాన్ని కూల్చివేశామని నిన్న ప్రకటించినప్పుడు ఆ విమానం వైమానికుడు సజీవంగా సోవియట్ అధీనంలో ఉన్నాడన్న విషయాన్ని వెల్లడి చేయకుండా ఉంచాము.

ఈ వైమానికుడు చనిపోయేఉంటాడని అమెరికావారు అనుకున్నారు. అందుచేత విమానం ఉదంతం గురించి పచ్చిఅబద్ధాన్ని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఆ అబద్ధాన్ని కాదనగలవారెవరూ ఉండరని వారు ఊహించారు.

కాని ఆ విమానం వైమానికుడు సజీవంగా సోవియటు వారికి పట్టుబడి మాస్కోలో ఉన్నాడు. ఆ విమానానికి చెందిన రహస్య పరికరాలు కూడా సోవియటు వారికి చిక్కాయి.

రహస్య సమాచారాన్ని సేకరించాలని ఉత్తర్వు

సైనిక, పారిశ్రామిక విషయాలకు సంబంధించిన రహస్యాలను సేకరించాలని అతని అధికారులిచ్చిన ఉత్తరువుల పైనే అతను బయలుదేరాడు.

గూఢచారి కార్యకలాపాలను ప్రారంభించిన తరువాత అతనికి నెలకు 2,500 డాలర్ల జీతం ఉండేది.

జరిగిన సంగతంతా ఇప్పుడు స్పష్టమయింది.

ఎటువంటి జెట్‌యుద్ధ విమానం కూడా అందుకోలేనంత ఎత్తునా, వేగంతోనూ, ఎగురగల విమానాన్ని అతను తన పనికి ఉపయోగించాడు.

సోవియట్ విమానాలుగాని, విమాన విధ్వంసక ఫిరంగులుగాని ఆ విమానాన్నేమీ చేయలేవని అమెరికావారు అనుకున్నారు.

అయినప్పటికీ, శత్రువిమాన విధ్వంసక సోవియట్ సాధనాల దెబ్బనుండి ఆ విమానం తప్పించుకోలేకపోయింది. ఇంతకన్నా ఇంకా ఎత్తునా, ఇంతకన్నా మరింత వేగంతోనూ కూడా అమెరికా విమానాలు వచ్చినాకూడా సోవియట్ వారు వాటిని పడగొట్టగలరు (హర్షధ్వానాలు).

దక్షిణాన ఉన్న పామీర్ పర్వతాలు మొదలుకొని, ఉత్తరాన ఉన్న కోలాద్వీపకల్పంవరకు ఎగరాలనే పనిపెట్టుకొని ఈ విమానం బయలుదేరింది.

సోవియట్‌లోని వైర్లెస్ రాకెట్, రాడార్ స్థావరాలను గురించిన రహస్యాలను కనిపెట్టడమే ఈ వైమానికుని లక్ష్యం.

సోవియట్ విమాన రక్షణ స్థావరాలను, ఆ విమానంలోని సాధనాలు ఫోటోలు తీశాయి.

ఆ విమానం తీసిన ఫోటోలను క్రుశ్చేవ్ సుప్రీం సోవియట్ ఎదుట పెట్టారు. విమానాశ్రయాలు, వాటిలో ఉన్న సోవియట్ విమానాలు ఆ ఫోటోల్లో ఉన్నాయి. ఈ ఫోటోలు చూడగానే సుప్రీమ్ సోవియట్ సభ్యులు పట్టరాని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారని మాస్కో రేడియో తెలిపింది.

ఆ విమానం తీసిన సోవియట్ పారిశ్రామిక కేంద్రాల ఫోటోలను కూడా క్రుశ్చేవ్ సుప్రీమ్ సోవియట్ ఎదుట పెట్టారు.

ఈ విమానం అచ్చంగా ఒక సైనిక గస్తీవిమానం. అందుకు కావలసిన ప్రత్యేక కెమెరాలూ, ఇతర సాధనాలూ, రాడార్ యంత్రాలను ముందుగానే కనిపెట్టగల సాధనాలూ ఆ విమానంలో ఉన్నాయి. ఆ విమానంలోని యంత్రాలను తరువాత చూపిస్తాను.

ఆ విమానంలో ఒక టేప్‌రికార్డర్ కూడా ఉంది. సోవియట్ సైనిక వైర్లెస్ కేంద్రాల సిగ్నల్సుని యిది రికార్డుచేసింది.

సోవియట్ భూభాగం మీదికి ఈ విమానం రావడం దొంగచాటుగా దెబ్బతీయడం లాంటిది. దీనికి అమెరికా ప్రభుత్వం ఇచ్చిన సంజాయిషీ హాస్యాస్పదంగా ఉంది.

ఈ వైమానికునిపై విచారణ జరపడం మంచిదని నేననుకుంటూన్నాను.

విశ్వకిరణ ప్రసారాలను పరిశోధించడం అనే పేరుతో తమ దళం పనిచేస్తున్నదనీ, కాని, నిజానికి తాము చేసేది గూఢచారి కార్యకలాపాలేనని ఈ వైమానికుడు ఒప్పుకున్నాడు.

చాలరోజులుగా ఇతను సోవియట్ సరిహద్దుల ననుసరించి ఎగురుతూ సోవియట్ రాడార్ (పరాయి విమానం రాకను ముందుగానే కనిపెట్టేసాధనం) ఏర్పాట్లను పరిశీలించాడు. ఆ విధంగా, తన గూఢచారి పనిమీద బయలుదేరడానికి చాలరోజులు ముందు నుండే తర్ఫీదు ప్రారంభించాడు.

అతను టర్కీలో అదానా సమీపంలోని అమెరికా విమాన స్థావరంనుండి బయలుదేరి పాకిస్తాన్‌లోని పెషావర్‌కీ, అక్కడనుండి సోవియట్ కజకిస్తాన్ మీదుగా సైబీరియాలోని స్వెర్డ్‌లోవ్‌స్కు వరకు వెళ్ళాడు. అక్కడ సోవియట్ వారు అతని విమానాన్ని కూల్చివేశారు.

సోవియట్ ఆర్కిటిక్ తీరంలోని ముఖ్యరేవు పట్టణమయిన మర్మాన్స్కు మీదుగా నార్వేలోని బోడో చేరుకొని, అక్కడదిగాలని ఈ వైమానికుడు అనుకున్నాడు.

పెషావర్‌లో మూడురోజులు మజిలీ

ఈ వైమానికుడు సోవియట్ భూభాగంమీదికి వచ్చేముందు దారిలో పెషావర్‌లో మూడు రోజులు మజిలీ చేశాడు. మే మొదటితేదీని సోవియట్ సరిహద్దును దాటడానికి అతను పెషావర్‌నుండే బయలుదేరాడు.

ప్రాణవాయువు సప్లయి చెడినందున ఆ వైమానికుడు స్పృహతప్పిపోయి ఉండవచ్చుననీ, ఆ స్థితిలో అతని విమానం తనంతటతాను సోవియట్ భూభాగంపైకివచ్చి ఉండవచ్చునని

(మిగతా 7 వ పేజీలో)

సోవియట్ అధ్యక్షపదవినుండి మార్షల్ ఒరోషిలోవ్ విరమణ

అనారోగ్యంవల్ల ఆయన యిచ్చిన రాజీనామాకు సుప్రీమ్ సోవియట్ అంగీకారం

మాస్కో, మే 7

ఇంతవరకు సోవియట్ అధ్యక్షునిగా ఉన్న మార్షల్ క్లిమెంటి ఒరోషిలోవ్ వృద్ధాప్యంవలన, అనారోగ్య కారణాలవలన తమ పదవి నుండి విరమించారు. ఆయనస్థానే పార్టీ నాయకులలో ఒకరైన లియొనిడ్ బ్రెజ్నెవ్‌ను సోవియట్ అధ్యక్షునిగా సుప్రీం సోవియట్ నియమించింది.

మార్షల్ వొరోషిలోవ్ వయస్సు 79 సంవత్సరాలు. కమ్యూనిస్టు పార్టీ ఉత్తమ పుత్రులలో వొరోషిలోవ్ ఒకరని ప్రధాని క్రుశ్చేవ్ ఆయనను అభినందించారు.

తన ఆరోగ్యం సంతృప్తికరంగా లేనందున, అధ్యక్ష పదవినుండి విరమించడానికి అనుమతి యివ్వవలసిందిగా సుప్రీం సోవియట్‌ను వొరోషిలోవ్ కోరారు. ఆయన ప్రకటనను నేడు సుప్రీం సోవియట్ సమావేశంలో చదివి వినిపించారు.

వొరోషిలోవ్ రాజీనామాను అంగీకరించవలసిందిగా ప్రధాని క్రుశ్చేవ్ ప్రతిపాదించారు. వొరోషిలోవ్ సోవియట్ కమ్యూనిస్టుపార్టీ నిర్మాతలలో ఒకరనీ, అంతర్యుద్ధ సమయంలో సోవియట్ ప్రభుత్వాన్ని కాపాడారనీ ప్రధాని క్రుశ్చేవ్ వొరోషిలోవ్‌ను అభినందించారు.

అనేక సంవత్సరాలకాలం ఆయన పార్టీకి సేవచేశారనీ, అందుచేతఆయనకు మనం కృతజ్ఞత తెల్పుకోవాలనీ అన్నారు. వొరోషిలోవ్‌కు లెనిన్ బిరుదాన్ని, కత్తి, సుత్తి చిహ్నంగల బంగారు పతకాన్ని, సోషలిస్టు మహావీరుడు అనే బిరుదాన్ని యివ్వాలని క్రుశ్చేవ్ ప్రతిపాదించారు.

మార్షల్ వొరోషిలోవ్ స్థానే అధ్యక్షపదవి స్వీకరించిన బ్రెజ్నెవ్ లెనిన్ బిరుదుపొందినవారు. అనేక సంవత్సరాలుగా సోవియట్ పార్టీ కేంద్ర కార్యవర్గంలో ఉన్నారు. అంతక్రితం యుక్రెయిన్ పార్టీ ప్రముఖులలో ఒకరుగా ఉన్నారు. వయస్సు 53 సంవత్సరాలు.

ఐ ఎల్ టి డి కార్మికుల కోర్కెలకు అంగీకారం

మేనేజిమెంటుకు - కార్మిక ప్రతినిధులకు మధ్య ఒప్పందం

గుంటూరు, మే 7

ఆంధ్ర స్టేట్ ఐ. యల్. టి. డి కంపెనీ వర్కర్సు యూనియన్, చీరాల ఐ. యల్. టి డి వర్కర్సు యూనియన్‌లు సంయుక్తంగా మేనేజిమెంటుకు సమర్పించిన మెమోరాండంపై [illegible] రోజులుగా మేనేజిమెంటుతో సంప్రదింపులు జరిగాయి.

ముఖ్యంగా మూలవేతనంలో 9 నయాపైసలు పెంచుటకు, కరవు భత్యం 581 పాయింటువరకు ప్రతి 10 పాయింటులకు 5 నయా పైసలు పెంచుటకు, సంవత్సర ఆదాయంలో (మూలవేతనం) మూడవ వంతు బోనసుగా యిచ్చుటకు, వైద్యసౌకర్యాలను అభివృద్ధి చేయుటకు, మరికొన్ని సౌకర్యాలు అంగీకరించినమీదట మేనేజిమెంటు, యూనియన్‌ల మధ్య 3 సంవత్సరాల వరకు ద్వైపక్ష ఒప్పందం జరిగింది.

అగ్రిమెంటుపై మేనేజిమెంటు తరఫున శ్రీయుతులు జి యం హాల్సు, మూర్తిగార్లు, యూనియన్‌ల అధ్యక్ష కార్యదర్శులు శ్రీయుతులు కె యల్. నరసింహం, జి. యస్. [illegible], యస్.డి జోసెఫ్‌గార్లు సంతకాలుచేశారు.

సాక్షులుగా శ్రీ బొల్లవట్ల సత్యనారాయణ, ప్రభుత్వవ్యాల్యుయేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ స్పెషల్ ఆఫీసరు శ్రీ జె. విశ్వనాథరెడ్డి సంతకాలు చేశారు.

ఈ ఒప్పందంవలన కార్మికులకు దాదాపుగా రు 8 లక్షలు ముట్టుతుంది.

మున్సిపల్ కార్మికుల ఆందోళనకు విజయం

కొత్త వేతనాలను అమలుజరపడానికి ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి హామీ

[విశాలాంధ్ర విలేఖరి]

తిరుపతి, మే 7

ఆంధ్రమున్సిపల్, లోకల్‌బోర్డ్సు ఎంప్లాయీస్ యూనియన్ కోరిన ప్రకారం మున్సిపల్ కార్మికులకు కొత్త వేతనాలు అమలుజరుపుతామని ప్రదేశ్ ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు నిన్న యిక్కడ అంగీకరించారు. యూనియన్ సంఘాధ్యక్షులు, శాసనసభ్యులు అయిన శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారికి పై విధంగా మంత్రి హామీయిచ్చారు.

వేతనాల కమిటీ సిఫారసు చేసిన విధంగా ఈ కొత్త వేతనాలు అమలు జరుప వలసిందిగా మున్సిపల్ అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు పంపినట్లు కూడా తెలుస్తూంది.

మున్సిపల్ స్వీపర్లు, స్కావెంజర్లు మొదలైనవారికి వేతనాలకమిటీ సిఫారసుచేసిన కొత్తజీతాలు, అలవెన్సులను 1959 అక్టోబరు 1 వ తేదీనుండి అమలు జరుపవలసిందనీ, మే 5 వ తేదీలోగా ప్రభుత్వం ఈ విధంగా అమలుజరుపని పక్షంలో 10 వ తేదీనుండి సమ్మె చేస్తామనీ ఆంధ్ర మున్సిపల్, లోకల్ బోర్డ్సు ఎంప్లాయీస్ యూనియన్ నోటీసు ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. సంప్రదింపుల ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు నిన్నయిక్కడ మకాంచేసి ఉన్న ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని కలుసుకుని కార్మికుల న్యాయమైన కోర్కెలను ఈ తుదక్షణంలోనైనా అంగీకరించి సమ్మె చేయవలసిన పరిస్థితి రాకుండా చేయాలని కోరారు. అందుమీదట ఆర్థిక మంత్రి మున్సిపల్ కార్మికులకు 1959 అక్టోబరు 1 నుండి కొత్త జీతాలను అమలు జరుపుతున్నామని తెలియజేశారు.

సమ్మె కార్యాచరణ కమిటీ సమావేశం

విజయవాడ, మే 7

మున్సిపల్ కార్మికులకు కొత్త వేతనాలను వారుకోరిన తేదీనుండి అమలుచేయడానికి ఆర్థికమంత్రి అంగీకరించినట్లు రాష్ట్ర మునిసిపల్ కార్మిక సంఘాధ్యక్షులు వెంకటేశ్వర్లుగారు నేడు తిరుపతి నుండి రాష్ట్ర సంఘ కార్యాలయానికి ఒక టెలిగ్రాం పంపారు.

మంత్రి హామీనివ్వడంవల్ల ఇప్పుడు తీసుకోవలసిన చర్యగురించి చర్చించి తగిన నిర్ణయాన్ని చేయడానికి సమ్మె కార్యాచరణ కమిటీ సమావేశం నేటి రాత్రి ఇక్కడ జరుగుతుందనీ కార్యదర్శి శ్రీ బూరాడ సీతారామయ్యగారు ప్రకటించారు.

ప్రభుత్వ ఉత్తర్వు వచ్చినట్లు విజయవాడ కమిషనర్ వెల్లడి

విజయవాడ మున్సిపల్ కార్మికులు దాదాపు 800 మంది నేడు కమిషనర్ స్పెషల్ ఆఫీసు ఎదుట తమ కోర్కెలను అంగీకరించవలసిందిగా ప్రదర్శనం జరిపారు. కొత్తజీతాలు అలవెన్సులు 1959 అక్టోబరునుండి అమలుచేయవలసిందిగా ప్రభుత్వం వద్ద నుండి ఈరోజుకే జి. ఓ. వచ్చినట్లు, ఆ విధంగా జీతాల బిల్లు తయారుచేసి కార్మికులకు యివ్వనున్నట్లు రాష్ట్ర సంఘ కార్యదర్శి శ్రీ బూరాడ సీతారామయ్యగారికి కమిషనర్ తెలియజేశారు.

నాగపూర్, మే 6

నాగ-విదర్భ ఆందోళనోద్యమంలో నాగపూర్‌లో ఏప్రిల్ 27 నుండి యింతవరకూ మొత్తం వెయ్యిమందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 18 మంది మహిళలున్నారు.

నేడు నగరం ప్రశాంతంగావుంది.

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని
గడగడ లాడించిన
ఆంధ్ర మహావీరుడు
అల్లూరి సీతారామరాజు
జీవిత విశేషాలు
3 వ పేజీలో

ఆఫ్రికా దేశాల ఆర్థికాభివృద్ధి

భారత ప్రజలూ, ప్రభుత్వమూ సహకరించాలని కెన్యానాయకుని విజ్ఞప్తి

అహ్మదాబాద్, మే 6

స్వాతంత్ర్యం పొందిన లేదా త్వరలో పొందనున్న ఆఫ్రికా దేశాల ఆర్థికాభివృద్ధిపట్ల భారత ప్రభుత్వమూ, ప్రజలూ శ్రద్ధవహించి, సహాకారం అందివ్వాలని కెన్యా భారతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ శివభాయి అమీన్ నేడిక్కడ ఒక పత్రికా గోష్ఠిలో విజ్ఞప్తిచేశారు.

ఆయన యింకా యిలా తెలిపారు. భారతదేశం తన సిద్ధాంతాలకు శక్తిస్తోమతలకు అనుగుణంగానే ఆఫ్రికా దేశాల పారిశ్రామికీకరణ పథకాలలో పాల్గొనవచ్చు. ఆఫ్రికా ప్రజల పోరాటాలకు తమ సంఘీభావాన్ని ప్రదర్శించడానికి భారత ప్రజలకు ఇదిచాల అవసరం. ఈనాడు ఆఫ్రికాదేశాలలో నిరుద్యోగ సమస్యలో బాధపడుతున్న లక్షలాదిమంది భారతీయులకు ఉద్యోగవసతి కల్పించడానికి అవకాశాలు చూపిన వారవుతారు" అని ఆయన అన్నారు.

అమీన్ ప్రధాని నెహ్రూను, తదితర నాయకులను కలుసుకునే నిమిత్తం గత నెలలోనే భారతదేశం వచ్చారు.

అమీన్ యింకా యిలా అన్నారు: ఆఫ్రికా ప్రజా నాయకులు గనుక సహకారాన్ని అర్థిస్తే అందుకు తాము సిద్ధంగా వున్నామన్న భారత నాయకుల ప్రకటనలతో తూర్పు ఆఫ్రికాలోని భారతీయులు ఏకీభవిస్తున్నారు తామందివ్వగల సహకారానికి ఎటువంటి షరతులూ లేనట్లయితే ఆఫ్రికా దేశాలకు ఆర్థిక సహాయాన్నందించడంలో భారతదేశం యితర దేశాలతో చేతులు కలపవచ్చు.

"సత్వర ఆర్థికాభివృద్ధికై యితర దేశాలు ముఖ్యంగా ఆసియాలోని స్వతంత్ర దేశాలు ప్రకటించిన సహాయానికి ఘనా, నైజీరియా, కెన్యా, టాంగన్యీకాలాంటి ఆఫ్రికా దేశాలలోని బాధ్యతగల నాయకులు హర్షం వెలిబుచ్చారు.

ఈనాడు ఆఫ్రికన్లకూ, అక్కడున్న భారతీయులకూ మధ్య మంచి సంబంధాలే వున్నాయి. ఆయినా [illegible] అనేకమంది భారతీయులు నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారు. అందుచేత ఆఫ్రికాదేశాలు పారిశ్రామికంగా వృద్ధి గాంచడానికి భారతదేశం తగు చేయూతనివ్వడం అవసరం. దీనివల్ల లాభపడేది ఒక్క ఆఫ్రికన్లే కాదు ఈ దేశాలలో నివసిస్తున్న భారతీయులు కూడా లాభపడతారు

తూర్పు ఆఫ్రికాలో భారతీయులు

"తూర్పు ఆఫ్రికాలో 3 లక్షలమంది భారతీయులున్నారు వారిలో ఒక్క కెన్యాదేశంలోనే 1½ లక్షలమంది వున్నారు. కెన్యాలోని భారతీయులలో నూటికి 95 మంది వివిధ వృత్తులలో వుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వున్నారు. ప్రయివేటు సంస్థల్లో వున్నారు. చిల్లర వర్తకులుగా కూడా వున్నారు. ఈ భారతీయుల్లో నిరుద్యోగ సమస్య నేడు తలెత్తింది."

మలయా ప్రధానిచర్యకు ఉప ప్రధాని మద్దతు

కౌలాలంపూర్, మే 6

లండన్‌లో దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి ఎరిక్ లౌతో జాతి విచక్షణా విధానంపై జరిపే సంప్రదింపులను మలయా ప్రధాని టుంకు అబ్దుల్ రహమాన్ తెగతెంపులు చేసివేయడాన్ని మలయా ఉపప్రధాని నేడిక్కడ సమర్థించారు.

ఎరిక్ లౌతో మాట్లాడుతూన్న మలయా ప్రధాని ఆ సంభాషణలు పూర్తికాకుండానే మధ్యలో వాకౌట్ చేశారు.

"మలయా శాసనసభ యిచ్చిన ఆదేశాన్ని ప్రధాని అబ్దుల్ రహమాన్ పాటించారు. దొరికిన మొదటి అవకాశాన్నే ఉపయోగించుకొని ఈ జాత్యహంకార విధానాన్ని కొనసాగించే సమస్యను లేవనెత్తారు.

"ప్రపంచం మేలుకున్నా లెక్క చేయనంత మొండితనాన్ని చూపే వారితో సంప్రదింపులు సాగించడం అనవసరం" అని ఉపప్రధాని టుంకు అబ్దుల్ రజాక్ బిన్‌హుస్సేన్ చెప్పారు. ప్రధాని తిరిగి మలయాకు రావడంతోనే నాయకులంతా యీవిషయమై సమాలోచిస్తామని కూడ అన్నారు.

నాల్గవ ప్రదేశ్ మైకా కార్మిక మహాసభ

గూడూరు, మే 7

నాల్గవ ఆంధ్రప్రదేశ్ మైకాకార్మిక మహాసభ చెన్నూరులో ఈ నెల 15న జరుగుతుంది. శ్రీ పి. సి. రెడ్డిగారు అధ్యక్షత వహిస్తారు. శ్రీ టి. బి. విఠల్ రావు (ఎం. పి.) గారు ప్రారంభిస్తారు.

జాతీయ పుస్తకసంస్థ ప్రచురణలు

న్యూఢిల్లీ, మే 6

జాతీయ పుస్తకసంస్థవారి ఆధ్వర్యాన ఇంగ్లీషులోను, పదకొండు భారతీయ భాషల్లోను, మరొక 23 పుస్తకాలు వచ్చే రెండు మూడు మాసాల్లో వెలువడనున్నాయి. పుస్తకాలు ప్రస్తుతం అచ్చవుతున్నాయి.

ఈ పుస్తకాల్లో క్రింది గ్రంథాలున్నాయి:

శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి "నేను పనిచేస్తున్న నాటి జీవిత స్మృతులు," శ్రీ కాళిదాస్ ఇంగ్లీషులో రచించిన 'బుద్ధుని సందేశం', శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ "భారతదేశం—నేడూ, రేపూ", డా. రాధాకృష్ణన్ రచించిన "కలి", శ్రీ షీర్ "జ్వాలాముఖి", సాఫ్‌దార్ అష్ "హిందూస్థానీ నాటకాలు", డా. సి.వి. రామన్ "విజ్ఞాన శాస్త్రవిషయాలు", డా. యస్. దత్తు "మహాపరి నిర్వాణ కథ".

జాతీయ పుస్తక సంస్థ ఇదివరకే తొమ్మిది ప్రచురణలను వెలువరించింది. ఈ సంస్థ నేడొక పత్రికా ప్రకటన చేస్తూ మరో 12) పుస్తకాలను వివిధ రాష్ట్రాలలో ప్రచురణకు సిద్ధం చేస్తున్నామనీ, మరో 75 పుస్తకాలు, వారి పరిశీలనలో వున్నవనీ తెల్పారు.

ఈ సంస్థ ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించి గ్రంథాలయాలకు, విద్యాసంస్థలకు ప్రజలకు ఉత్తమ గ్రంథాలు చౌకగా అందించే వుద్దేశంతో 1957 లో ఏర్పడింది.

దీనికిఅధ్యక్షుడు శ్రీ సి.డి.దేశముఖ్. ఇందులో రచయితలు, విద్యావేత్తలు, సాహిత్య అకాడమీ సభ్యులు కేంద్రవిద్యా, సమాచార, ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రతినిధులు మొత్తం 15 మంది సభ్యులున్నారు.

ప్రపంచ ఆరోగ్యసంస్థ; కుటుంబ నియంత్రణం

జెనీవా, మే 5

ప్రపంచ ఆరోగ్యసంస్థ సాధ్యమైనంత త్వరలో కుటుంబ నియంత్రణ సమస్యను చేపట్టుతుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ సమావేశంలో మాట్లాడుతూ భారత ఆరోగ్యశాఖమంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ చెప్పారు.

జనాభా లెక్కల నిపుణులు భవిష్యత్తులో ప్రపంచ జనాభా ఆహారోత్పత్తిని మించి పెరిగిపోయే ప్రమాదాన్ని గురించి హెచ్చరించారని అన్నారు.

ఈ సందర్భంలో భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టిందనీ; అది నాలుగు విధాలుగా—అంటే, సదుపాయాలు, శిక్షణ, బోధన, పరిశోధనా విభాగాలుగా అమలు జరుగుతున్నదనీ తెలిపారు.

గర్భ నిరోధంకోసం లోపలికి పుచ్చుకొనే మందును కనిపెట్టడానికి పరిశోధనలు జరుగుతున్నాయన్నారు.

"మా ప్రజలు యీ సంతాన నిరోధ కార్యక్రమాన్ని ఆమోదించారని చెప్పడానికి నాకు చాలా సంతోషంగా వుంది. ఈ సమస్యకు వైద్య, సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థకూడ ఇంకేమాత్రం ఆలస్యం లేకుండా యీ కార్యక్రమాన్ని చేపట్టినట్లయితే మా ప్రతినిధివర్గం సంతోషిస్తుంది" అన్నారు.

నాగపూర్ లో కర్ఫ్యూ సడలింపు

నాగపూర్, మే 7

నేడుదయం 10-30 గంటలకు కర్ఫ్యూ నిబంధనలు 7 గంటలపాటు సడలించారు. నగరంలోని కల్లోలిత ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలయిన ఇత్‌వారి, మస్కాసాత్, గాంధీబాగ్ మొదలగు ప్రాంతాలన్నీ వెంటనే జనంతో కిటకిట లాడడం ప్రారంభించాయి. బంగారం, ధాన్యం, నూనెతోపాటు చిల్లర వ్యాపారం వారం తరువాత మొట్టమొదటిసారిగా మళ్ళీ ప్రారంభమయింది. ముఖ్య కేంద్రాల్లో మాత్రం పోలీసులు గస్తీ తిరుగుతున్నారు.

నాగపూర్ నాయకునికి శ్రీ పంత్ లేఖ

నాగపూర్, మే 6

రాజ్యాంగంలోని 371వ అంశం క్రింద నాగపూర్ ఒప్పందంలోని ప్రధాన విషయాలన్నీ వస్తాయని, ఇది పట్ట సమ్మతమైన వేసని కేంద్ర హోం మంత్రి శ్రీపంత్ నాగపూర్‌కు చెందిన మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు శ్రీ ఆర్. కె. పాటిల్‌కు హామీ యిచ్చారు.

శ్రీ పాటిల్ ఏప్రిల్ 27న వ్రాసిన జాబుకు శ్రీ పంత్ ఈ నెల మూడో తేదీన జవాబిచ్చారు. శ్రీ పాటిల్ తమ లేఖలో, బొంబాయి విభజన బిల్లులో నాగపూర్ ఒప్పందాన్ని చేర్చడానికి సంబంధించిన కొన్ని విషయాలను ప్రస్తావించారు.

ఆఫ్రికా సమస్యపై నెహ్రూ

(1వ పేజీ తరువాయి)

అని ప్రధాని నెహ్రూ చెప్పారు.

ఆతర్వాత భారతదేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం యీ జాతి దురహంకార విధానంపట్ల అనుసరించిన వైఖరిని వివరిస్తూ, భారత జాతీయోద్యమం పుట్టుక, మహాత్మా గాంధీకి సంబంధించినంతవరకు అది దక్షిణాఫ్రికాలోనే ఉద్భవించిందని ప్రధాని నెహ్రూ తెలియజేశారు.

"దక్షిణాఫ్రికా జైళ్ళలోనే మహాత్మా గాంధీ తమ సత్యాగ్రహ యాత్రను ఆరంభించారు. వారికొక్కరికే ప్రత్యేకంగా సాధ్యమైన పద్ధతులను మొదట అక్కడే అనుసరించి, వాటిని ఆ తర్వాత భారతదేశానికి తెచ్చారు" అన్నారు.

అనంతరం 1947 లో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన నాటినుంచి ఐక్య రాజ్యసమితిలో జాతి విచక్షణా విధానాన్ని గురించి భారతదేశం తీసుకొన్న చర్యలను సమీక్షించారు.

ఐరాస ఆమోదించిన తీర్మానం ప్రకారం సంభాషణలు జరపటానికి కూడా దక్షిణాఫ్రికా ప్రభుత్వం నిరాకరించడంవల్ల ఆదేశంతో భారతదేశం దౌత్యసంబంధాలు తెంచివేసుకొన్నదనీ, ఆదేశంతో జరిగే ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని కూడ గత పదేండ్లనుంచి నిలిపివేసిందనీ తెలిపారు.

ఆఫ్రికాలోని భారతీయుల కర్తవ్యం

ఆఫ్రికా ఖండంలో నివసించే భారతీయులపట్ల భారత ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ అక్కడకు పోయేవారు ఆ ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యమియ్యాలని తాను స్పష్టం చేస్తూనేవున్నానని ప్రధాని నెహ్రూ చెప్పారు.

"ఏఆఫ్రికన్ జాతివారిహక్కులకుగాని లేక వారి స్వాతంత్ర్యానికి గాని క్షతి కలిగేదిగా పోయే భారతీయ కోర్కెలను దేనినీ మేము సమర్థించం.

"చిట్టచివరకు జరిగే దేమిటంటే అక్కడ ఆఫ్రికన్లకు ఇష్టమయితేనే భారతీయులక్కడ నివాస మేర్పరచుకోగలరు. (హర్షధ్వానాలు)

"అనేక ఆఫ్రికా రాజ్యాలు స్వతంత్ర రాజ్యాలవుతున్నాయి. ఇందుకు మేము ఆనందోత్సాహాలను వెల్లడిస్తున్నాం. కాని విచిత్రమేమిటంటే, ఇంత సుఖప్రదమైన పరిణామాలు జరిగే సందర్భంలోకూడ ఏదో మరో ప్రపంచానికి సంబంధించిన జీవిత దృక్పథం, ఆధునిక ఆశయాలతో ఎలాంటినిమిత్తం లేని దృక్పథం, అందులోను ఐరాస ప్రణాళికకు విరుద్ధమైన ధోరణి ఇంకా వుంటోంది. ఇది చాలా ఆశ్చర్యకరం" అన్నారు.

దక్షిణాఫ్రికా పేరు ఎత్తకుండా ప్రధాని నెహ్రూ ఇలా చెప్పారు:

"విద్రోహ చర్యల పేరిట విచారణలు జరిపి, వేలాదిప్రజలను జైళ్ళపాలు చేయడమనే పని చాలా సంవత్సరాలుగా జరుగుతూండడం మాకు తెలుసు. అక్కడి జైళ్ళలో పరిస్థితులు చాలా అధ్వాన్నంగా వున్నాయనే ఎదురులేని సాక్ష్యాన్ని కూడా నేను చూచాను. అక్కడ కరడుగట్టిన జాత్యహంకారం తాండవిస్తూండగా ఇదంతా జరగక తప్పదు" అన్నారు.

వ్యక్తిగతంగా చూస్తే అందరి లాగానే దక్షిణాఫ్రికావారు కూడా అంతే మంచివారనీ, కాని వారు అనుసరిస్తున్న విధానం ఫలితంగా వారిమంచి అంతా అణగారిపోయి, వారిలోనిచెడు మాత్రమే వెల్లుబుకుతున్నదనీ, ఏనాటికైనా వారిలోని మంచి బయటపడగలదనే ఆశిస్తున్నాననీ ప్రధాని నెహ్రూ చెప్పారు.

"నిర్బంధానికి ప్రజలు తల ఒగ్గరు"

టర్కీ ప్రతిపక్ష నాయకుని ప్రకటన

అంకారా, మే 6

నిర్బంధానికి టర్కీ ప్రజలు తల ఒగ్గబోరని టర్కీలో ప్రతిపక్షమైన రిపబ్లికన్ ప్రజా పార్టీ నాయకుడు, 76 ఏండ్లు వృద్ధుడు అయిన ఇస్మెత్ ఇనోను నేడిక్కడ చెప్పారు.

ప్రధాని మెండరీస్ ఆధ్వర్యాన నడుస్తున్న ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ దేశంలో ప్రజలకు అన్యాయం జరగడం ఉన్నంతకాలం ప్రజల వ్యతిరేకత, తమ పార్టీ వ్యతిరేకత సాగితీరుతుందని ఇనోను చెప్పారు.

"ఇప్పటివరకు మేము విప్లవాన్ని గురించి ఆలోచించలేదు.

"టర్కీ ప్రజలకు నేటిపాలన అవసరంలేదు" అన్నారు.

గోవా సమస్యపై భారత ప్రభుత్వ వైఖరి

శాంతియుత పద్ధతులద్వారాసమస్య పరిష్కరించుకోవాలనే వాంఛకు నిదర్శనమని నెహ్రూ

లండన్, మే 3

"భారత ప్రభుత్వం గోవా సమస్యపట్ల అనుసరిస్తున్న వైఖరివల్ల సమస్యా పరిష్కారం కొంత ఆలస్యమైనా, కోపతాపాలకు యెంత ఆస్కారమున్నా, బలప్రయోగానికి పూనుకోకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని మేమెంత ఆతురపడుతున్నామో వ్యక్తమవుతుంది" అని భారత ప్రధాని నెహ్రూ నేడన్నారు.

వెస్ట్ మినిస్టర్ హాల్లో ఇండియా లీగ్ ఏర్పాటు చేసినసభలో శ్రీనెహ్రూ ప్రసంగిస్తూ గోవా సమస్యను, ఆఫ్రికాలో పోర్చుగీసువారి వలస అంగోలా విషయాన్ని ప్రస్తావించారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వ జాత్యహంకార విధానంవల్ల కామన్వెల్తు దేశాలలో జరిగే పరిణామాలను గురించి వివరించిన తరువాత పోర్చుగీసు అంగోలాను గురించి ప్రస్తావిస్తూ "ఈ చీకటి కోణంనుండి ఎలాంటి వార్తలు బయటికి రావు"అని అన్నారు.

"అంగోలాను తీసుకొండి అది పోర్చుగీసు వారి వలస" అని చిరునవ్వుతో ఇలా అన్నారు: "పోర్చుగీసు వారికి వలస దేశాలనేవే లేవు సుమా! అవన్నీ పోర్చుగీసుదేశంలోని రాష్ట్రాలే ఏ పత్రిక అయినా అక్కడకి తన విలేకరిని పంపించే సాహసం చేయగలదా? చేసినా, వాళ్ళకు ప్రవేశమే ఉండదు. ఇది మహా గాఢాంధకారమలముకొన్న చోటు. ఆఫ్రికాలో అన్నిటికన్నా అధ్వాన్న మయినది. అయితే గోవాను గురించి నాకుపోర్చుగీసు వారిపైవున్న కష్టంతో ఇలా అనడంలేదు" (నవ్వు).

ఆ తరువాత నెహ్రూ భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించిన తరువాత, భారతదేశంలో ఫ్రెంచి భూభాగం విషయమై ఫ్రాన్సుతో సాగించిన శాంతియుత సంభాషణలను గురించి ప్రస్తావించారు. గోవాసమస్యపై ఇలా అన్నారు:

"మేము మొదట వినయంగానే పోర్చుగీసు ప్రభుత్వానికి ఒక లేఖ పంపించాము. బ్రిటిష్ వారు భారతదేశంలో అధికారం వదలుకోవడంతో పరిస్థితులు ఏలా మారాయనీ, కాబట్టి భారతదేశంలోని పోర్చుగీసువారి చిన్న సామ్రాజ్యంకూడా అంతంకావడం సబబనీ అందులో చెప్పాము. (నవ్వు, చప్పట్లు). కాని వారంగీకరించలేదు సరికదా మాతో ఆవిషయమై మాట్లాడడానికి కూడ ఒప్పుకోలేదు.

గోవాపై తమకుగల అధికారం పోపు జారీచేసిన ఉత్తర్వువల్ల తమకు సంక్రమించినదని మాత్రంవారు సమాధానంచెప్పి పూరుకున్నారు. ఈ ఉత్తర్వు 16వ శతాబ్దంలోనో, లేక 17వ శతాబ్దంలోనో జారీఅయిందట. నాకు సరిగా గుర్తులేదు.

మీలో చరిత్ర అధ్యయనం చేసిన వారికి ఒక విషయం జ్ఞప్తి వుంటుంది ఆ రోజుల్లో వున్న పోపు (క్రైస్తవ మతాధిపతి) ఉదారంగా ప్రపంచంలో అర్ధం స్పెయినుకు మిగతాఅర్ధం పోర్చుగల్లుకు ధారాదత్తం చేశారు. ఇలాంటి దృక్పథం గల వారితో వాదించడం కొంచెం కష్టమే.

అందువల్ల ఈ సమస్య తెగకుండా ఉంది. ఇందుకు మమ్మల్ని చాలామంది విమర్శిస్తున్నారు వారుసహనంకోల్పోవడం సహజమే.

గోవాభౌగోళికంగా భారతదేశంలో భాగంగావుంది. అది రాజ్యాంగరీత్యా కూడా భారతదేశంలో భాగమై తీరాలని ప్రతి ఒకరు అంగీకరిస్తారు.

కాని మేము ఈ సమస్యను శాంతియుత పద్ధతులతో పరిష్కరించుకోవాలని, దుష్పరిణామాలకు దారితీసే విధానం అవలంబించ కూడదని నిర్ణయించుకొన్నాము."

ప్రధాని నెహ్రూ ఉపన్యాసాన్ని 2 వేలమంది ప్రేక్షకులు-భారతీయులు ఆఫ్రికనులు, బ్రిటిష్‌వారు విన్నారు. సభ వేదికపై అట్లీ దంపతులు, క్రిప్స్ సతి, లారెన్స్ ప్రభువు, అనేక దేశాల దౌత్యప్రతినిధులు వున్నారు.

పార్లమెంటు సభ్యుడు రైనాల్డ్ సోరెన్‌సెన్ సభకు అధ్యక్షత వహించారు.

చైనాసమస్య ప్రస్తావన

భారతదేశ అంతరంగిక పరిస్థితిపై నెహ్రూ కొంతసేపు ప్రసంగించిన తరువాత ప్రేక్షకులనుండి కొందరు "చైనా విషయమేమి?"అని అరచారు. అందుకు నెహ్రూ ఇలా సమాధానమిచ్చారు:

"నేను ఆ విషయం చెప్పకుండా తప్పించుకోవడంలేదు. (నవ్వులు, చప్పట్లు) చైనాప్రధాని చౌ-ఎన్-లైతో దీర్ఘంగా చర్చించాను. అతి స్నేహపూర్వకమైన చర్చలే (నవ్వు చప్పట్లు) అయితే, ఉభయదేశాలమధ్య భావాలలో కేమి,విషయాలలో నేమిచాలా భేదమున్నదని సంభాషణల్లో తేలింది. ఈ విషయాలకు సంబంధించినంతవరకు ఎవరెవ్వరు ఎక్కడెక్కడ వున్నారో తెలుసుకోవాలని, మేమువిషయాలన్నీ తరచి చూడాలని నిశ్చయించాము. చైనా భారత దేశాల అధికారులు సమావేశమై వీటిని గురించి చర్చ జరిపి బహుశా మూడు నాలుగు నెలలలో నివేదిక సమర్పిస్తారు. అన్ని విషయాలనూ తరచి అసలు సంగతు లేమిటో ఎత్తిచూపితే, ఆతరువాత మా సమస్య చర్చించడం సులభమవుతుంది."

'జాత్యహంకారాన్ని ఎదిరించండి'

ఆసియా ఆఫ్రికాదేశాలకు కృష్ణమీనన్ పిలుపు

న్యూఢిల్లీ, మే 6

"కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా - ఆఫ్రికాదేశాలు ఐక్యంగా నిలబడి, జాత్యహంకారంపైన, వలస విధానంపైన తమకున్న అభిప్రాయాలను ప్రపంచం అంగీకరించేలా కృషి చేయాలి" అని భారత రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడన్నారు.

"మన శ్రేయస్సుకోసం, మన మనుగడకోసం, వలస పెత్తందారీ విధానం నిర్మూలింపబడంకోసం, మనం, అంటే కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాల వాళ్ళం ఒక విషయం గుర్తించాలి. మన కొక ఉమ్మడి శత్రువున్నాడు. మానవ హక్కులనే వాటిని రద్దు చేయాలని ప్రయత్నించే శక్తులే ఈ ఉమ్మడి శత్రువు" అన్నారు శ్రీ కృష్ణమీనన్.

దక్షిణాఫ్రికా జాత్యహంకార విధానానికి నిరసన తెలియజేయడానికై ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో శ్రీ మీనన్ ప్రసంగిస్తూ ఇంకా ఇలా అన్నారు:

సభలో ప్రసంగించిన వారంతా జాత్యహంకార విధానం, పాశవికమనీ, న్యాయపాలనకూ, మానవ గౌరవానికీ వ్యతిరేకమనీ విమర్శించారు.

సభను ఆసియా ఆఫ్రికా సంఘీభావ సంస్థ, భారత అరబ్ సంఘం, భారత - ఘనా సాంస్కృతిక సంఘం, భారత-ఐక్య అరబ్ రిపబ్లిక్ మిత్ర సమితి కలిసి ఏర్పాటు చేశాయి. శ్రీమతి రామేశ్వరి నెహ్రూ సభకు అధ్యక్షత వహించింది.

భారతదేశంలో ఇండోనేషియా రాయబారి శ్రీ ఆర్. హెచ్. అబ్దుల్ కాదర్ సభలో ప్రసంగిస్తూ, "వలస విధానమూ, జాత్యహంకారమూ, రెండు తలల విషసర్పం. దీనిని చంపివేయాలి" అని అన్నారు.

దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు విధించాలని శ్రీమతిరామేశ్వరినెహ్రూ కోరారు.

రాజ్యసభ సభ్యుడు శ్రీ పి. యన్. సప్రూ మొదలగువారు ప్రసంగించారు.

దక్షిణాఫ్రికా సమస్యపై బ్రిటిష్‌మంత్రివర్గంచర్చ

లండన్, మే 6

దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రితో జాతి విచక్షణా విధానంపై సంభాషణలు జరుపుతున్న మలయా ప్రధాని ఆ సంభాషణలు పూర్తికాకుండానే వాకౌట్ చేసినందువల్ల కలిగిన తీవ్ర పరిస్థితిని సమీక్షించేందుకు నేడుబ్రిటిష్ మంత్రివర్గం సమావేశమైంది. ప్రధాని మాక్మిలన్ పరిస్థితిని వివరించారు.

లండన్‌లో కామన్వెల్తు ప్రధాన మంత్రుల సభ ఆరంభమైన తర్వాత బ్రిటిష్ మంత్రివర్గం సమావేశంకావడం ఇదే మొదలు.

దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి ఎరిక్ లౌ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌తో సమావేశమై, యీ సమస్యను గురించి చర్చించిన పిమ్మట ప్రధాని మాక్మిలన్ బ్రిటిషు మంత్రివర్గాన్ని సమావేశపరచారు.

కావలివద్ద లారీ ప్రమాదం

రెండెద్దుల మరణం

కావలి, మే 3

నెల్లూరుజిల్లా కావలికి 5 మైళ్ళ దూరంలో ముసునూరు రైల్వేస్టేషన్ వద్ద రాత్రి తెల్లవారుఝామున సుమారు 4 గంటల సమయంలో కావలికి చెందిన రెండెద్దులబండ్లు సరుకులతో పోతుండగా, ఎదురు వస్తుండిన లారీ (ఎ. పి. జి. 1236) ఢీకొనింది. రెండెద్దులు వెంటనే చనిపోయినవి ఒక ఎద్దుకు కొమ్ములు విరిగిపోయినవి. లారీ వాళ్ళు పట్టుబడ్డారు. కేసు దర్యాప్తు జరుగుతున్నది. (వి. వి.)

శిఖరాగ్ర సమావేశం: పశ్చిమాగ్ర సమావేశం

పారిస్, మే 6

సోవియట్ ప్రధాని కృశ్చేవ్‌తో కలిసి మేనెల 16వ తేదీన పారిస్ నగరంలో పశ్చిమాగ్ర రాజ్యాల నాయకుల సమావేశం కాబోయేముందు 15వ తేదీన పశ్చిమ దేశాల నాయకులు విడిగా సమావేశమై ఉమ్మడి కార్యక్రమం గురించి చర్చించుకొంటారని ఫ్రెంచి విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు నేడిక్కడ చెప్పారు.

అధ్యక్షులు ఐసెన్‌హోవర్, డిగాల్, ప్రధాని మాక్మిలన్లు ఆవిధంగా సమావేశమైనపుడు వారితో పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ అడినోవర్ కూడా సంప్రదిస్తారని ఆ ప్రతినిధి అన్నారు.

విశాఖపట్నం రిక్షాకార్మికసంఘ ఆఫీసు

విశాఖపట్నం, మే 1

విశాఖపట్నంలోని సైకిల్ రిక్షా కార్మికులసంఘం బౌడారారోడ్‌లో విజయా సినిమాటాకీస్‌కు ప్రక్కన ఒక గదిలో తన కార్యాలయాన్ని యేర్పర్చుకొన్నది. ఆఫీసును సంఘాధ్యక్షులు శ్రీ యం. వి. భద్రంగారు నేటి సాయంత్రం ప్రారంభోత్సవం చేశారు. (వి. వి.)

ఖమ్మం ధాన్యం మార్కెట్‌లో ప్రతిష్టంభన

రైతులు తెచ్చిన సరుకుకు 'జల్లెడపోత' అమలుపర్చటంవల్ల ఏర్పడిన పరిణామం

ఖమ్మం, మే 6

రైతులు తెచ్చిన సరుకులో నేయ శనగ, మిర్చి తప్ప తతిమ్మా సరుకంతా మార్కెట్టులో జల్లెడపట్టించి మాత్రమే ఇవ్వాలని పాలకవర్గం తీర్మానించినందువల్ల ఖమ్మంధాన్యంమార్కెట్ లో ఈనెల రెండో తేదీనుండి ప్రతిష్టంభన ఏర్పడింది. అనేక దూర ప్రాంతాలనుంచి బండ్లుకట్టుకొని వచ్చిన వందలాది రైతాంగం తమ సరుకు అమ్ముడుపోక, పట్టణంలో నిలువనీడలేక అల్లాడి పోతున్నారు.

ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు మార్కెట్టు ఉన్నతాధికారి కూడా వరంగల్ నుండి వచ్చారు. అయినప్పటికి ఇప్పటి పరిస్థితులను అనుకూలంగా తేలేకపోతున్నారు.

ఈ అవకాశాన్ని వినియోగించుకొని కొందరు వ్యాపారస్తులు దిక్కులేక తిరుగుతున్న అమాయక రైతుల వద్ద అగ్గువధరలకు సరుకులు తీసుకొని తమ ఇష్టంవచ్చినట్లు [illegible] సాగిస్తున్నారు.

రైతులుపండించిన ధాన్యం, వ్యవసాయ సరుకులను అమ్ముకోవడానికై నైజాం ప్రభుత్వం ఇన్ని సంవత్సరాలక్రితం యిచ్చిన మార్కెట్టు యాక్టును అమలుపరచింది. దానికి కొన్ని చట్టాలుచేసి, ఒకకమిటీని నియమించింది. ఒక ఉద్యోగస్థుడు దీనిని అజమాయిషీ చేసేవాడు. రైతు స్వతంత్రంగానే తన సరుకును అమ్ముకొని వెళుతూ వుండేవాడు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత యీ మార్కెట్టుకూడా రాజకీయాలకు ఆలవాలమైంది. ఇది పెత్తందారీ వర్గం చేతులలోకి పోయింది. రైతాంగానికి యిది కష్టదాయకంగా తయారైంది.

దీనికి ప్రజాస్వామిక పద్ధతులలో ఎన్నికలు జరపాలని చాలాకాలంగా రైతుసంఘం ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చింది. కాని అలా చేయకుండా ప్రభుత్వం తన యిష్టంవచ్చినవారినే దీనికినామినేట్ చేసింది. ఈమార్కెట్ కమిటీలో కొందరు రైతు ప్రతినిధులని, కొందరు వర్తక ప్రతినిధులని నామకరణం చేశారేగాని దానిలో రైతు కష్టాలను కనుగొని విచారించేవారు లేరు.

ఇప్పుడు అనేకమంది చిన్న వ్యాపారస్తులు రైతులు తెచ్చే సరుకును మార్కెట్టులో [illegible] వ్యాపారస్తులకు (ఖరీదుదార్లు) విక్రయించి [illegible] తృప్తిపడుతుంటారు. అయితే యిప్పటి ఖరీదుదార్లు రైతులు తెచ్చిన సరుకును ఏదోవంకలు చూపించి, దానిని దోపిడీ చేయడం పరిపాటి అయింది. రైతులకు జరిగే యీ అక్రమాన్ని గురించి మార్కెట్టు కమిటీ ఏనాడూ విచారించిన పాపానపోలేదు. కాని రైతులే చొరవ తీసుకొని మార్కెట్టు అధికార్ల దృష్టికి యీ దోపిడీని తీసుకొని వచ్చారు. రైతు తెచ్చిన సరుకును బండ్లపైనుంచి క్రిందపోసి పరిశీలించిన తరువాతనే [illegible] కొని, తూకంపట్టాలనే నిబంధనని ప్రవేశపెట్టారు. రైతుకు కొంతైనా లాభం వచ్చేందుకు యిటీవల కొన్ని ప్రయత్నాలు జరిగినవి.

అయితే ఖరీదుదార్లందరికీ తమదోపిడీ విధానం సాగేట్లుగా కనుపించలేదు. ఈ పద్ధతిని తొలగించాలని ప్రయత్నించారు. రైతు తెచ్చిన సరుకులో నేయశనగ, మిర్చి తప్ప తతిమ్మా సరుకంతా మార్కెట్టులో క్రిందపోసి తరువాత జల్లెడపట్టించి మాత్రమే ఇవ్వాలని తీర్మానం ఆమోదింపజేశారు.

ఇది జిల్లా కేంద్రంలోవున్న ఒకే ఒక మార్కెట్టు. అందువల్ల అనేక దూర ప్రాంతాలనుంచి ప్రతిరోజు వందల కొలదిబండ్లు ఇప్పటికి వస్తుంటాయి. ఇప్పటికివచ్చే రైతాంగానికి మార్కెట్టులో ఏలాంటి సౌకర్యాలు లేవు. వెనుకటి పద్ధతిలో రైతు తాను తెచ్చిన సరుకును అమ్ముకొని తూకంవేసేవరకు ఎండలో మాడవలసి ఉంటుంది. పోతే, నేడు ప్రవేశపెట్టిన "జల్లెడపోత" పద్ధతి అమలు జరిగినట్లు అయితే రైతు తిరుగుప్రయాణం చేయడం కష్టమవుతుంది. ఈ పద్ధతివల్ల రైతులకు, కార్మికులకు, చిన్న వ్యాపారస్తులకు, అమ్మకందార్లకు చాలా చిక్కులు కలుగుతాయనిచెప్పి, దీనిని ఇప్పటి చాలామంది వ్యతిరేకించారు. కాని ఖరీదు దార్లయిన పెద్ద వ్యాపారస్తులు దీన్ని అమలుజరపాలని పట్టుబట్టారు. ఈ వివాదంలో ఈ నెల రెండో తేదీ నుంచి మార్కెట్టు స్తంభించి పోయింది.

బొంబాయి వద్ద 700 ఇళ్లు భస్మీపటలం

బొంబాయి, మే 6

నేటి రాత్రి యిక్కడకు 15 మైళ్ళ దూరంలో వున్న మంఖుర్ద్ జనతా కాలనీలో అగ్ని ప్రమాదం సంభవించి కార్మికులకు చెందిన 700 పాకలు పూర్తిగా భస్మీపటలు మైపోయాయి.

ఈ సందర్భంలోనే ఒక పాకలో నిద్రపోతున్న ఏడు సంవత్సరాల పిల్ల చనిపోయింది. ఈపిల్లబట్టలకు నిప్పంటుకుంది. గుడిసెలోనుండిపోలేకఅక్కడనే ప్రాణాలు విడిచింది. మరో యిద్దరికి స్వల్పమైన గాయాలు తగిలాయి.

పైగా ఈ 700 కుటుంబాలవారికి చెందిన యావత్తు సామాగ్రి పూర్తిగా ధ్వంసమైంది.

ఆరు ఫైర్ యింజన్లు వచ్చినా, మొత్తం మంటలను ఆర్పడానికి 150 నిమిషాలకుపైగా పట్టింది. సత్వరమే ఫైర్ యింజన్లు రాబట్టిగాని, లేకపోతే ఆ చుట్టుపట్లవున్న మరో 3800పాకలు కూడా కాలిపోయేవి.

ఒక చిన్నదీపం గుడిసెకంటుకుని ఈ ప్రమాదం జరిగినదని తెలుస్తోంది.

వంగిమళ్ళలో 120 ఇళ్లు దగ్ధం

రు 60 వేలు నష్టం

వంగిమళ్ళ, మే 6

రాయచోటి తాలూకా వంగిమళ్ళ గ్రామంలో మొన్న అగ్ని ప్రమాదం జరిగింది. 120 యిళ్ళు కాలిపోయాయి. ధాన్యం 420 మూటలు, నగదు 4000/-, 5 తులముల బంగారం, 115 వరాగుల వేరుశనక్కాయలు, 1 దున్నపోతు, 1 అవుదూడ యివన్నీ కాలిపోయాయి.

పశువుల మేత, కట్టుగడ్డలు, యితర వ్యవసాయ పనిముట్లు వగైరా లన్నీ ఏమీ మిగలకుండా పూర్తిగా కాలిపోయినవి. గ్రామపు మొత్తం నష్టం దాదాపు 60 వేల రూపాయలు. చుట్టు పట్ల పల్లెల రైతులు 2పూటల భోజనం తీసుకొనిపోయి యిచ్చినారు. (వి వి.)

సింహళ నావికులకు భారత జాలర్లకు ఘర్షణ

వివరాలకై విదేశాంగశాఖ వాకబు

న్యూఢిల్లీ, మే 6

మద్రాసు కోస్తాకు 11 మైళ్ళ దూరంలో వున్న తివో అనే చిన్నదీవి వద్ద భారతీయ జాలర్లకు గస్తీ తిరుగుతున్న సింహళ నావికా దళంవారికి మధ్య ఘర్షణలు జరిగాయని వెలువడిన వార్తపై, ఆ సంఘటన వివరాలు తెలియజేయవలసిందిగా కొలంబోలోని తమ రాయబారిని భారత విదేశాంగశాఖ కోరింది.

ఇలాంటి సంఘటనలు పలుమార్లు జరుగుతున్నట్లు సింహళ పత్రికలు పేర్కొన్నాయి. ఇటీవల జరిగిన సంఘటన సందర్భంలో, సింహళ నావికాదళంవారు, భారతీయ జాలరులను కాలుస్తామని బెదరించారని తెలుస్తున్నది.

ఈ ప్రాంతంలో అనాదిగా భారతీయ జాలర్లు చేపలు పట్టుకొంటున్నారని భారత విదేశాంగ ప్రతినిధి నేడు విలేకరులతో అన్నారు. అయితే, సింహళంలోదొంగతనంగావిదేశీయులు ప్రవేశించకుండా సింహళ నావికాదళాలు గస్తీ తిరుగుతున్న విషయం ఈయన అంగీకరించారు. ఈ దీవిని, భారత వైమానిక దళం బాంబులు వేయడంలో తర్ఫీదు పొందడానికై వినియోగిస్తున్నది.

ప్రాగాటూల్స్ వివాదం

కార్మిక శాఖ చర్చలు

హైదరాబాద్, మే 6

లాకౌట్‌ను విరమింపచేసే ఉద్దేశంతో ప్రాగాటూల్స్ కార్పొరేషన్ మేనేజిమెంటుకు, కార్మికులకు మధ్య సామరస్య పూర్వకమైన ఒప్పందాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మికశాఖ నేడు ప్రయత్నించింది.

ఈ నెల 3వ తేదీ రాత్రినుండి సమ్మెలో పాల్గొంటున్న 200 మంది కార్మికులు సమ్మెను విరమించారనే విషయం పాఠకులకు విదితమే. కార్మిక మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి కోర్కెపైన వీరు సమ్మెను విరమించారు.

కార్మికమంత్రి మేనేజిమెంటు, కార్మిక ప్రతినిధులను కలుసుకొని చర్చిద్దా మనుకున్నారుగాని, నిన్నటి త్రైపాక్షిక సమావేశానికి మేనేజిమెంటు ప్రతినిధులు గైరుహాజరైనందున సమావేశం జరుగలేదు.

విభేదాలు తొలగించి, ఉభయులకూ సంతృప్తికరంగా ఉండేలాగున పరిష్కారాన్ని సాధించేందుకై కార్మికశాఖ అధికారులు మేనేజిమెంటు, కార్మిక ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు.

ప్రస్తుతం చర్చలు జరుగుతూండడంవల్ల, అంతకు ముందు నిరాహారదీక్ష సాగిద్దామనుకున్న కార్మికులు ప్రస్తుతానికి వాయిదా వేశారు. (వి వి)

నెల్లూరుజిల్లా మోటార్ కార్మికసభ

నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు, మే 6

నెల్లూరు జిల్లా మోటార్ లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశం నెల్లూరు పర్మనెంటు ఫండాఫీసులో ఏప్రిల్ 30న శ్రీ వి అనంతరామయ్య గారి అధ్యక్షతను జరిగింది.

ఈ సమావేశానికి కండక్టర్లు, డ్రైవర్లు మొదలగురకరకాల పనివారు 615 మంది హాజరయ్యారు.

వీరుకాక యూనియన్ అభిమానులు 35 మంది కూడా యీ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రథమంలో మోటారు కార్మికుల పరిస్థితులనుగూర్చి, వారి హక్కులు, బాధ్యతలనుగూర్చి శ్రీ వి. అనంత రామయ్య, యూనియన్ వర్కర్ ప్రెసిడెంట్ శ్రీ ఎ. పి. రత్నం, యూనియన్ గౌరవ ఉపాధ్యక్షుడు శ్రీ మహమ్మద్ సాహెబ్జాన్, శ్రీ పి. రామకోటయ్య, శ్రీ టి. రాయప్ప గారలు మాట్లాడారు.

నూతన సంవత్సరానికి యీ క్రింది వారు కార్యనిర్వాహక సభ్యులుగా ఏకగ్రీవంగా యెన్నుకోబడినారు.

గౌరవ అధ్యక్షులు : శ్రీ వి. అనంత రామయ్య (మునిసిపల్ కౌన్సిలర్), గౌరవ ఉపాధ్యక్షులు : శ్రీ ఆర్. దేవదానం(మునిసిపల్ కౌన్సిలర్), వర్కర్ ప్రెసిడెంటు : శ్రీ ఎ. పి. రత్నం, వర్కర్స్ వైస్‌ప్రెసిడెంటు : శ్రీ తేరే రాయప్ప, ప్రధాన కార్యదర్శి : శ్రీ పి. రామకోటయ్య(మునిసిపల్ కౌన్సిలర్), సంయుక్త కార్యదర్శులు : శ్రీ మహమ్మద్ సాహెబ్జాన్, శ్రీ యస్. కాంతారావు (మునిసిపల్ కౌన్సిలర్). కోశాధికారి: శ్రీ జి. రాజగోపాల్ మరొక 19 మంద సభ్యులు. ఇందులో వివిధ అభిప్రాయాలుగల వారంతా వున్నారు.

నెల్లూరుజిల్లా మోటారు లేబర్ యూనియన్ నిధిని నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో యూనియన్ గౌరవాధ్యక్షులు కోశాధికారుల పేరిట డిపాజిటు చేయ తీర్మానించారు.

నెల్లూరు ఉత్తర బస్టాండులో 1-5-60 నుండి యూనియన్ చందాలు వసూలు చేయుటకు ఉత్తర బస్టాండులో శ్రీ అరవ ఈశ్వరయ్య గారిని, దక్షిణ బస్ స్టాండులో శ్రీ గోపిశెట్టి సుబ్బన్నగారిని నియమించారు. పెద్దలవద్ద యూనియన్ సభ్యత్వ రుసుము వసూలు చేయుటకు, యితర వ్యవహారములు చూచుటకు, సాధ్యమైనంత త్వరలో ఒక గుమాస్తాను యేర్పాటు చేయుటకు వర్కింగ్ కమిటీకి అధికారమిచ్చారు.

శింగరాయకొండ రెడ్డి బస్‌ట్రాన్స్‌పోర్టు కార్మికులవీరోచితపోరాటాన్ని అభినందిస్తూ వారికి సానుభూతి తెలుపుతూ మరొక తీర్మానం చేయబడింది. నూతన ప్రధాన కార్యదర్శి శ్రీ పి. రామకోటయ్యగారి వందన సమర్పణతో సమావేశం ముగిసింది. (వి. వి)

శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి:

మిరపకాయ టపాతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గజగజ లాడించిన చిచ్చుల పిడుగు

ఆంధ్ర మహావీరుడు అల్లూరి సీతారామరాజు పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం తాలూకా మోగల్లులో 1897 జూలై 25 వ తేదీన జన్మించారు. వీరిని బ్రిటిష్ ప్రభుత్వం 1924 మే 7వ తేదీన కాల్చి, 8వ తేదీన దహన సంస్కారాలుచేసింది.

సీతారామరాజుకు 8 ఏళ్ళయినా నిండని చిరుతప్రాయంలోనే 1905 లో తండ్రి కాలంచేశారు. కాని ఆయన ఉగ్గుబాలతో రంగరించి పోసిన దేశభక్తి సీతారామరాజును 'చిచ్చులపిడుగు' చేసిందని లోకంచెప్పుకుంటుంది.

ఆయన తండ్రిపేరు వెంకట్రామరాజు; తల్లిపేరు నారాయణమ్మ.

ఒకనాడు తండ్రీకొడుకులు గోదావరి గట్టున నడచి పోతుండగా ఒక తెల్లదొర గుఱ్ఱంమీద స్వారీ చేసుకుంటూ వస్తున్నాడు. పసివాడైన సీతారామరాజు ఆదొరకు దణ్ణంపెట్టాడు. అది చూడగానే "తెల్లవాటికి తల వంచుతావా" అని తండ్రి చెళ్ళున చెంపమీద పెట్టాడు.

ఆ సంవత్సరమే (1905) వంగ విభజన జరిగి దేశమంతా బ్రహ్మాండమైన ఉద్యమం వ్యాపించింది. ఆ ఉద్యమ ప్రభావం తండ్రిమీద పడితే, తండ్రి ప్రభావం తనయునిమీద పడింది.

ఆ సంవత్సరమే వెంకట్రామరాజు గారు చనిపోయారు. తల్లి కొడుకుతో సహా నరసాపురంలో మరది రామకృష్ణంరాజు గారింటివద్ద మకాంపెట్టింది.

చదువు సంధ్యలు

సీతారామరాజు కొన్నాళ్ళు నర్సాపురం టైలరు హైస్కూలులోనూ, కొన్నాళ్ళు కాకినాడ పి. ఆర్. కాలేజీ హైస్కూల్లోనూ విద్యాభ్యాసం చేశాడు. 14 ఏళ్ళు వచ్చినా ఆయనకు చదువుమీద చూపునిల్వలేదు. పైగా ఇంగ్లీషంటే పరాయిభాష అని ఒక ఏవగింపుకూడా ఏర్పడింది.

సీతారామరాజు కాకినాడ చదువుకు స్వస్తిచెప్పి తునిదగ్గర ఉన్న కోటనందూరులో సంస్కృతం మొదలు పెట్టాడు. శబ్దమంజరి, అమరం పూర్తి చేసి, 'రఘువంశం'లోకి వచ్చాడో లేదో ఒకరోజున అక్కడనుంచి తుర్రున గాలిపటంలా విశాఖపట్టణం వెళ్ళి వాలాడు.

1912 సెప్టెంబరు 20వ తేదీన విశాఖపట్టణం ఎ.వి.యన్. హైస్కూల్లో 4 వ ఫారంలో ప్రవేశించాడు. కాని అక్కడ కూడా నిలకడగా చదవలేకపోయాడు. విశాఖపట్టణం వెళ్ళిన కొత్తరోజుల్లోనే బీచివద్ద తెల్లకుర్రవాళ్ళకూ, యీయనకూ జగడం వచ్చిందనీ, దాంట్లో వాళ్ళను చావ చితగ్గొట్టి చదువు మానేశాడనీ అంటారు.

అక్కడ నుంచి మళ్ళీ తుని వచ్చి, ఒక ఏడాది పాటు చదివాడు. చదువు అబ్బినా అబ్బకపోయినా అవ్యక్తమైన జాతీయ చైతన్యం మాత్రం సీతారామరాజులో అగ్నికణంలా రగుల్కొంటూనే వుంది. గోదావరిజన్మస్థలమైన నాసిక్ వెళ్ళి పితృతర్పణం చేయాలని ఒకనాడు సీతారామరాజుకు బుద్ధి పుట్టింది. నాసిక్ కు ప్రయాణం కట్టాడు. పితృతర్పణం అయిపోయిన తర్వాత అక్కడనుంచి పంజాబు వెళ్లాడు.

గదర్ వీరులతో సాంగత్యం

గదర్ విప్లవ వీరులకు జన్మస్థలమైన పంజాబు అప్పుడు అగ్నిపర్వతంలా ఉంది. బాంబులు తయారు చేసి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని పేల్చివేయాలని పంజాబు యువకులు పెక్కుమంది ఉడుకు రక్తంతో వజ్రసంకల్పులై కత్తులు నూరుతున్నారు. అనేకమందికి విప్లవ శిక్షణకూడా యివ్వడం మొదలెట్టారు.

అక్కడే సీతారామరాజు నింగిలో పక్షినీ, నీటిలో చేపనూ కొట్టగలిగిన ధనుర్విద్యా పారంగతుడయ్యాడు. రెండు చేతులతోనూ పిస్తోళ్ళు ప్రయోగించగల నేర్పు పొందాడు. హిందీ కూడా అభ్యసించాడు.

మన్యంలో ప్రవేశం

ఆ తర్వాత, తిన్నగా మన్యం వచ్చాడు. కృష్ణదేవి పేటలో మకాం పెట్టాడు.

అప్పటికే మన్యంలో క్రూర బ్రిటిష్ పరిపాలన తాండవమాడుతోంది.

మన్యప్రజలు అమాయకులు. మోసమంటే ఏమిటో తెలియనివారు. అడవుల్లో స్వేచ్ఛగాతిరిగి, వ్యవసాయ జీవనం నిరాటంకంగా సాగించటమే వారివృత్తి. తాము పండించినపంటలతో కడుపు నిండకపోయినా అడవిపండ్లు, గడబియ్యం, దుంపలు, తేనె, మాంసం మొదలగు పదార్థాలు తినేవారు.

కాని బ్రిటిషువారి పుణ్యమాఅంటూ ఆ మన్య ప్రజల స్వేచ్ఛా జీవితానికి సంకెళ్ళు పడ్డాయి. వారిని కొల్లగొట్టుకోవడానికి బ్రిటిషు వాళ్ళక్కడ 'ముఠాదారుల' ను సృష్టించారు. ఈ ముఠాదారులు బ్రిటిషు ప్రభుత్వం ఏజంట్లుగా తయారై, ప్రజలను దోచుకోవడం ప్రారంభమైంది. ముఠాదారులు భూస్వాములగుటయే గాక, వడ్డీ వ్యాపారులు కూడాను.

గూడెం తాలూకా తహసీల్దారుగా పనిచేసిన 'బాస్టియన్' పచ్చి లంచగొండి. అతని దుర్మార్గములు మితిమీరినాయి. దాంతో మన్యం ప్రజలలో అశాంతి, అసంతృప్తి రేకెత్తాయి.

దోపిడీని ఎదిరించమని ప్రబోధం

ఈ పరిస్థితులను చూస్తున్న సీతారామరాజు హృదయం నివురు గప్పిన నిప్పులా ఉంది. మన్యం ప్రజలతో సంబంధం ఏర్పరచుకున్న సీతారామరాజు ప్రభుత్వాజ్ఞలను ఉల్లంఘించమని ప్రజలకు ప్రబోధించడం ప్రారంభించాడు. వారిచే మద్యపానంకూడా మాన్పించాడు.

ఈ వార్తలు బాస్టియన్ చెవిని, తదితర అధికారుల చెవిని బడ్డాయి. ఇంకేముంది! పితూరీ ప్రారంభమైందన్నారు. గుండె గాభరాతో అధికారులు కృష్ణదేవిపేట వచ్చి, రాజుకు కబురంపగా, ఆయన రానుపొమ్మన్నాడు.

పోలీసుడిప్యూటీసూపరింటెండెంటు 'స్పైను', డిప్యూటీకలెక్టరు ఫజులుల్లాఖానూ, బాస్టియనూ రాజువద్దకు వెళ్ళి, నర్సీపట్టణం తీసుకువచ్చి ఊరు దాటి వెళ్లకూడదని ఇంటరన్ మెంటులో ఉంచారు.

ఆ తరువాత అతని మనసు మారుతుందేమో నన్న ఆశతో ప్రభుత్వం రాజుకు 60 ఎకరాల భూమినిప్పించింది. ఆ భూమిని సాగుచేసి పెట్టడానికి ఒక ముఠాదారుని అప్పగించింది.

అయినా ప్రజాసేవకు జీవితాన్నంకితం చేసిన 'రాజు' ఆమాత్రం లంచానికి లొంగడం అసంభవం. అక్కడ నుండి, తిరిగి రామరాజు అడవుల్లోకి వెళ్లాడు.

మన్యప్రజలు ఆవేశంతో అట్టుడికినట్టు ఉడుకుతూ ఏమిచేయాలో తెలియని పరిస్థితిలోఉండగా, విప్లవభానుడు రామరాజు అక్కడకు వచ్చాడు. బ్రిటిష్ అధికారుల దుర్మార్గాలు మితిమీరటం చూశాడు.

విప్లవ శంఖారావం

సీతారామరాజు విప్లవశంఖం పూరించాడు. అడవుల్లో మార్మోగింది. ప్రజాసైన్యాన్ని చేకూర్చాడు.

ఆయుధాలు, బాణాలు, రకరకాల కత్తులూ, బళ్ళెలూ, సీతారామరాజు సేనకు ఆయుధాలు. 'నడిమిపాలెం' గ్రామానికి చెందిన గాముదొర, మల్లుదొర అన్నదమ్ములాయనకు అంగరక్షకులయ్యారు.

విప్లవం ప్రారంభమైంది. రాజు సైన్యం పోలీసు స్టేషనుపై ఆకస్మిక దాడచేసి పోలీసులను కట్టివైచి, స్టేషనులోగల ఆయుధాలను వశపరచుకుంది. వశపరచుకున్న ఆయుధసామగ్రి పోలీసుస్టేషను రికార్డు పుస్తకములో ఎక్కించి, రాజు తన సంతకం చేశాడు. నిరపరాధులైన ప్రజలపై మోపిన దొంగకేసుల రికార్డులను రాజు చించి వేశాడు. 'సీతారామరాజుకు జే' అనుచు విప్లవ సైన్యం కృష్ణదేవిపేటకు పయనమైంది.

1922 ఆగస్టు 22 న విప్లవదళం 'రాజవొమ్మంగి'పోలీసుస్టేషనుస్వాధీనం చేసుకుని, బంధితుడైయున్న వీరయ్యదొరను విడిపించింది. వీరయ్యదొరను బ్రిటిష్ప్రభుత్వంముఠాదారునిగా చేసినా ఆ ప్రభుత్వానికి ఆయన మడుగులొత్తలేదు. దాంతో బ్రిటిషుప్రభుత్వం ఆయనపై కక్షపూని, ఆయన ఆస్తిని స్వాధీనం చేసుకొని, ఏజెన్సీ ఎల్లలను దాటిపొమ్మంది. కాని ఆయన రహస్యంగా మన్యం ప్రజల మధ్యనే కాలం గడుపుతూండగా, పోలీసులు కొందరి విద్రోహుల సాయంతో పట్టుకోగలిగారు. అటువంటి వీరయ్యదొర, ఆయుధాలతో విప్లవసైన్యంలో కలిశాడు. విప్లవ సైన్యానికి ఉపనాయకుడయ్యాడు.

'సీతారామరాజు వంటి వీరులరుదు'

శ్రీ నెహ్రూ ప్రశంస

నా దురదృష్ట వశాత్తు శ్రీ రామరాజును గూర్చి నాకు విశేషముగా తెలియదు. కాని నేను తెలిసికొనినంతవరకు అతడు వ్రేళ్ళపై లెక్కింపదగిన స్వల్ప సంఖ్యాకులగు అనుచరుల సహాయంతో బ్రిటిష్ ప్రభుత్వమును టకటకలాడించిన ధైర్యసాహసోపేతుడగు వీరుడని స్పష్టపడింది. అట్టి ధైర్య సాహసములు ప్రకటించి ప్రశంసాపాత్రులగు వీరులరుదు.

బాల్యంలో అల్లూరి సీతారామరాజు

పోలీసు స్టేషన్లపై దాడి: ఆయుధ సముపార్జన

సీతారామరాజు నాయకత్వం వహించిన విప్లవ సైన్యం, పోలీసుల వద్దనుండి వశపరచుకున్న ఆయుధ సామగ్రిని గురించి 1922 ఆగస్టు 22 వ తేదీన ప్రభుత్వం యీ విధంగా ప్రకటించింది.

చింతపల్లి పోలీసుస్టేషను 11 తుపాకులు; 1390 రౌండ్ల మందుగుండు, 5 కత్తులు, 10 మందుసంచులు, 12 పెద్ద గొలుసులు, 14 బయొనెట్లు, 9 ఖడ్గాలు.

కృష్ణదేవిపేటకు పోయే మార్గంలో యిద్దరు పోలీసులవద్ద తీసుకున్నవి, 1 తుపాకి, 5 రౌండ్ల మందుగుండు, కృష్ణదేవిపేట స్టేషను : 6 తుపాకులు 280 రౌండ్లమందుగుండు, 14 బయొనెట్లు, 5 కత్తులు, పోలీసు దుస్తులు.

రాజవొమ్మంగి : 8 తుపాకులు, 825 రౌండ్ల మందుగుండు, పోలీసు దుస్తులు, ఇతర వస్తువులు, కత్తులూ ఎన్నో ప్రకటించలేదు.

సీతారామరాజు విప్లవ సైన్యాన్ని అణచడానికి, వందలకొలదీ సాయుధ పోలీసులనూ, తెల్ల సైనికులనూ ఈ కీకారణ్యంలోకి బ్రిటిషు ప్రభుత్వం దిగుమతి చేసింది.

రాజు మిరపకాయ టపాతో విప్లవ సందేశాన్ని ఊరూరా అందించి బ్రిటిష్ సైన్యాలను హడలెత్తించాడు.

ప్రభుత్వోద్యోగులతోనూ సైనికులతోనూ మారువేషములలో కలసి తిరిగి, వారి ఆనుపానులను తెలుసుకొనేవాడు. అలా ఆయన తిరిగేటప్పుడు ప్రజలొక వేళ గుర్తుపట్టినా తనకు నమస్కరించరాదని ఆయన ఆజ్ఞ. అట్లొకసారి, రామరాజూ, ఆయన సైన్యమూ, మామూలు ప్రజల వేషములతో సైనికులతో వెళ్తూండగా ఒక విచిత్ర ఘటన జరిగినట్లు ప్రతీతి.

బ్రిటిషు సైనికులతోనున్న సీతారామరాజునుగుర్తుపట్టినఒక బాలుడునమస్కరించగా, ప్రక్కనున్నవారు ఆ బాలుని చేతిని, సార్జంటు వైపుకు త్రిప్పారనీ మిగిలిన జనులు కూడా ఆ సార్జంటుకష్టే నమస్కరించారనీ, దాంతో సీతారామరాజుకు గండం తప్పిందనీ చెబుతారు.

పొద్దుపోయిన తరువాత, ఆ సైన్యం నిదురపోయింది. వారితో పాటే ఉన్న రాజు తన సైన్యమును మేల్కొల్పి, ఆయుధములను ప్రోగుచేసుకుని, అడవుల్లోకి పారిపోయాడు.

మరో గెరిల్లా యుద్ధఘటన నాడు సెప్టెంబరు 4వ తేదీన ఏజెన్సీ అసిస్టెంటు కమిషనరు క్లెమెన్ హారు, విప్లవసైన్యాన్ని నాశమార్చాలని, ఒక సైన్యంతో బయలుదేరాడు. వారికి దారిచూపేది బాస్టియన్. ఆసైన్యంలో జయపురం మహారాజు పంపిన ఏనుగులుకూడా ఉన్నాయి. ఆసైన్యంపై, విప్లవసైన్యం ఒక్కసారిగాదాడిచేసితుపాకులతోనూ బాణాలతోనూ యుద్ధం సాగించింది. క్లైమన్ హారుకు చెవిమీదనూ, కాలిమీదనూ, అలుగుదెబ్బలు తగిలాయి. బాస్టియన్ చచ్చిచెడి బయటపడ్డాడు. బ్రిటిషు సైన్యం ఆయుధాలు వదలి కాలికి బుద్ధిచెప్పగా, విప్లవ సైన్యం ఆ ఆయుధాలను ప్రోగుచేసుకుంది.

'దమనపల్లి' గ్రామం చెంత విప్లవ సైన్యం సాగించినపోరాటంలో, ఇద్దరు తెల్లదొరలు, ఇద్దరు నల్లసిపాయిలు చనిపోయారు. ఈ పోరుకు గ్రామ సోదరులు నాయకత్వం వహించారు.

దమనపల్లిచెంత ఒక సెలయేరు కలదు. ఆ యేరు కొండల నొరసి పొంగుచుండును. ఆ కొండలు చెట్లపొదలతో గుబురుకొనియుండెను. అక్కడ ఒక యిరుకు దోవ మాత్రమే కలదు. సానుచరులైన గాముసోదరులా కొండలపై చెట్ల మాటున పొంచి కూర్చొని కాలిబాటకు నూటిగా తుపాకులు మాటుపెట్టుకున్నారు.

సైన్యమేతెంచింది. ఆ ఇరుకు దోవలో బారులుతీరి నడుస్తున్నారు సేనాపతులైన కవర్టు, హైటరు అనేవారు ముందువెనుకల నల్లసిపాయిలను పెట్టుకొని మధ్యలో ఉన్నారు. నల్ల సిపాయిలు ముందుకు పోగానే టపుక్కుమని తుపాకులు మ్రోగాయి. కవర్టు, హైటరులు నేలకూలారు. వారి శరీరాలు పిట్టలోకి దొర్లాయి. మిగిలిన వారు పలాయనం చిత్తగించారు.

ఏడువంపుల ఘాటీలో విప్లవకారుల దాడులు

కృష్ణదేవిపేట దాటిన తర్వాత ఏడువంపులఘాటీ ఒకటుంది. యీ ఏడొంపుల ఘాటీ దో పెద్ద చరిత్ర. ఈ ఘాటీ మన కిప్పుడు కాకినాడ - కేడీపేట బస్సు రూటులో తగులుతుంది. ఆ ఘాటీ వచ్చేటప్పటికి ప్రతీ బస్సూ, కొబ్బరికాయ కొట్టి మరీ ఎక్కుతుంది. ఇక్కడే, పితూరీ ఉధృతంగా సాగిన రోజులలో తెల్ల దొరలనుకూడా కలవరపరచిన దోపిడీలు జరిగాయి. అది ఒకకొండ. ఆ కొండపైన ఏడు వంపు లుంటాయి. కొండకు ఇటువైపూ అటువైపూ దిగువ ఇప్పటికీ శిథిలమైన బ్రిటిషు దొరలు పితూరీ నణచడానికి నిర్మించుకున్న ఎర్రరాతి కట్టడాలున్నాయి. ఈ కట్టడాలను అనేకమంది సైనికులు కాపాడేవారు. అయినా ఆ కొండపై ఏడొంపులలోనే పితూరీదార్లు సైనికుల కంటపడకుండా ఒకరోజున ఏడుసార్లు దాడిచేశారు.

కాంగ్రెసు వైముఖ్యం

ఈ పోరాటమును గురించి, పెద్దాపురం కాంగ్రెసువారు అప్పుడు రాష్ట్ర కాంగ్రెసుకు తెలియచేయగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులైన శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు 1922 ఆగస్టు 3వ తేదీన, శ్రీ బ్రహ్మజోస్యుల శితారామయ్య అనేవారికి ఇలా తెలియజేశారు:

"పెద్దాపురం కాంగ్రెస్ వారేమియు కల్పించుకోకూడదు. దోపిడీ గాండ్రు పోలీసు స్టేషనులను దోచుకుని పోవుచుండ కాంగ్రెసు వారేమి చేయాలో నాకు బోధపడుటలేదు. వారివద్దకు పోయి యిటుల చేయగూడదని చెప్పుటకు గూడ అవకాశంలేదు. కాంగ్రెసు వారెవరునూ బందిపోటుల కడకు పోగూడదు. కాంగ్రెసు నాయకులు రావలెనని తంతి వార్తలను పత్రికలకు పంపుటే అసంగతం.!"

కాంగ్రెసు వ్యతిరేకించినా, నాడు సీతారామరాజూ, మన్యం ప్రజలూ సాగించిన ఈ మహాఘనమైన స్వాతంత్ర్య పోరాటం భారత ప్రజా హృదయాల నుత్తేజపరచింది. కాని, ఉద్యమంస్థానికంగాఉండిపోవడంతో, బ్రిటిషు ప్రభుత్వం అణచివేయగల్గింది

రాజు కృష్ణదేవిపేటలో ప్రజా పంచాయతీలను స్థాపించాడు. విప్లవ సైన్యాలను గురించి, బ్రిటిషు ప్రభుత్వానికి సమాచారం అందించేవారిపై రామరాజూ, ఆయన సైన్యమూ నిఘా వేసి, పట్టుకొనేవారు. గూఢచారులకు, బ్రిటిష్ ప్రభుత్వాధికారులకు రామరాజు పేరొక సింహస్వప్నంగా తయారైంది.

సీతారామరాజు అరణ్యాల్లో ఎక్కడో ఒకచోట స్థిర నివాసుడుగా కాక, పల్లెల్లో తారాజువ్వలా సంచారం చేసి, ప్రజలను సైన్యంలోనికి సమీకరించేవాడు.

అడ్డతీగలలో రామరాజును పట్టుకోవాలన్న అధికారుల యత్నం విఫలమైంది. తరువాత చోడవరం ముట్టడింపబడుతుందన్న భయంతో తెల్లదొరజాను సైన్యంతో చోడవరంలోమకాం వేశాడు. అది 1922 అక్టోబరు19వ తేదీ. రాజు అక్కడ ప్రత్యక్షం. తాలూకా కచ్చేరీపై విప్లవ సైన్యం కాల్పులు సాగించింది. సైనికులూ తెల్లదొరా పలాయన మంత్రం పఠించారు. రాజుకు ప్రత్యేకంగా తెల్ల దొరలన్న ద్వేషం మాత్రం ఏమీలేదు. ఆయనకు కావలసింది మన్యం ప్రజల విముక్తి, ఆ పోరాటానికవసరమైన ఆయుధాలూను.

రామవరం గ్రామంలో సాండర్సు సైన్యాన్ని పారద్రోలాయి రాజు సైన్యాలు. రాజుసామర్థ్యాన్ని గురించి హాపెలు అనే అధికారి ఒక రిపోర్టు వ్రాస్తూ "గూఢచారులద్వారావార్తలు తెలుసుకోవడంలో అతడు సమర్థుడని" చెప్పాడు.

పెద్దయుద్ధం

ఆనాడు 1922 డిసెంబరు 6 వ తేదీ. బ్రిటిషు ప్రభుత్వం అడవులను సాయుధసైన్యాలతో నింపి, సీతారామరాజుకోసం వేట ప్రారంభించింది.

ఎటుచూసినా బ్రిటిషు సైన్యం వలయాకారంగారామరాజుసైన్యాన్ని క్రమ్మివేసింది. రాత్రిపూట సమరం సాగింది. రామరాజు సైన్యంపై తుపాకి గుండ్లు వర్షంలా వచ్చిపడుతున్నాయి. విప్లవ దళాల్లో అనేకమంది హతులవుతున్నా, రాజు సైన్యం వీరోచితంగా యుద్ధాన్ని కొనసాగించింది.

అయినప్పటికీ, ప్రభుత్వ సైన్యాలు రాజును పట్టుకొనలేకపోయాయి. దాంతో గ్రామాల్లోపడి, స్వైరవిహారం చేస్తూ, అనేక ఘాతుక కృత్యాలు ప్రారంభించాయి.

విజయమో ! వీరస్వర్గమో !!

1924 మే నెల వచ్చింది. రామరాజు తన సైన్యాలకు 'విజయమో! వీరస్వర్గమో!' అన్న నినాదం యిచ్చాడు. అంతే! అది ఆ నినాదం విప్లవ సైన్యాలకు తారకమంత్రమైంది.

బ్రిటిషు అధికారులు మే 17 వ తేదీని పంపించిన టపాలో ఇలా ఉంది:

"రామరాజు, మరికొంతమంది పితూరీదారులు కొండపల్లి గ్రామమున రెండురోజులుండినటుల సి. ఐ. డి. ఇనస్పెక్టరు ఉపేంద్రకు తెలిసింది. అకడు పోలీసు దళంతో కొండపల్లి వెళ్ళగా, అక్కడ పితూరీదార్లకూ, పోలీసుదళానికీ పోరాటం సాగింది. అగ్గిరాజు పట్టుబడ్డాడు.

రామరాజు పారిపోయాడు. ఈ నెల (మే) 7 వ తేదీన కొందరు స్పెషలు పోలీసులు, జమిందారు కొండమీద ఒకతనిని పట్టుకొనిరి. 'తానే శీతారామరాజునని' ఆయన చెప్పగా, ఆనాడుదయమే మేజరు గుడాలువద్దకు తీసుకువచ్చారు. ఆయన పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు కాల్చారు. ఆయన మరణించాడు. గూడెంతహశీలుదారు శవమును జూచి గుర్తించినపిమ్మట 8 వ తేదీన ఆ శవానికి దహనసంస్కారాలు చేయబడ్డాయి."

ఈ విధంగా పోతుగడ్డ అయిన ఆంధ్ర భూమికి దళదళలా ఖ్యాతి దెచ్చిన విప్లవవీరుడు శ్రీ రామరాజు 26 ఏళ్ళ ప్రాయంలోనే మనకు దక్కకుండా పోయాడు. అయినా విప్లవ వీరుడుగా వాసికెక్కిన ఆయన పేరు మాత్రం భారతస్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడింది. ఆయన ఆంధ్రులకేకాదు, భారతీయులకూ, మానవస్వాతంత్ర్యం కోరువారికీ ఒక వెలుగుబాట. ఆయన చిరంజీవుడు! సదా మన హృదయాల్లో వెలిగే జ్యోతి.

ఆయన వీరగాథను విన్నవారికే ఆ మరణవార్త హృదయాన్ని కలచివేస్తే, ఇక తమ మధ్యమెలగి, తమ కష్ట సుఖాలను పంచుకుని, తమకోసం ప్రాణాలర్పించిన ఆ ఆంధ్ర మహావీరుని మరణవార్త మన్యం ప్రజలకుకల్గించిన శోకం వర్ణించడం ఎవరితరం!

(ఈ రచనకు ఆధారం శ్రీ పొన్నలూరి రాధాకృష్ణమూర్తి గారు రచించిన 'అల్లూరి సీతారామరాజు' పుస్తకం,

(శ్రీ పడాల రామారావు అందజేసిన సమాచార)

ఉప్పొంగి పొంగరా - ఓ తెలుగుబిడ్డా !

ఉప్పొంగి పొంగరా – ఓ తెలుగుబిడ్డా !
భారత స్వాతంత్ర్య సమర రంగానా !
దుష్టులౌ పాపిష్టి సీమదొరలా నీడ
గ్రుంగుతూ, బ్రతుకు ఓ జాతికే సిగ్గనీ
హరహరోంహర మహా ఓంకార హేర్భాటి
భూనభోగోళాల ఘీంకార పెట్టరా !
ఉప్పొంగి పొంగరా ఓ తెలుగుబిడ్డా !
భారత స్వాతంత్ర్య సమర రంగానా !
పలనాటి చంద్రుని తెలుగు విక్రమధాటి
నాగులేటి నాగ భుగభుగల పగఘాటు
రాణి రుద్రమ రౌద్ర రోషానల జ్వాల
నీ మహాశక్తిరా! శ్రీరామ రక్షరా!
ఉప్పొంగి పొంగరా ఓ తెలుగుబిడ్డా !
భారత స్వాతంత్ర్య సమర రంగానా !
గోదావరీ పరుగు కృష్ణవేణీ వురక
పర్వతాలే రగులు మన్యతేజముతో
దిశలెల్ల దుందుభులు ధంధణా ధైకొట్ట
తొడగొట్టి చేబట్టు జయము మొనగాడా !
జయము ! మొనగాడా !

రచయిత: శ్రీ పడాల రామారావు

నేషనల్ ఆర్టథియేటరు సౌజన్యంతో, వారు తీయబోతున్న 'అల్లూరి సీతారామరాజు' చిత్రంనుంచి

విశాలాంధ్ర

'శ్రీ రామరాజు నిరాడంబరుడు ఉత్తమ శీలి'

శ్రీ రామరాజు దౌర్జన్య పద్ధతులతో నేనేకీభవింపజాలకపోయినను, ఆయన అకుంఠిత సాహసము, త్యాగదీక్ష, ఏకాగ్రత ఉత్తమశీలము, నిరాడంబరపగు కష్టజీవనము, మనమందరము నేర్వదగినది.

—మహాత్మా గాంధీ

ఆంధ్రవీరుడు అల్లూరి సీతారామరాజు

— శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

అయిదు సంవత్సరాలు రవి యస్తమించని బ్రిటీషు సామ్రాజ్య సింహపు జూలు పట్టుకొని విదల్చిన మన్యవీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి నేడు 1921నాన్ కో ఆపరేషన్ విఫలం అవడంలో యువకరక్తం, వీరావేశంతో ఉప్పొంగింది. అసహాయోద్యమం బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలద్రోసి స్వాతంత్ర్యం సాధించుటలో విఫలమయిందనిదలంచి ప్రజా సమీకరణ సాయుధతిరుగుబాటు, శివాజీ గెరిల్లా యుద్ధవిధానమే స్వాతంత్ర్యాన్ని సాధించుటకు మార్గాలని నమ్మి మన్య విప్లవం సాగించారు. మూడు సంవత్సరాలు బ్రిటిష్ మదగజాన్ని తన మిరపకాయ టపాతో, గజ గజ లాడించారు. మన్యప్రజల సైన్యంతో చిందర వందరలు చేశాడు. తన గెరిల్లా పద్ధతులతో బ్రిటిషు అధికారులలోనూ సైన్యంలోనూ, పోలీసుల్లోనూ ఆత్మవిశ్వాసంపోగొట్టి ఎప్పటికప్పుడు పాదాక్రాంతం చేసుకొన్నాడు. మూడు చెరువులనీళ్ళు త్రాగించాడు.

చివరకు నమ్మకస్వామిద్రోహంతో బ్రిటిషు వారి రాజీ మాటలు నమ్మి వారి మాయవలలోపడి అభిమన్యునివలె ఒంటరియై తుపాకీగుండ్లకెరయై కీర్తిశేషుడైనాడు. ఆంధ్రులందరం జోహార్లు సమర్పిద్దాం. అల్లూరి సీతారామరాజు ఆంధ్ర చరిత్రలో మన్యవిప్లవం ఘటన నడిపి సువర్ణాధ్యాయాన్ని సృష్టించాడు. మన్య ప్రజలలో స్వాతంత్ర్య పిపాస కలిగించాడు. విప్లవజ్యోతి వెలిగించాడు. భారత చరిత్రలో ఆదర్శ ఆంధ్ర వీరుడైనాడు. వీరయోధునికి జోహార్లు.

సీతారామరాజు నమ్మకం

ఒకనాడు ఆంధ్రపత్రిక విలేఖరి అల్లూరి సీతారామరాజును కొన్ని ప్రశ్నలడిగాడు. 1923 ఏప్రిల్ 21 వ తేదీ ఆంధ్ర పత్రికలో ఆ ప్రశ్నలూ - జవాబులూ ప్రకటించబడ్డాయి. అందులో ఇలా ఉంది:

ప్ర: "ఎందుకీ పితూరి?"

జ: ప్రజా స్వాతంత్ర్యంకోసం

ప్ర: ఏ సాధనం వలన?

జ: దౌర్జన్యంతో యుద్ధం చేస్తేనే గాని స్వరాజ్యం రాదు.

ప్ర. "గాంధీజీ దౌర్జన్య రాహిత్య సిద్ధాంతంపైన మీకు నమ్మకమున్నదా?"

"నాకు లేదు". అని సీతారామరాజు సమాధానం చెప్పారు



లాసాలో పొటాలా రాజ ప్రాసాదం

సీతారామరాజు వర్ధంతికి ఆంధ్ర ప్రముఖుల సందేశాలు

“'ఆంధ్రసింహం' చనిపోయిన 36 ఏళ్ళ తర్వాత, ఈనెల 8 వ తేదీన స్మారకోత్సవం జరుగుతున్నందుకు సంతోషం. ఏటేటా యిట్టి ఉత్సవాలు జరిపి ఆంధ్రప్రజలు చిరకాలం శ్రీసీతారామరాజును స్మరించటం సముచితం”

బూర్గుల రామకృష్ణరావు,
కేరళ గవర్నరు.

“శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారకోత్సవం జరుగుతున్నందుకు సంతోషం”

సర్వేపల్లి రాధాకృష్ణ,
ఉపరాష్ట్రపతి.

“మాతృదేశంకోసం అశేష త్యాగాలొనర్చిన సీతారామరాజువంటి మృతవీరులకు ఇవే నా జోహార్లు సగర్వంతో అట్టి వీరులను సంస్మరిద్దాం. వారి జీవితాలనుంచి, ప్రవర్తననుంచి ఉత్తేజం పొందుదాం.”

వి. వి. గిరి,
ఉత్తరప్రదేశ్ గవర్నరు.

సీతారామరాజువంటి మహోన్నత స్వాతంత్ర్య యోధుల్ని తలచుకొని ప్రతిఆంధ్రుడూ ఉప్పొంగి పోతాడు. ఆయనకు వీరోచిత పద్ధతులపై జోహార్లు అందచేద్దాం.”

ఆంధ్రపితామహ
మాడపాటి హనుమంతరావు,
ఆంధ్రశాసనమండలి అధ్యక్షులు.

ఈఏడు సీతారామరాజు వర్ధంతి జరుగుతున్నందుకు సంతోషం. జయప్రదమా గాక !

యన్. టి. రామారావు,
సుప్రసిద్ధ సినీనటుడు

భారతదేశంలో ప్రాథమిక పాఠశాలల దుస్థితి

ప్రతి పౌరునికీ ప్రాథమిక హక్కయిన విద్యను అందరికీ ఒకేరకంగా అందజేయాలి

“నిర్బంధోచిత ప్రాథమిక విద్యాబిల్లును యూనియన్ ప్రాంతాలన్నింటిలోనూ సత్వరమే ప్రవేశపెట్టాలి. ఆర్థిక రీత్యా శ్రమజీవులకూ, పేద తరగతులకూ స్తోమత కల్గించాలి. కొండజాతుల్లోకూడా నిర్బంధ ప్రాథమిక విద్య అవసరం. బిల్లునుండి ఏ ఒక్కజాతినో, ఏ కొంతమందినో మినహాయించే సౌకర్యం రాష్ట్రాని కివ్వగూడదు” అని శ్రీమతి రేణూ చక్రవర్తి (కమ్యూ) లోక్‌సభలో ఢిల్లీప్రాథమిక విద్యాబిల్లుపై ఏప్రిల్ 28 వ తారీఖున ప్రసంగించింది. ఆ ప్రసంగం పూర్తి పాఠాన్ని ఈ దిగువ నిస్తున్నాం.

ఢిల్లీ ప్రాథమిక విద్యా బిల్లుపై ఏప్రిల్ 28 వ తారీఖున లోక్‌సభలో చర్చ సాగినప్పుడు శ్రీమతి రేణూ చక్రవర్తి (కమ్యూనిస్టు) ఈవిధంగా ప్రసంగించారు:

ఈ బిల్లు ఎంతో ఆసక్తిని రేకెత్తించిందనే విషయం స్పష్టమే. ఎందువల్ల నంటే, రాజ్యాంగంలో నిర్దేశించబడిన ఈకోర్కె, ఇంతకాలంగా మనం అమలు పరచడంలో విఫలమైనాం. నిజానికి ఈ బిల్లు ఎప్పుడో రావలసి ఉంది. అందువలన ఈ బిల్లు త్వరగా రాలేదనీ, చాల ఆలస్యంగా వచ్చిందనీ చెప్పాలి.

ఏది ఏమైనప్పటికీ, ఈ బిల్లు 1960 సంవత్సరంలోవచ్చినందుకు సంతోషం. అయితే ఈ బిల్లు మొత్తం భారత యూనియన్ ప్రాంతాలన్నింటికీ వర్తించేటట్లు ఎందుకు ప్రవేశపెట్టబడలేదో నాకర్థం కావడంలేదు. దేశ వ్యాపిత, నిర్బంధ విద్యను వేగంగా సాగకుండా చేసేటందుకు గాను, మనకు తగినంత మంది ఉపాధ్యాయులు లేరనో, లేక చాలినంత మంది కొండజాతులవారు లేరనో ఒక సాకు ఎప్పుడూ చెప్పబడ్తూనే ఉంది. యూనియన్ ప్రాంతాలమేరకే కేంద్రప్రభుత్వం అజమాయిషీ ఉన్నా, ఢిల్లీ బిల్లుకన్నా, ఎంతో వెనకబడిన ప్రాంతాలకైనా ఒక బిల్లు తేవలసి ఉంది. ఇతరరాష్ట్రాలకన్నా, ఢిల్లీ అదృష్టకరమైనరాష్ట్రం ప్రప్రథమంగా నిర్బంధ ప్రాథమిక విద్యాబిల్లు ఢిల్లీ రాష్ట్రానికైనా తెస్తున్నందుకు సంతోషిస్తూనే, యూనియన్‌కు చెందిన అన్ని ప్రాంతాలకు ఈ బిల్లు వర్తింపచేయాలని నేను భావిస్తున్నాను.

వెనుకబడిన ప్రాంతాలకు బిల్లు వర్తించాలి

మణిపూర్‌లాంటి ప్రదేశాల్లో చాలినన్ని పాఠశాలలులేవు. అక్కడగల పాఠశాలలకు ప్రభుత్వంనుండి ఏమాత్రం సహాయం రావడంలేదు. వాటికి గుర్తింపు రావడంలేదు. అందువలన, ఈ బిల్లు అక్కడ రెండు విధాలా పని చేస్తుంది. కేంద్రప్రభుత్వం వాటికి ఎక్కువ నిధులిస్తే, నిర్బంధవిద్యయందు ఎక్కువ శ్రద్ధచూపితే, వెనుకబడిన ప్రాంతమూ, వగైరా అన్ని బలహీనత లధిగమించవచ్చును. మణిపూర్, త్రిపుర, లక్కాదీవులు, అండమానుల వంటి ప్రాంతాలను ఈ బిల్లులో కలుపనందులకు నాకు విచారంగా ఉంది. ఒకవేళ లక్కాదీవులు, అండమానులు విడిచి పెట్టబడినా త్రిపుర, మణిపూర్ హిమాచల్ ప్రదేశ్ వంటి వాటినైనా చేర్చిఉండ వలసింది. ఎందువల్ల నంటే తామెప్పుడూ నిర్లక్ష్యం చేయబడుతున్నామనీ, తమకు బాధ్యతా యుత స్వీయ ప్రభుత్వం అన్నది లేదనీ ఆ ప్రాంత ప్రజలు గాఢంగా భావిస్తున్నారు, అక్కడ ఆందోళనలు ఎందుకు జరిగాయంటారు? ఎవరో కొంతమంది వ్యక్తులు కోరినందువలన ఆ ఆందోళనలు రాలేదు. ఢిల్లీవంటి ప్రాంతాల ప్రజలకిచ్చిన ఆహారమూ, విద్య, బట్ట వారికీ కావాలి. అవే వారి కనీస కోర్కెలు. అందువలనయూనియన్‌లో ఇతర ప్రాంతాలలో కూడ యిటువంటి బిల్లును ఎట్టిఆలస్యం చేయకుండా ప్రవేశపెట్టాలనే నేను కోరేది.

స్థానికాధికారులపై కొన్ని ఆర్థిక బాధ్యతలుంచబడ్డాయని ఇప్పుడొక సాకు చెప్పవచ్చు. ఆ ఖర్చును స్థానిక పరిపాలన సంస్థలు భరించగలవాలని కూడా అడగవచ్చు. ఈ ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలు కావడం మూలంగా మనం వాటిని యూనియన్ ప్రాంతాలుగా ఆమోదించాం. నేను చెప్పినట్లుగానే, ఢిల్లీ అదృష్టకరమైన రాష్ట్రం ఢిల్లీ అదొక తరగతి; కాని తతిమ్మా యూనియన్ ప్రాంతాలను తీసుకోండి.

స్థానిక పరిపాలనా, కేంద్రప్రభుత్వ పాలనా మధ్య విభజన జరుగుతుందని ఈ బిల్లులో 19వ క్లాజులో చెప్పబడింది. స్థానిక పరిపాలనా శాఖలు కొంత శాతాన్నివ్వమని కోరుతూ, (సహజంగా ఆ సొమ్ము చాల తక్కువే వుంటుంది.) ఒక నిబంధనను చేర్చాలని నేను సూచిస్తున్నాను. ఆ వ్యయంలో, అధిక భాగం, కొరత ఎంతయినాసరే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులనుండి భరించాలి. నిర్బంధ ప్రాథమిక విద్యను మణిపూర్, త్రిపుర హిమాచల ప్రదేశ్‌లను వర్తింపచేయా లన్నప్పుడు మనం ఆలోచించ వలసిన ముఖ్యవిషయాల్లో అది ఒకటి.

బిల్లులో ముఖ్యమైనలోపం

ఈ బిల్లులో ముఖ్యమైన బలహీనత ఉంది. విద్యనిర్బంధ విద్యగానూ, సర్వవ్యాపిత విద్యగానూ కాబోతుందని మనం చెబుతున్నాం. నిర్బంధ విద్యా ప్రాంతంగా ఒక ప్రాంతం ఉత్తర్వు ద్వారా ప్రకటింపబడ్తుందని బిల్లులో చెప్పబడింది. అందు వలన, ఢిల్లీ ప్రాథమిక విద్యాబిల్లును మొదటిసారిగా చూచినపుడు, కనీసం ఢిల్లీ నగరమూ, దాని చుట్టుపట్లగల గ్రామీణప్రాంతాల్లో, భారతదేశంలో ఒకభాగంలో నయినా, మొత్తం బాల బాలికలందరూ పాఠశాలలకు వెళ్ళడాని కవకాశం కల్గుతుందనిపిస్తుంది. కాని వాస్తవంగా అట్లా కాదు. ఉత్తర్వు ద్వారా ప్రాంతాన్ని పరిమితం చేసే బిల్లు మనకు అందించబడ్తుంది.

అందు వలన, ఢిల్లీ నగరానికి చెందిన ప్రాంతాలేవో తయారుచేసి, పట్టణ ప్రాంతాల్లో కనీసం మూడు నాలుగు ఫర్లాంగుల్లోఒక ఉచిత పాఠశాల నేర్పరచాలి. గ్రామీణ ప్రాంతాల్లో, పిల్లల సంఖ్య తక్కువగా ఉంటే, కనీసం మైలుకొక ఉచిత పాఠశాలయినా ఉండాలి. ఈ పని జరుగకుండా, సర్వవ్యాపిత ప్రాథమికవిద్య నమలుపరచడమూ, ఢిల్లీలో పిల్లలకు ఉచిత విద్యకు హామీ యివ్వడమూ యింకా యింతలో సంభవమయ్యే విషయం కాదని నాభావం.

ప్రాథమిక విద్యకు పాఠశాలలు డబ్బు వసూలుచేయు సమస్య మరొక ముఖ్యమైన విషయం. ఆ పాఠశాలలు ఇతర ఉచిత ప్రాథమిక పాఠశాల లున్న ప్రాంతాల్లో, ఆమోదింపబడిన పాఠశాలలు గా పిలువబడే తరగతి అని బహుశా నేను భావిస్తున్నాను. దీనిలో ఒక ప్రమాదకరస్థితి ఉంది. కనీసం విద్యలోగల అసమానత తగ్గించడం విద్య లక్ష్యాల్లో ఒకటి అనేది కనీసం జాతీయోద్యమంలో మనం అనుకుంటు న్నాం.

ఉచిత పాఠశాలల దుస్థితి

మన నగరాల్లో మనం చూసే దేమిటి? ఉదాహరణకు కలకత్తాను తీసుకోండి.

కలకత్తా కార్పొరేషన్ నడిపే ఉచిత ప్రాథమిక పాఠశాలలు ఆ నగరంలో చాలా వున్నాయి. అక్కడ చిరిగిన చాపలమీద కూర్చున్న పిల్లలను మీరు చూస్తారు. ఆపాఠశాలల్లో వస్తుసామగ్రి కన్పించదు. కొన్ని సందర్భాల్లో కనీసం బ్లాక్‌బోర్డు ఉండదు కొన్నిసందర్భాల్లో ఉపాధ్యాయునికి సీమసున్నం ముక్కకూడ ఉండదు. ఆపరిస్థితి విచారకరమైందీ, అంధకార బంధురమైందీను. మన స్థానికాధికార్లు నడిపే ఉచిత పాఠశాలల్లో తరచుగా మనకు కన్పించే పరిస్థితి అది. పరిస్థితి అలా ఉండటానికి కారణం ఏమిటూ అంటే, ఆ స్థానికాధికారులకు డబ్బుకొరత, లేక తదితర యిబ్బందు లుండడమే కారణం. మిషన్, ప్రయివేటు సంస్థలు నడిపే మంచిపాఠశాలలూ ఉన్నాయి. ఆపాఠశాలలు నిజంగా అత్యుత్తమ విద్య నందిస్తున్నాయా లేదా అన్న విషయాన్ని నేనింకా పరిశీలించలేదుగనుక, అవి అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయని చెప్పను. కాని, ఆ పాఠశాలల్లో పిల్లలకు లభిస్తున్న విద్య, మన ఉచిత పాఠశాలల్లో లభించే విద్యకన్నా చాలా ఉత్తమమైంది. అందువలన, సాదామాటల్లో చెప్పాలంటే, ప్రాథమిక విద్య విషయంలో రెండు ప్రామాణిక పద్ధతులున్నాయి. ఈ పద్ధతి తరతమ భేదాలను కొనసాగించట మవుతుంది. ఎక్కువ డబ్బు చెల్లించగల ధనిక తరగతుల వారికి అత్యున్నత పాఠశాలలు లభిస్తున్నాయి. తక్కువ చెల్లించేవారికి మాత్రమే రెండవ తరగతి పాఠశాలలు లభిస్తున్నాయి. ఇక, చెల్లించలేనివారూ లేక, చాల పేదవారూ తమ బిడ్డలను చదివించు కోవాలనుకున్న వారికి అన్నింటికన్నా అధ్వాన్నమైన పాఠశాలలు (స్థానిక ప్రాథమిక పాఠశాలలు) లభిస్తున్నాయి.

రెండురకాల పాఠశాల లుండరాదు

అందువలన నిర్బంధోచిత ప్రాథమిక విద్యపై మనం ప్రవేశపెట్టు బిల్లులో, రెండురకాల పాఠశాలల కనుమతించ కూడదని నేను చెబుతున్నాను. ఉదాహరణకు మంచి పాఠశాలలలో పిల్లలను చదివించాలనే సమస్య తీసుకోండి. కొద్ది సంవత్సరాలక్రితం మా అబ్బాయిని ఢిల్లీలో కొన్ని పాఠశాలల్లో (కారకంబా రోడ్డులో ఉన్న 'మోడరన్ స్కూలు') చేరుద్దామనుకుంటే, ఆ పాఠశాలలో చేరితే

లోక్‌సభలో శ్రీమతి రేణూచక్రవర్తి ప్రసంగం

అయ్యే డబ్బునుచూచి, నా ప్రయత్నం విరమించాను. భారతీయ విద్యా భవన్ స్కూలులో కూడా చాలఎక్కువ రేట్లున్నాయని నాకు కొందరు చెప్పారు. ఉదాహరణకు జీతం 15-8-0 తరువాతవిద్యార్థిగనుక సైన్సు కోర్సు తీసుకొంటే మరో రు. 3/లు, స్పోర్ట్సుకు రు. 1-8-0 మధ్యాహ్నం భోజనానికి రు. 10/- ఆరు సంవత్సరాల పిల్లలకు రు. 30 చెల్లించ లేక పోతే, తలిదండ్రులు పిల్లలకు మంచి విద్యను లభింపచేయలేరు. అలాంటప్పుడు, ఒక కుటుంబంలో, ముగ్గురు నల్గురు పిల్లలున్నప్పుడు కార్మికులూ, పేదల సంగతి విడిచిపెడితే, మధ్య తరగతి ప్రజలకే మంచి పాఠశాలలు అందుబాటులో ఉండవు.

“ఇప్పటికేఉన్న ప్రమాణములను తగ్గించాలనేది మీ అభిప్రాయమా?” అని నన్ను అడగవచ్చు. అవసరమైతే స్థానిక ఉచిత ప్రాథమిక పాఠశాలల స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం వ్యయం భరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాథమిక విద్యాదశలో, రెండు రకాల విద్యనుగాని, రెండు రకాల ప్రమాణాలనుగాని అనుమతించ రాదు.

రెండు రకముల విద్య ఉండడం సోషలిస్టు భావానికి పూర్తిగా వ్యతిరేకం. అందువలన ఒకసారి మనం ఉచిత నిర్బంధ విద్యను ప్రవేశపెట్టినపుడు, ఈ పద్ధతి ననుమతించరాదు.

పాఠశాలలు ప్రభుత్వామోదం పొందేటందుకు ఏయే నిబంధన లవుసరమో, ఆ నిబంధనలను పొందుపరిచే క్లాజు ఒకటి బిల్లులో ఉండాలి. అంతేకాదు, ప్రాథమిక విద్య తప్పక ఉండాలనీ, ఆ విద్య ఉచితంగా నేర్పాలనీకూడా ఈ బిల్లులో ఉండాలి.

బిల్లులో మరో ముఖ్యాంశం విడిచి పెట్టబడింది. ఈ విషయం అసలు కీలకసమస్య. మన దేశంలో, అన్ని గ్రామాల్లోనూ, అన్ని నగరాల్లోనూ ఉచితంగా, ప్రాథమిక విద్యను ఎందుకు ప్రవేశపెట్టలేక పోవడం జరిగింది? ఈమధ్య చివరకు గ్రామాల్లో కూడా ప్రతితండ్రి తన పిల్లవాణ్ణి పాఠశాలకు పంపాలని ఉబలాట పడుతున్నాడు. ఆడపిల్లల విద్యవిషయంలో కొంచెం లేదా ఉండనుకోండి. అందువలన గ్రామాల్లో నూతన పాఠశాలలు తెరవాలన్న డిమాండు ఎక్కువగా ఉంది. ఇప్పుడు చూస్తున్న మార్పుల్లో యీ పెద్దమార్పు ఒకటి. భూమి సమస్య తర్వాత, గ్రామాల్లో విద్యకు డిమాండు పెరిగింది. అందువలన, గతంలో విద్యపైగల శ్రద్ధ లేకత ఇప్పుడు ఏ మాత్రంలేదు, అయినప్పటికీ, మన పిల్లలను బడికి పంపడానికి అడ్డువస్తున్నదేమిటి?

పేదరికం ప్రధానమైన అడ్డంకి

అందుకు ప్రధాన అవరోధం పేదరికం. నగరాల్లో, పోనీ నా రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లోనూ, కలకత్తాలోనూ, 8 నుండి 11 సంవత్సరాల వయసుగల బాలురు ఏదో పనిచేసుకోవడం జరుగుతుంది. అది దోపిడీ సమస్య. పిల్లలు దోపిడీ కాబడడం నాకిష్టంలేదు. పిల్లలతో పనిచేయించడానికి నేను వ్యతిరేకిని. కాని, పని చేయగల సామర్థ్యముండున్నవ్యక్తికి ఎప్పుడైతే పని హామీ యివ్వలేక పోయామో, మనం న్యాయమైన వేతనా లివ్వడంలేదు, పిల్లలు పనిచేయడం తప్పనిసరి అవుతూంది. పిల్లలు పనిలోనికి పోవడం నేను చూచాను.

గ్రామాల్లో మనకు 'రాఖాల' పద్ధతి ఉంది. అక్కడ పిల్లలు పశువులను కాయడానికి రోజల్లా పనిచేస్తారు. అట్లా వారు కొంతమంది తిండిపెడితే పని చేస్తారు. కొంతమంది సాలుసరి జీతంపై పనిచేస్తారు. ప్రభుత్వం ఈ సమస్యను ఏం చేయదలచుకుంది? ఆ పిల్లలు, వ్యవసాయకార్మిక, శ్రామిక తరగతులకు చెందిన వితంతువుల బిడ్డలు. ఇటువంటి తరహాపిల్లలను మనం పాఠశాలల్లో చూడం; నేనీ విషయాన్ని నా నియోజక వర్గంలో చూచాను. మరొకరికోసం ఈ పిల్లలు పనిచేస్తున్నారు. “ఆమోదింపబడినపాఠశాలకు వెళ్ళకుండా ఉండే విధంగా ఏబిడ్డనూ ఎవరూ ఉద్యోగంలోపెట్టుకోగాదు.” అన్న 9వ క్లాజు క్రిందకు తల్లీ, లేక వ్యవసాయ కార్మికుడూ, తండ్రీకూడా వస్తారు.

పనిచేసే పిల్లలకు సాయంత్రం పాఠశాలలేర్పరచాలి

అందువలన, గ్రామంలోగల ధనికుడు “ఓచిన్నవాడా, నీవుయింటికి వెళ్ళవలసి ఉంటుంది, అట్లా కాకపోతే, నేను జరిమానా చెల్లించుకోవాలి”అంటాడు. కలకత్తావంటి నగరాల్లో ఉన్న వాస్తవ పరిస్థితియిది 9,10,11,12 సంవత్సరాలు గల కుర్రవాళ్ళు, టీ, షాపుల్లోనూ, కాఫీ హోటళ్ళలోనూ పనిచేస్తున్నారు నేను ఒక నిర్దిష్టమైన సూచన చేయ దలచుకున్నాను.

సంపాదించుకునే పిల్లలకు 'పార్టు - టైం,' 'సాయంత్రం' పాఠశాలను ఏర్పర్చాలి.

శ్రీ సి. ఆర్. పట్టాభిరామన్ (కుంభకోణం): అందుకోరకు వివిధ గంటల్లో స్కూలు ఏర్పాటు జరగాలనేది గౌరవ సభ్యురాలి అభిప్రాయమా?

శ్రీమతి రేణూచక్రవర్తి: అవును.

డాక్టరు సుసీలానాయరు: ఆ పిల్లలను పనిలో ఉంచడమనేదాన్ని వారి తలిదండ్రులు కొనసాగించాలనా మీ అభిప్రాయం? వారు చదవకుండ, సంపాదించేటట్లు వారి తలిదండ్రులు చేయాలనా?

శ్రీమతి రేణూచక్రవర్తి: వారిని దోపిడీనుండి రక్షించగల్గినప్పుడే, అది సాధ్యం. తలిదండ్రులకు ఒక ఉద్యోగం కల్పిస్తే, ఆ తరువాత కూడా ఆపిల్లలను దోపిడీచేస్తే అది వేరే విషయం. కాని, రాజ్యాంగంగాని, ప్రభుత్వంగాని ప్రజలకు ఉద్యోగవసతి కల్పించలేనపుడు, వారు పనిచేయకుండా మాడి చావాలని నాసోదరి సూచించడం ఆశ్చర్యకరం. అది అసాధ్యమయిన పరిస్థితి.

'దోపిడీ' అని గాలిలో మాట్లాడితే ఏంలాభం?

మనమంతా పిల్లలతో పనిచేయించుకోవడానికి వ్యతిరేకమే. ప్రతి ఒక్క పౌరునికీ, పనిచేసేహక్కు ప్రాథమిక హక్కుగా పాలకవర్గపార్టీ ఒకశాసనం చేస్తే మాకంతో యిష్టం. కాని ఉద్యోగహామీగాని, న్యాయమయిన వేతనాలకు హామీ యివ్వబడలేదు. పాలకవర్గం గనుక ఆ పని చేస్తే, పిల్లలతో చాకిరీ చేయించుకోవడాన్ని తక్షణమే నిషేధించాలని నేను తప్పక చెబుతాను. 6 లేక 8 ఏండ్ల పిల్లలు మిల్లుల్లో పని చేస్తూఉంటే చూడడానికి యిష్టపడేవారిలో నేనుకడపటిదాన్ని. కాని ఈ పరిస్థితులు వారావిధంగా పని చేసుకోవకపోతే ప్రత్యామ్నాయ మార్గం ఏమిటి? వారికి దక్కేది చావు తప్ప మరేమీ లేదు.

అందువలన, ఆ సమస్య సాంఘిక వ్యవస్థను దోపిడీ చేయడమో, ఆర్థిక వ్యవస్థను దోపిడీ చేయడమో సమస్యకాదు. ఏదో గాలిలో దోపిడీని గురించి మాట్లాడితే, ఏ మాత్రం ప్రయోజనంలేదు.

అందువలన 'పార్టుటైం, 'సాయంత్రము' పాఠశాలలను ప్రారంభించాలని నేను సూచిస్తున్నాను. నగరంలో కేంద్ర పాఠశాలలను ఏర్పరచాలి. దూరంనుండి వచ్చేవారికి ప్రయాణ రుసుం ఏర్పరచి, వారికి సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేయాలి. నేను చేసిన ఈ కొన్ని ఆచరణయోగ్యమైన సూచనలను పరిశీలించాలని కోరుతున్నాను.

అట్లా చేయకుండా, దురదృష్టవశాత్తూ అనేక మంది పిల్లలు తప్పనిసరిగా పని చేయవలసిఉన్న పరిస్థితిలో ఉచిత నిర్బంధ ప్రాథమికవిద్యను ప్రవేశపెట్టడం వారిని ఎన్నో చిక్కుల్లో పెట్టడమే అవుతుంది.

పేదరికం నుండి మరో రెండు సమస్య లుత్పన్నమవుతున్నాయి. సంవత్సరానికి కనీసం ఒకసారైనా తక్కువ ఆదాయం గలవారి పిల్లలకు పుస్తకాల స్టయిఫండు సమస్య ఆలోచించాలి. బడికి వెళ్ళాలని మాకుంది. కాని పుస్తకాలు కొనుక్కోలేం” అని అనేక మంది పిల్లలు మనవద్దకు రావడం మనకు తెలుసు. ఇది చాల ప్రాముఖ్యమైన విషయం. ఈ సహాయం చేయకుండా, నిర్బంధ పద్ధతి విజయవంతంకాదు.

పాఠశాలల్లో మతబో ననుమతించరాదు

ఈ బిల్లులో క్లాజు 7 (1) (బి) నిబంధనను జాయింటుకమిటీ పరిశీలించాలని నా అభిప్రాయం.

ప్రభుత్వం పాఠశాలలను నడిపేటప్పుడు, మతబోధసమస్య లేనేలేదు. అనగా, నైతికబోధన ఉండవచ్చుగాని, ఒక ప్రత్యేక మతబోధన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగరాదు. ఈ విషయంపై రాజ్యాంగంలో 2వ సూత్రం చాల స్పష్టంగా ఉంది.

అందువలన, పాఠశాలల్లో మతబోధనకు మినహాయింపు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఒక విద్యాసంస్థను నడిపి, మతబోధ చేయకూడదు, కాబట్టి, మనం అందు కనుమతివ్వకూడదు. ఎయిడెడ్ పాఠశాలల విషయంలోనే కాక, ప్రభుత్వం గుర్తించే పాఠశాలల విషయంలో కూడా అంతేనని రాజ్యాంగం హామీ యిస్తోంది.

అంతేకాదు. మినహాయింపు చేయడానికి హాజరు తనిఖీ సంఘానికి అధికారమిస్తూ ఈ బిల్లులో ఒక క్లాజుంది. “తదితర ఒత్తిడి పరిస్థితులు”న్నపుడు హాజరు తనిఖీ సంఘానికి మినహాయింపు యివ్వవచ్చునని ఉంది. “తదితర ఒత్తిడి పరిస్థితులేమిటో” మన కెవరికీ తెలీదు. ఆమాటకు నిర్దిష్టంగా నిర్వచనం ఇవ్వకపోతే, 'అనారోగ్యమనీ', ఇంటికి దూరమనీ,' అదనీ, ఇదనీ' అన్న వ్యాఖ్యానాలు ఆ మాటకు చేయవచ్చు. ఆ మాట నిర్దిష్టమైన నిర్వచనం యివ్వకపోతే తనిఖీ హాజరు అధికారులకు లంచగొండితనాని కిదొక పెద్ద వనరుగా చేయడమవుతుంది.

విద్య అందరకూ ప్రాథమిక హక్కు

ఏ జాతివారికైనా మినహాయించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సంపూర్ణాధికారం ఎందుకివ్వాలో నా కర్థం కాదు. ఏ జాతికి విద్య అవుసరం లేదో నాకు తెలుసుకోవాలని ఉంది. ప్రతి కులమూ, జాతీ, ప్రతి మతం వారికీ విద్య అనేది ప్రాథమిక హక్కు. కులతత్వానికీ, మతమౌఢ్యానికి వ్యతిరేకంగా నిజమైన పోరాటం, ప్రజాస్వామ్యం సమర్థవంతంగా పనిచేయడానికి ఒక ప్రధానమైన అవసరం. కాని ఈ క్లాజు వలన ఈ బిల్లునుండి ఒక జాతికో, ఒక తరగతివారికో మినహాయింపు యివ్వడం జరుగుతోంది. ఇది చాల తప్పు. ఈ మినహాయింపు కలుగచేసే నిబంధనను ఈ బిల్లులో పొందుపరచడంలో ప్రభుత్వ ఉద్దేశ్యమేమిటో నాకు తెలియడంలేదు.

కొంతమంది వ్యక్తులకు మినహాయింపు సౌకర్యాలను కలుగజేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం వారెందుకు అధికారమివ్వాలి? పేదతరగతులవారికి మినహాయింపు కల్గించాలని మీ ఉద్దేశ్యమా? లేదు కొండజాతుల వారినీ, జిప్సీలనూ మినహాయించాలనా మీరు కోరేది? వాస్తవంగా ప్రాథమిక విద్య కావలసింది వారికే.

విద్యామంత్రి విచిత్ర సమాధానం

శ్రీమాలి: ఢిల్లీకి సంబంధించినంత వరకూ ఈ మినహాయింపు సౌకర్య నిబంధనను తీసివేయవచ్చు. మనం మినహాయించాలనుకునే జాతి ఏదీ బహుశా ఢిల్లీలోలేదనుకుంటాను. కాని, నేను మొదట చెప్పినట్లు, ఈ శాసనం ఒక నమూనా శాసనంగా ఉండాలని యోచిస్తున్నాను. ముఖ్యంగా కొండ జాతులు, జిప్సీలవిషయంలో తక్షణమే ఈ బిల్లు వర్తింప చేయడం సాధ్యపడదు. మనంవారిని విద్యావంతులుగా చేసేముందు వారి ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చాలి. అట్లా చేయకపోతే, వారు మనపై తిరుగుబాటు చేస్తారు.

శ్రీమతి రేణూచక్రవర్తి: మంత్రిగారు చెప్పినది నాకు సంతృప్తికరంగా లేదు. ఎందువల్లనంటే, ఈ సమస్య ప్రాథమిక విద్యకు సంబంధించినదే గాని, సెకండరీ విద్యకు గాని లేక మరింత ఉన్నత విద్యకు సంబంధించిందిగాదు. కొండ జాతుల వారూ జిప్సీలూ చాలా వెనుకబడిన వారు వారికి ప్రాథమికవిద్య అవసరం. కాబట్టి ఒకఉత్తర్వుద్వారా, కొంత మందినిగాని, ఒక జాతినిగాని ఈ బిల్లునుండి మినహాయింపు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల కివ్వరాదు.

“ఏయే తరగతుల వరకూ, లేక ప్రమాణాలవరకూ ప్రాథమిక విద్యగా పరిగణించు అధికారం రాష్ట్ర ప్రభుత్వానికిస్తూ ఈ బిల్లులో ఒక నిబంధన ఉంది.

6 నుండి 14 సంవత్సరాల వయస్సు గలవారి విద్యవిషయం, రాజ్యాంగంలో నిర్దేశించ బడింది కాబట్టి, పార్లమెంటు ఈ విషయం వెంటనే చేయాలంటోంది. ఈ నిబంధనను మరో నిబంధన వలన నిరుపయోగం కాకుండా చూడాలని కోరుతున్నాను. మీరు రాష్ట్రాలకు పూర్తి అధికారాలిస్తున్నారు. ఈవిషయంపై స్పష్టమైన వివరణ కావాలి.

ఇక ప్రాథమిక ఉపాధ్యాయుల జీతాలు పెంచాలి. వారికి సక్రమంగానూ, సరిగానూ జీతాలను చెల్లించాలి. పశ్చిమబెంగాల్‌లో ఆరు నెలల వరకు జీతాలుముట్టని ప్రాథమికోపాధ్యాయులున్నారు. మీరు వారి నా విధంగా మార్చాలంటే, వారేవిధంగా జీవితం గడుపుకోవాలి? అటువంటి వారు ప్రమాణాలకు నిలబడతారని మీరెలా ఆశిస్తున్నారు?

యివి ఈ బిల్లులో పొందుపరచవలసిన ముఖ్య విషయాలు. ఈ బిల్లును సంయుక్త సంఘం లోతుగా పరిశీలిస్తుందనీ, ఈ బిల్లును మెరుగుపరుస్తుందనీ ఆశిస్తున్నాను. సంయుక్త సంఘం పరిశీలన తర్వాత ఈ బిల్లు ఆచరణయుక్తమైన, ఆదర్శవంతమైన బిల్లుగా రూపొందుతుందని ఆశిస్తున్నాను.

* * *

సోవియట్ సందర్శిస్తున్న ఘనా పార్లమెంటరీ ప్రతినిధివర్గం ఈ నెల 4వ తేదీన లెనిన్‌గ్రాడ్‌లోని తీపి బిళ్లల ఫ్యాక్టరీని సందర్శించింది.

చైనాలో సాముదాయక భోజనశాలల్లో, తన పిల్లలతో భోజనం చేస్తున్న తల్లి

జెకోస్లొవేకియా పురోగతి

[1945 మే 9వ తారీఖున విముక్తిపొందిన జెకోస్లొవేకియా ఈ నెల 9వ తారీఖున 15వ వార్షికోత్సవం అత్యుత్సాహ వాతావరణంలో చేసుకుంటోంది. ఈ కాలంలో నూతన జెకోస్లొవేకియా సాగించిన సర్వతో ముఖాభివృద్ధిని తెలియచేసేందుకుగాను ఈ సంగ్రహవ్యాసా న్నందిస్తున్నాం.-సం.

పదిహేనేళ్ళక్రితం 1945 మే 9వ తేదీన జెకోస్లొవేకియా రాజధాని ప్రాగ్ ద్వితీయ ప్రపంచ యుద్ధంలో సోవియట్ సైన్యంచే విముక్తి చేయబడింది ఆరేళ్లు నాజీ ఆక్రమణపిమ్మట జెకోస్లొవేకియా తన స్వాతంత్ర్యాన్ని తిరిగి సంపాదించుకున్నది.

యుద్ధంలో విపరీతమైన నష్టం సంభవించింది. ఒక్క పరిశ్రమలోనే 384 మిలియార్డ్ల యుద్ధపూర్వపుక్రౌన్ల నష్టం కలిగింది. పారిశ్రామిక ఉత్పత్తి బాగా పడిపోయింది. అయినప్పటికీ 1948 లోనే పునర్నిర్మిత పరిశ్రమలు యుద్ధపూర్వపుస్థాయిని దాదాపు 8 శాతం దాటిపోయాయి.

1918 లో జెకోస్లొవేక్ రిపబ్లిక్ ఏర్పడేసరికే అది ఆర్థికంగా బాగా అభివృద్ధిపొందిన దేశం; అయినప్పటికీ పారిశ్రామిక వుత్పత్తి పెరగలేదు. 1937 లో అది 1929 స్థాయికంటే తక్కువగా వుండేది.

ఈనాడు పారిశ్రామికోత్పత్తి 1937 లో కంటే సుమారు నాలుగురెట్లు ఎక్కువగా వుంది. అందువల్ల జెకోస్లొవేకియా ప్రపంచంలో పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధిపొందిన దేశాలలో ఒకటైంది. జాతీయ ఉత్పత్తిలో పరిశ్రమల భాగం సుమారు 68 శాతం వున్నది 1948 నుండి 1958 వరకూ సాలుకు సగటున 11.7 శాతం చొప్పున పారిశ్రామికోత్పత్తి పెరిగింది. అమెరికాలో యీ పెరుగుదల 2.5 శాతం, బ్రిటన్‌లో 3.4 శాతం, ఫ్రాన్స్‌లో 6.6 శాతం మాత్రమే. మొత్తం పారిశ్రామికోత్పత్తిలో ఇంజినీరింగ్ పరిశ్రమల వాటా 30 శాతం మొత్తం పారిశ్రామికోత్పత్తిలో సుమారు 64శాతం, ఉత్పత్తి సాధనాలే. కొత్తఫ్యాక్టరీలు, విద్యుత్ కేంద్రాలు గనులు తదితర పారిశ్రామిక సంస్థలు ముఖ్యంగా గతంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలో నిర్మించబడుతున్నాయి.

పారిశ్రామికాభివృద్ధి యితర ఆర్థిక శాఖల సర్వతోముఖాభివృద్ధికి దారితీసింది. వ్యవసాయానికి లక్షలకొద్దీ యంత్రాలు సమకూర్చబడ్డాయి; వ్యవసాయరంగంలో సహకారోద్యమం, భారీస్థాయి ఉత్పత్తి బాగా పెంపొందేయి. పూర్వం 15 లక్షల వ్యక్తిగత పొలాలు చెదురుగావుండేవి. అలాంటిది 1959 డిసెంబరు 31 నాటికి జెకోస్లొవేకియాలోని నూటికి 83.3 వంతుల గ్రామాలలో 12,500 వ్యవసాయ సహకార సంఘాలు 4,789,402 హెక్టర్ల సాగు భూమిని-యిది మొత్తం భూమిలో 65.4 శాతం-సాగుచేస్తున్నాయి. 1959 సంవత్సరాంతానికి సహకార క్షేత్రాలూ, ప్రభుత్వ క్షేత్రాలు కలిసి మొత్తం సాగుభూమిలో 83.5 శాతం సాగు చేశాయి.

జెకోస్లొవేకియా విదేశ వ్యాపారంలో ముఖ్యంగా ఎగుమతి అవుతున్నది పారిశ్రామిక వస్తువులు. మొత్తం ఎగుమతులలో ఇంజనీరింగు వస్తువుల వాటా సుమారు 44 శాతం.

జెకోస్లొవేకియా ప్రపంచంలోని అన్ని దేశాలతోనూ వ్యాపార సంబంధాలను కలిగివుంది. ఆర్థికంగా వెనుకబడిన దేశాల పారిశ్రామికీకరణకు తనకు వీలైన సాయం చేస్తున్నది.

గత 15 ఏళ్లలో జెకోస్లొవేకియా 300 పూర్తి పారిశ్రామిక ప్లాంటులను ఎగుమతి చేసింది. వాటిలో చాలా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో పనిచేస్తున్నాయి.

జెకోస్లొవేకియా శాస్త్రవిజ్ఞానం పట్ల చాల శ్రద్ధవహిస్తున్నది. 1948-58 మధ్యకాలంలో శాస్త్రవిజ్ఞాన పరిశోధనపై ఖర్చు 5.6 రెట్లు పెరిగి సుమారు 160 కోట్ల కొరోనాలయింది. ఈ ఖర్చు పారిశ్రామికోత్పత్తి మొత్తం విలువలో దాదాపు 2 శాతం 1959 ప్రారంభనాటికి దేశంలో 346 వైజ్ఞానిక పరిశోధనా సంస్థలున్నాయి. వాటిలో 43,000 మంది వుద్యోగులున్నారు.

జెకోస్లొవేకియాలో 39 విశ్వవిద్యాలయాలున్నాయి. ప్రతి వెయ్యి మంది జనాభాకూ 571 మంది విశ్వవిద్యాలయ విద్యార్థులున్నారు. ఈ విషయంలో జెకోస్లొవేకియా అత్యంత అభివృద్ధి పొందిన పశ్చిమ యూరోపియన్ దేశాలను అధిగమించింది.

సాంస్కృతికరంగంకూడా బాగా అభివృద్ధి అయింది. సంస్కృతి ప్రజల కందుబాటులోకొచ్చింది. 1959 లో నాటకశాలలు దాదాపు28,000 ప్రదర్శనలిచ్చాయి వాటిని 1 కోటి 28 లక్షల మంది ప్రేక్షకులు చూశారు 8530 ప్రభుత్వ సినిమా మందిరాలు 11 లక్షల ప్రదర్శనలిచ్చాయి. వాటిని 1 కోటీ 74 లక్షలమంది ప్రజలు చూశారు. (జెకోస్లొవేకియా జనాభా దాదాపు 1కోటీ 35లక్షలు). అదే సంవత్సరం 35 పూర్తి నిడివిచిత్రాలు, 800 లకు పైగా చిన్నచిత్రాలు,వార్తాచిత్రాలు నిర్మించబడ్డాయి. ప్రభుత్వ వాయిద్యబృందాలు 2900 సంగీత కచేరీలు చేశాయి. వాటిని 20 లక్షలమంది శ్రోతలు విన్నారు. 1959లో 4,800 గ్రంథాలు 510 లక్షల ప్రతులలో ప్రచురించబడ్డాయి. అంటే మనిషికి 4 పుస్తకాల చొప్పునన్నమాట. ప్రతి గ్రామంలోనూ ఒక గ్రంథాలయం వుంది. ప్రతి కుటుంబానికీ ఒక వైర్‌లెస్ సెట్ వున్నది. జనాభానుబట్టిచూస్తే దేశంలో వున్న టెలివిజన్ సెట్లసంఖ్య ఫ్రాన్స్ స్వీడన్‌లలో కంటె ఎక్కువ.

గత 15 ఏళ్లలో ప్రజల జీవన ప్రమాణం బాగా పెరిగింది 1959 లో కార్మికులు వుద్యోగులు 1937 లో కంటె సగటున 50 శాతం ఎక్కువగా వస్తువులు కొనగలిగారు. తల ఒక్కింటికి మాంసం, గుడ్లవాడకంలో జెకోస్లొవేకియా స్వీడన్, జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్‌ల స్థాయికి చేరుకున్నది. పాలు, పంచదార వాడకంలో బెల్జియం, ఫ్రాన్స్, జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ మొదలగు దేశాలకంటే ముందున్నది.

తలఒక్కింటికి పాదరక్షల వాడకంలో అది ప్రపంచంలో అగ్రస్థానంలో వున్నది బట్టలవాడకంలో అది బెల్జియం, స్వీడన్ దేశాలకంటే ముందున్నది. ఉచితవిద్యా, ఆరోగ్య సౌకర్యాలూ, జబ్బుపడినప్పుడు వృద్ధాప్యంలోనూ భద్రత, కుటుంబ ఉపకార వేతనాలు, తక్కువ ఇంటి అద్దెలు, సెలవులు,విశ్రాంతి విరామాలు మొదలగు సౌకర్యాల విషయంలో పెట్టుబడిదారీ దేశాలేవీ జెకోస్లొవేకియాతో సరితూగజాలవు. 1959 లో సంస్కృతి, సాంఘిక సంక్షేమం, ఆరోగ్య రక్షణ-వీటికోసం జరిగిన ఖర్చు 1937 లో కంటే 11 రెట్లు ఎక్కువ. ప్రతి వెయ్యిమంది జనాభాకూ 14.9 ఆస్పత్రిమంచాలతో ప్రతి 616 మంది ప్రజలకూ ఒక డాక్టరుతో జెకోస్లొవేకియా అమెరికాతో సహా సామ్రాజ్య రాజ్యాల అన్నిటికంటే ముందున్నది. 1937లో పిల్లల మరణాలు ప్రతి వెయ్యికీ 117 అయితే, యీనాడు 25.8 మాత్రమే. 1929-1932 దశతో పోల్చినట్లయితే సగటు ఆయుర్దాయం పురుషులలో 51.9 నుండి 67 సంవత్సరాలకూ, స్త్రీలలో 55.2 నుండి 72 సంవత్సరాలకూ పెరిగింది

సహకార వ్యవసాయం

1945 మే 9న అవతరించిన నూతన జెకోస్లొవేకియా వ్యవసాయంలో చిన్నస్థాయి వుత్పత్తి నుండి భారీస్థాయి సహకార వ్యవసాయానికి క్రమంగా మారుతూ వచ్చింది. పూర్వపు 1,500,000 వ్యక్తిగత క్షేత్రాలు 12500 సహకార క్షేత్రాలుగా విలీనమైనాయి. అవి యిప్పుడు సాగుభూమి అంతటిలో పంటలు పండిస్తున్నాయి. సహకార క్షేత్రాలు ఏర్పడడంవల్లనూ, ప్రభుత్వం పెట్టుబడులవల్లనూ పెద్ద స్థాయిలో యంత్రాల వినియోగమూ, పెద్దపెద్ద నిర్మాణాలు సాధ్యమైనాయి.

ఈ కాలంలో వ్యవసాయం నుండి చాలమంది కార్మికులు పరిశ్రమలకు రావడానికీ వ్యవసాయోత్పత్తిని పెంచడానికీ వీలయింది. రైతుల ఆదాయాలుకూడా బాగా పెరిగాయి.

విముక్తిదాతలు

1945 మే 5వ తేదీన ప్రాగ్‌లో జర్మన్ ఆక్రమణదారులపై పోరాటానికి సాయుధులైన జెక్ సైనికులు సోవియట్ టాంకుల సాయంతో జర్మన్లను తరిమివేశారు 1945 మే 9వ తేదీన జెకోస్లొవేకియా ఆరేళ్ళ నాజీ ఆక్రమణ పిమ్మట తన స్వాతంత్ర్యాన్ని సాధించుకుని నవసమాజ వ్యవస్థ నిర్మాణం ప్రారంభించింది. ఈ వ్యవస్థలో ఫ్యాక్టరీలు, గనులు, ఉత్పత్తి సాధనాలన్నీ ప్రజల ఆస్తి అయాయి.

గదర్‌పార్టీ చరిత్ర

- సీరియల్

(గత సంచిక తరువాయి)

జోధ్‌సింగ్ ద్రోహం: మా అరెస్టు

బ్రిటిష్ ప్రభుత్వ డిటెక్టివ్ తన యింటివద్ద జోధ్‌సింగ్‌ను మచ్చిక చేస్తున్నాడని ఒకరోజున విన్నాను. విని నిర్ఘాంతపోయాను. వెంటనే అతని వద్దకు వెళ్ళాను. రానున్న ప్రమాదాన్ని గూర్చి జోధ్‌సింగ్‌ను ఇవతలకు పిల్చి హెచ్చరించాలనుకున్నాను. కాని ఆ అపరాధ పరిశోధకుడు నాకు ఒక్క క్షణం అవకాశంకూడా యివ్వలేదు.

కాని జోధ్‌సింగ్‌తో కరచాలనం చేశాను. అలా చాలసేపు కరచాలనం చేస్తూనే అతని అరచేతిలో చూపుడు వ్రేలుతో గీకడం ప్రారంభించాను. విషయాన్ని అతను అర్థంచేసుకోవడం కోసమే నేనలా చేశాను. ఇవతలికి వచ్చేశాను. జోధ్‌సింగ్‌ను త్వరలోనే కలుసుకోగలననే ఆశతో వచ్చేశాను. ఈ వ్యవహారమంతా నా మిత్రులందరికీ చెప్పాను.... అది మరునాటి ఉదయం. నాలుగు గంటలైంది. బ్రిటిష్ ప్రభుత్వ డిటెక్టివ్‌కు ఆతిథ్యం యిచ్చిన స్థానిక ఆర్యసమాజ నాయకుడు నేనున్న బసకువచ్చి నన్ను లేపాడు. జోధ్‌సింగును డిటెక్టివ్ బుట్టలోవేసుకున్నాడని, అన్నపానీయాలు యిప్పించి చివరకు ఆయనవద్దనుండి గదర్ ఉద్యమాన్ని గూర్చి సమాచారమంతా సేకరించాడనీ చెప్పాడు. ఫలితంగా జోధ్‌సింగ్‌తో సహా గదర్‌పార్టీకి చెందిన వారందర్నీ పోలీసులు అరెస్టు చేశారు. బాంకాక్‌లోని అంతర్జాతీయ జైలులో ఖైదు చేశారు. గదర్‌పార్టీ విప్లవకారులు అరెస్టయిన రాత్రి, నేను నా బసకు చాలదూరంలోవున్నా. అందులోనూ అర్ధరాత్రి. అందుచేత నన్ను అరెస్టు చేయడం పోలీసులకు సాధ్యం కాలేదు. ఆ ముసలాడు డిటెక్టివ్ ఆఫీసరని తనకు తెలియదనీ, అతను ప్రముఖ ఆర్యసమాజ వాదని అమాయకంగా నమ్మాననీ ఆయన నాతో చెప్పాడు. నేను కోరుకుంటే నన్ను ఉత్తరంగా చైనా సరిహద్దుల్లోని అడవులు, పర్వతాలకు పారిపోవడానికి తాను సాయపడగలనన్నాడు. సరేనని ఒప్పుకున్నాను. అవసరమైన ప్రధానమైన డాక్యుమెంట్లన్నింటినీ చేతి సంచీలో పెట్టాను. కొద్దిపాటి బట్టలను ఒక మూట చుట్టాను. నాకంతకు ముందు తెలిసివున్న ఒక స్పానిష్ హోటల్‌కు వెళ్ళాం. నా సామాన్లన్నింటిని నా బసలోనే విడిచిపెట్టాను. ఒకటి రెండు గంటల్లోనైన తరువాత తిరిగి వస్తామని చెప్పాం. పారిపోవడానికి ఎత్తులు వేయడానికి మళ్ళీ చీకట్లో అదృశ్యమై పోయాం. ఆ సాయంత్రం వరకు ఎవరింట్లోనైనా అజ్ఞాతవాసం గడుపవలసిందిగా నా సహచరుడు నాకు సలహా యిచ్చి వెళ్ళాడు. బాంకాక్ తర్వాత దగ్గరలో వున్న రైల్వేస్టేషన్ వద్ద రాత్రి 8 గంటలకు కలుసుకుందామనుకున్నాం. ఈలోగా అటునక్కి, ఇటునక్కి, సాయంత్రం అయేసరికి బసకు చేరుకుని, రిక్షాలమీద పోవడం ఇవంతా విసకమైంది. కొంతసేపయిన తరువాత బ్రిటిష్ పోలీసు ఆఫీసరొకడు కారులో నన్ను వెంబడిస్తుండడం కనిపెట్టాను. నన్ను అరెస్టు చేశాడు. మొదట్లో తన బంగళాకు తీసుకు వెళ్ళాడు. 'టీ' తీసుకొస్తాను వుండమని టీ తెప్పించడానికి వెళ్ళాడు. ఈలోగా నేను నా వద్దనున్న నోట్‌బుక్‌ను, యితర కాగితాలను అన్నింటినీ తగలపెట్టేశాను. ఆరోజున డ్యూటీలోవున్న పోలీస్ కానిస్టేబుల్‌కు నేనెవరో తెలియదు. నేనేం చేస్తున్నదీ అంతకంటే తెలియదు. బహుశా నేను తన అధికారి స్నేహితుడనై వుంటాననుకుని వుండాలి. 'టీ' వచ్చింది. త్రాగాను. నన్ను తీసుకెళ్ళి అంతర్జాతీయ జైల్లో క్రుక్కారు. జైల్లో నేను బల్వంత్‌సింగ్ గ్రాంథీ, ఠాకూర్‌సింగ్, జోధ్‌సింగ్, ఛట్టీ, శివదయాళ్ గుప్తాలను కలుసుకున్నాను. నా బసలోవిడిచిన సామాన్లను జైలుకి చేరవేశారు. కాని నా చేతిపెట్టె వగైరాలన్నీ స్పానిష్ హోటల్‌లోనే వుండిపోయాయి. ఈ పెట్టెఅక్కడవుండిపోవడమే మంచిదయింది. లేకపోతే దానిలో ప్రాణాలమీదకు తెచ్చే రహస్యాలున్నాయి.

జోధ్‌సింగ్ సమస్తమూ బ్రిటిష్ డిటెక్టివ్ ఉద్యోగికి చెప్పివేశాడని నా స్నేహితులు నాకు చెప్పారు. అతని డైరీ, జమా ఖర్చుల పుస్తకమూ పట్టుబడ్డాయని, జర్మనీ, లోని నాయకుల చిరునామాలతోపాటు దక్షిణ, ఉత్తర అమెరికాలలో జోధ్‌సింగ్ సంబంధాలు పెట్టుకున్న విప్లవకారుల పేర్లూ, చిరునామాలూ దొరికిపోయాయినీ చెప్పారు. జోధ్‌సింగ్, మేమూ అంత కలసి ఒకే జైల్లో వుంటున్నా, మానుంచి అతన్ని బహిష్కరించాం. అతనంటే ఏహ్యభావం కలిగింది అందరికీ. మిగతావారంతా నావలెనే తమ వద్దనున్న ప్రమాదకర రహస్య పత్రాలను తగులపెట్టేశారు. కాని లాభం ఏమిటి? ఇప్పుడు తగలపెడితే ఏం, పెట్టకపోతే ఏమి? ఎందుచేతనంటే మాబోటి వందలాది విప్లవకారులపై దాడికి సరిపడా సమాచారాన్ని జోధ్‌సింగ్ అందించే వున్నాడాయె!

(7) మా అపజయం

తర్వాత చేయాల్సిందేమిటి? తప్పించుకు పారిపోవాలా - జైలుబయట మా కెట్టి సంబంధాలూ లేవు. జైలు సూపరింటెండెంట్‌గా ఒక సయామ్ ఆఫీసరు వున్నాడు. ఆయన చాలా కరుణార్ద్రహృదయుడు. మేమంటేచాల ఉదారంగా వుండేవాడు. సయాం ప్రభుత్వం బ్రిటిష్ వారి తొత్తుఅనీ, సయాంలో పరిపాలనంతా వాస్తవానికి బ్రిటిష్ వాళ్ళదేనని ఆయన మాతో చెప్పేవాడు. పైనా సముద్రతీరంలో వున్న అంతర్జాతీయ రేవులకు చేరాలంటే అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని మాకు వర్తింపచేసేట్లు మేము చేసే ప్రయత్నాలు నేటిని బ్రిటిష్ వాళ్ళు సాగనివ్వరని మాకు చెప్పాడు. ఈ ఆఫీసరు చెప్పిందంతా వాస్తవమేనని మేము నెల గడచిన తరువాతగాని తెలుసుకోలేక పోయాము. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మమ్ములను ఎట్లాయితేనేం పట్టుకున్నారు. మాపై కుట్రకేసు బనాయించి విచారణ జరపడానికి మమ్ములను భారతదేశం తీసుకుపోతారనుకున్నాం. నెల గడిచిన తరువాత మమ్ములను సయామ్ ప్రభుత్వ స్టీమరు ఎక్కించారు. దానినుండి సయాం సముద్రతీరానికి అల్లంత దూరాన ఎక్కడోవున్న రవాణా స్టీమర్‌లోకి ఎక్కించారు. ఈమార్పుచూసి మేమంతా విస్మయం చెందాం. స్టీమరునుండి దింపి మమ్ములను సింగపూర్ ప్రభుత్వ పోలీసులకు అప్పగించారు. విదేశీయులైన బ్రిటిష్ పాలననుండి బర్మాను విముక్తి చేద్దామనుకున్న మాప్రయత్నం విఫలమైంది. మేమప్పుడు చేయగలిగిందల్లా - బ్రిటిష్ సామ్రాజ్యవాదులూ, భారత గూఢచారులు, విద్రోహుల బారినుండి మాప్రాణాలను దక్కించుకోవడ మొక్కటే.

బ్రిటిష్‌వారికి అప్పగింత

లాహోర్ కుట్రకేసు - రెండో ఘట్టం

మాపై అజమాయిషీ చెలాయిస్తున్న బ్రిటిష్ పోలీసు ఆఫీసరు మమ్మల్ని అమానుషంగా చూచేవాడు. చిత్ర

(మిగతా 6 వ పేజీలో)

శ్రీ దరిశి చెంచయ్య

వినోదం - విజ్ఞానం:

తోడేలు

తోడేలు చూడడానికి అల్సేషియన్ జాతికుక్కలాగా యుంటుంది. బరువు 110 పౌనులకు మించదు. తోకచివర నుండి ముక్కువరకు) ఆరడుగుల పొడవుంటుంది. దట్టమైన పొదలలోనూ, శిలాబొరియల్లోనూ, చెట్టుతొర్రల్లోనూ పిల్లను పెట్టుతుంది. ప్రతి యీతకు 5 నుండి 10 వరకూ పిల్లలు పుడుతాయి. తోడేలు 15 ఏళ్లు బ్రతుకుతుంది. కాని ముసలితనం రాగానే ఆహారం సంపాదించుకొనే శక్తి తగ్గగానే తిండి దొరకకో, లేక శత్రువులకు చిక్కో మరణిస్తుంది. యివి గుంపులుగా తిరుగుతూ ఉంటాయి. అందుచే వీటికి తోడేళ్ళమంద అనే పేరు వచ్చింది.

యివి మైళ్ళకుమైళ్ళు తిరిగి వేటాడి జంతువులను చంపి తిని జీవిస్తాయి. మనుష్యులలో దేశదిమ్మరులలాగా అడవిజంతువులలోయివి దేశద్రిమ్మరులు. ఒక రోజున వీటిచే చంపబడే జంతువుకు మరొకరోజు చంపబడే జంతువుకు నలభై మైళ్ళ దూరంగూడా ఉంటుంది. యీ విధంగా వేటాడుకుంటూ పోయిపోయి తర్వాత కొన్నాళ్ళకు మరల తిరిగి వేటాడుకుంటూ వస్తాయి.

యివిచంపదలచిన జంతువును, అలసిపోయేవరకు తరిమి చుట్టుముట్టి అన్నివైపులనుండి దాడిచేస్తాయి. జంతువును మధ్యలోపెట్టి కవ్విస్తూ ఉంటాయి. ముందున్న తోడేళ్లను తరిమివేయబోతే వెనుకనుండి కండలు పీకేస్తూంటాయి: వెనుకకు తిరిగితే ఆవైపునుండి మీదపడి కరచేస్తూంటాయి. యీ దాడిలో జంతువు ముక్కును కొరికేస్తాయి. చెవులు పట్టుకొని జంతువును కదలనివ్వకుండా నిలవేస్తాయి. కళ్ళను కొరపళ్ళతో పీకివేస్తాయి. చివరకు జంతువు వీటిని తప్పించుకోలేక గాయాలనుండి రక్తంపోయి, బలహీనపడి భయంతో పడిపోతుంది. అప్పుడు తోడేళ్ళు గుంపుగా దాని శరీరంపైబడి బ్రతికుండగానే తినడం మొదలు పెడతాయి.

తోడేళ్లు జంతువులను చంపే పద్ధతి క్రూరమైంది యిది క్రూరాతిక్రూరమై చిత్రవధతో సమానం. తోడేళ్లు అడవి దున్నల్ని గూడా చంపుతూ ఉంటాయి. పెద్ద పులులు, చిరుతపులులవలన చంపబడ్డ జంతువులను, అవితినగా వదలిపెట్టినమాంసాన్ని తోడేళ్లు తింటూంటాయి. తిండిదొరకని సమయాల్లో చచ్చిన తోడేలు మాంసాన్ని మరొక తోడేలుతింటుంది. తోడేలు మహా క్రూరమైనదేగాక ఎంతో తెలివితేటలు గలదిగూడా. వేటగాళ్లను మోసగించడంలో యిది ఎంతో చాతుర్యాన్ని చూపుతుంది.

తోడేళ్ళు పసిబిడ్డల్ని ఎత్తుకొనిపోయి చంపకుండా పెంచుతాయనే కథ ఒకటి ఉంది. సుమారు 5 ఏండ్లకు పూర్వం, ఒకానొక అమెరికా అరణ్యంలో 14 ఏండ్ల కుర్రవాడు ఒకడు దొరికాడు. అతడు తోడేలువలె అరచేవాడు. విపరీతమైన వేగంతో పరుగెత్తేవాడు. యితడు తోడేళ్ళవల్ల పెంచబడ్డాడని అనుమానించారు. యితని ఫోటోలు పత్రికల్లో గూడా పడ్డాయి. ఒకసారి అతడు తప్పించుకొనిపోతే అతనిని తిరిగి పట్టుకోడానికి మోటారు సైకిళ్ళు ఉపయోగించాల్సి వచ్చిందట. ఎంతో ప్రయత్నంపై చివరకు దొరికాడు.

బట్టలు వేసుకోవడమన్నా, యిండ్లలో ఉండడమన్నా, మనమాదిరిగా ఉండడమన్నా, అతనికి ఎంతో చిరాకు - ఉండేదట. తర్వాత అతనిని గురించి వివరాలు ఏమీ తెలియలేదు.

శ్రీ వీరపనేని కుటుంబరావు.

నేటి ప్రపంచం

* కామన్వెల్తు ప్రధానుల సమావేశం: ప్రధానసమస్యలు

కామన్వెల్తు ప్రధానుల సమావేశం లండన్‌లో ఈ నెల 3 న ప్రారంభమైంది. ద్వితీయప్రపంచయుద్ధానంతరం ఇది తొమ్మిదో సమావేశం. 11 దేశాలలో వివిధజాతులకు చెందిన 70 కోట్ల ప్రజలకు ప్రతినిధులుగా కామన్వెల్తు రాజ్యాల ప్రధానులు సమావేశమవుతున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యానికి లాభదాయకమైనవిధంగా విధానాలను రూపొందించేందుకు ఏర్పడ్డ సమాఖ్యయే ఈ కామన్వెల్తు.

నేటి కామన్వెల్తు ప్రధానుల సమావేశం కొన్ని ప్రత్యేక పరిస్థితులలో జరుగుతోంది. ఒకవైపున యావత్ప్రపంచాన్ని కలవరపెట్టిన దక్షిణాఫ్రికా ప్రభుత్వముష్కర జాత్యహంకార విధానం వెర్రితలలువేసింది. ఇదన్నింటికంటే ప్రధాన సమస్యగా ముందుకొచ్చింది-ముఖ్యంగా కామన్వెల్తు భవిష్యత్తుకు. మరోవైపున ఈ నెలలో పారిస్‌లో ప్రపంచరాజకీయాలపై ముఖ్యంగా నిరాయుధీకరణ, జర్మనీ భవితవ్యం విషయమై అగ్రరాజ్యాధిపతులు సమావేశం కానున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాలలో రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న నిరంతర పోరాటాలు మరింత ఉధృతం కావడం మరో విశేషం.

ఈ సమస్యలన్నింటిపైన కామన్వెల్తు అభిప్రాయం ఎలావుండనున్నది? కామన్వెల్తు, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించగలదా? అన్న విషయమై అందరూ ఎదురుచూడ్డం సహజం.

నేడొక ప్రధాన సమస్యగా తలెత్తిన జాత్యహంకార విధానాలు ముఖ్యంగా దక్షిణాఫ్రికా జాతి వివక్షా వైఖరిపట్ల ప్రపంచమంతటా ఖండన పరంపర వ్యక్తమయితే, బ్రిటిష్ ప్రభుత్వంగాని, దాని ప్రధానిమాక్మిలన్‌గాని నోరు మెదపక పోవడం సభ్య ప్రపంచానికి తెలుసు. ఇటువంటి ప్రధాని అధ్యక్షాన జరుగుతున్న నేటి కామన్వెల్తు సమావేశం జాతివివక్షా విధానాలను “అపార్థీడ్” (వర్ణ విభజన సిద్ధాంతం)ను కూలంకషంగా చర్చించి అభిశంసించడానికి అవకాశం వుంటుందా? అన్న ప్రశ్న. కామన్వెల్తు సభకు వెళ్ళబోయేముందు భారత ప్రధాని నెహ్రూ, కెనడా ప్రధాని డిఫెన్ బేకర్‌లాంటి సభ్య దేశాల ప్రధానులు ఎట్టి పరిస్థితుల్లోనూ మహాసభలో దక్షిణాఫ్రికా జాతి సమస్యను గూర్చి చర్చిస్తామనిచెప్పినవారే. కాని తీరా లండన్ చేరుకొనేసరికి 'ప్లేటు' మార్చాల్సి వచ్చింది. ఇందుకు కారణం బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ వేసిన ఎత్తుగడే. సాఫల్యమైనంతవరకు మహాసభలో దక్షిణాఫ్రికా సమస్య చర్చకు రాకుండా చూడ్డానికే మాక్మిలన్ ప్రయత్నిస్తూ వచ్చాడు. ఒకరి అంతరంగిక విషయాలను కామన్వెల్తు చర్చించడం భావ్యం కాదని ఇందుకొక సాకుచెప్పి తప్పుకున్నాడు. వీటన్నింటికీ సభ్యదేశాల ప్రధానులు 'మూడూ బసవన్న' పలికారు. చివరకు దక్షిణాఫ్రికా సమస్య ఇష్టాగోష్ఠి చర్చగా అంటే వివిధ దేశ ప్రధానులు విడివిడిగా ఎవరికి వారు దక్షిణాఫ్రికా ప్రతినిధి ఎరిక్‌లోగారితో ప్రత్యేకంగా గోష్ఠి జరిపి వస్తారన్న మాట అందువల్ల యావన్మంది ప్రధానుల సమక్షంలోనూ 'దుష్టుడ్ని' అభిశంసించే కాలం దాటిపోయింది. బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని అవకాశంగా తీసుకునే ఎరిక్‌లో ఒక ప్రకటన చేశాడు. ఈప్రకటన, దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఇటీవల తాము జరిపిన ఘోరహత్యాకాండప్రపంచప్రజాభిప్రాయాన్నెంతమాత్రం ఖాతరు చేయలేదని స్పష్టం చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తెల్లజాతి ఆధిక్యతను లొంగబోదని రొమ్మువిరిచి చెప్తున్నాడు. మరి ఇంతటి కరడుగట్టిన ప్రభుత్వ విధానాన్ని కేవలం ఇష్టాగోష్ఠి చర్చల ద్వారా సే మార్చగలమనుకోవడం భ్రమజనితవాదమే. ప్రస్తుతం లండన్‌లో వున్న కామన్వెల్తు సభ్య దేశాల ప్రధానుల్లో ఒక్క మలయా ప్రధాని మినహా, ఏఒక్కరూ యీ విషయమై తప్పనిసరిగా చర్చ జరగాలని కోరకపోవడం బ్రిటిష్ విధానాలకు లొంగిపోవడమే కాగలదు. భారతప్రధాని నెహ్రూ అయినా జాత్యహంకారవిధానాన్ని సాధారణంగా విమర్శించారుగాని, దక్షిణాఫ్రికా సమస్యపై పట్టుపట్టక పోవడం ఆశ్చర్యకరం. ఈ సందర్భంలో, త్వరలోనే కామన్వెల్తులో సభ్యత్వం స్వీకరించనున్న నైగీరియా దేశ ప్రధాని ఒక్కరే ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించగలిగారని చెప్పాలి. 'దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని కామన్వెల్తు నుండి తన్ని గెంటివేయండి' అని ఆయన చెప్పారు ఇదిహర్షణీయమైన విషయం.

దక్షిణాఫ్రికా సమస్యను అటూ ఇటూ త్రిప్పి ప్రధాని మాక్మిలన్ దాటవేయడానికి చేసిన ప్రయత్నం సఫలంకాగా, కామన్వెల్తు సభ ముందున్న ఎజెండాలో ప్రధాన చర్చనీయాంశాలివి: శిఖరాగ్ర సమావేశ ఫలితావకాశాలు; సోవియట్ చైనాల విదేశాంగ విధానం; యూరప్, పశ్చిమాసియా, ఆగ్నేయాసియా, తూర్పుఆసియాలలో తాజా పరిణామాలు; నిరాయుధీకరణ సమస్య, స్టెర్లింగ్ ప్రాంత సమస్య; బ్రిటీషువలసలపట్ల రాజ్యాంగ చట్టమార్పులు వగైరా.

ఈ నెల మధ్యలో పారిస్‌లో జరుగనున్న శిఖరాగ్రసమావేశ భాగోగుల్ని గూర్చి కూడా కామన్వెల్తు ప్రధానులు చర్చించనున్నారు. అయితే శిఖరాగ్రసమావేశాన్ని గూర్చి ప్రపంచ ప్రజలు ఆశిస్తున్న ఫలితంవేరు. పశ్చిమ రాజ్యాల నేతల దృష్టివేరు. పశ్చిమ రాజ్యాల కూటమిలోవున్న బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ కామన్వెల్తు దేశాల తరఫున శిఖరాగ్ర సమావేశానికి హాజరుకానున్నారు. అటువంటప్పుడు కామన్వెల్తుదేశాల అభిప్రాయాన్నే మాక్మిలన్ ప్రతిబింబిస్తారా? లేక కేవలం బ్రిటిష్ ప్రభుత్వానికే ఆయన ప్రాతినిధ్యం వహిస్తారా? బ్రిటిష్ ప్రభుత్వానికే ఆయన ప్రాతినిధ్యం వహించిన పక్షంలో శిఖరాగ్ర సమావేశాన్ని గూర్చి కామన్వెల్తుసభలో చర్చించడం అసంగతం. కాదూ, కామన్వెల్తు దేశాలకు కూడా మాక్మిలన్ ప్రాతినిధ్యం వహిస్తాడనుకుంటే అది విపరీత చర్యగా అవుపిస్తోంది ఏమంటే కామన్వెల్తులోని ప్రధానమైన ఆసియాదేశాలు నేడు క్రియాశీల తటస్థ వైదేశిక నీతిని అనుసరిస్తున్నాయి కాని మాక్మిలన్ పశ్చిమ రాజ్యాల అభిప్రాయాలకు కట్టుబడినవాడు కదా? మరి ఈ రెండింటికీ లంగరందడం ఎలాగ? అయినా శిఖరాగ్ర సమావేశ చర్చల్లో ప్రపంచంలో పెద్ద దేశాలైన భారత, చైనాలనుకూడా చేర్చుకోవాలన్న విషయాన్ని మాక్మిలన్ అంగీకరిస్తున్నాడా అంటే అదీలేదు. ఇటువంటి పరిస్థితుల్లో శిఖరాగ్ర సమావేశాన్ని గూర్చి కామన్వెల్తు చర్చ జరపడంవల్ల బ్రిటన్ కేమయినా లాభమేమోగాని సభ్యదేశాలకుమాత్రం ఒరిగేదేమీలేదు. ఇక సోవియటు, చైనావిదేశాంగ విధానాల్ని గూర్చి చర్చ జరుపుతారట. మరి దక్షిణాఫ్రికా సమస్యను చర్చించడానికి అంతరంగిక ముసుగు అడ్డువచ్చినపుడు సోవియట్, చైనా విధానాలను చర్చించడానికి కామన్వెల్తు సభకు హక్కు ఎక్కడినుండి వచ్చిందనేది ప్రశ్నకలుగుతుంది? పోతే పశ్చిమ ఆగ్నేయాసియా, తూర్పుఆసియాలలో తాజాపరిణామాల్ని గూర్చి చర్చించడంవల్లా ఏమీ లాభంలేదు ఏమంటే ఈ పరిణామాలపై ఆసియాదేశాల అభిప్రాయాలకు, బ్రిటన్ వైఖరికి మధ్య ఘర్షణ రావడం ఖాయం. ఇందులోనూ కామన్వెల్తు సమావేశం విజయం సాధించలేదు. అలాగే సమగ్ర, సంపూర్ణ నిరాయుధీకరణ సమస్యలోనూ. పోతే కామన్వెల్తు సభ ఏదైనా విజయం సాధించగలిగితే అది బ్రిటన్‌కు అనుకూలంగా వుండేరీతిని బ్రిటన్ కొత్తగా ఏర్పరచిన స్వేచ్ఛా వ్యాపార కూటమిలోకి దేశాలను ఈడ్చి దోచుకోవడంలో మాత్రమే. బ్రిటన్ నిన్న మార్కెట్లకోసం ఎంత తాపత్రయపడి ఇతరదేశాలను దోచుకోవడానికి ప్రయత్నిస్తుందో గత సంవత్సరం సెప్టెంబరులో లండన్‌లో జరిగిన కామన్వెల్తు దేశాల ఆర్థిక మంత్రుల సమావేశంలో బయటపడింది. సభ్యదేశాలనుండి ముడిసరుకును చవుకధరలకు తీసుకుపోయి, అమ్మకానికి తయారైన సరకులను ఎక్కువ ధరలకు బడుగుదేశాలకు అంటగట్టడం బ్రిటిష్ ఆర్థిక విధానాల్లో ప్రధాన అంశం. అంతేగాదు, అటు అమెరికా ప్రోత్సాహాన యూరప్‌లో ఉమ్మడి మార్కెట్ ఏర్పడితే, దానికి పోటీగా బ్రిటన్ నిన్న గాక మొన్న నే, స్వేచ్ఛా వ్యాపార మార్కెట్” నొకదాన్ని ఏర్పర్చింది ఈ రెండు దోపిడీ ఆర్థిక కూటాలకు నడ్మ బడుగుదేశాలు నలిగిపోయే రోజు వచ్చింది. ఈ విషయాన్ని కామన్వెల్తులోని సభ్యదేశాలు గుర్తించడం తమ స్వతంత్ర ఆర్థికాభివృద్ధిపట్ల ఎంతో అవసరం.

ఇక కామన్వెల్తులో రాజ్యాంగ మార్పులను గూర్చి బ్రిటిష్ వలసలు 'అభివృద్ధి'ని గూర్చి: తనవిధానాలకు అనుకూలంగా, తనఅడుగులకు మడుగులొత్తు దేశాలను కామన్వెల్తులో చేర్చుకోడానికి అనుగుణంగా రాజ్యాంగ మార్పులు చేయడానికి బ్రిటన్ శాయశక్తులా కృషిచేస్తుంది. అలాగే సైప్రస్ నైగీరియాల అభివృద్ధిపై బ్రిటన్ నివేదిక ప్రకటించినపుడు స్వాతంత్ర్యం పొంది మనం, స్వతంత్రదేశాలు కడు మెలుకువతో వుండడం అవసరం. ఎందుచేతనంటే సైప్రస్, నైగీరియా వగైరా అస్వతంత్ర దేశాల సర్వతోముఖాభివృద్ధికి అనుగుణంగా స్వతంత్రదేశాలు వాదించగలగాలి. ఈ విషయంలో బ్రిటన్ అనేక ఎత్తులు వేస్తుందని కనిపెట్టివుండాలి. ఉదాహరణకు సైప్రస్‌లో తాను కోరుకున్న 120 చదరపుమైళ్ళ ప్రాంతాన్ని సైనిక స్థావరాల ఏర్పాటు చేసుకోవడానికి అంగీకరించలేదన్నదుగ్ధతో నేటిబ్రిటన్ సైప్రస్‌కు నేటికీ స్వాతంత్ర్యం యివ్వలేదు.

ఈవిధంగా అన్ని సమస్యలను సభ్యదేశాలు తమ రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యం దృష్ట్యా శ్రద్ధగా పరిశీలించితే, బ్రిటన్ భావిస్తున్న కామన్వెల్తు స్వభావానికీ, తదితర ఆసియా, ఆఫ్రికా ప్రజలు వాంఛిస్తున్న ఐక్యతావాంఛకూ మధ్యవున్న తేడా బోధపడగలదు.

* * *

టర్కీ రాజకీయాలు:

పట్టుమని రెండు నెలలన్నా గడవలేదు దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియాలలో క్రోధాగ్ని జ్వాలలు చెలరేగి, తిరిగి నేడు టర్కీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇస్తాంబుల్, అంకారాలలో ప్రదర్శనలు జరిగాయి. ప్రజాకోర్కెలను తీర్చలేని ప్రభుత్వం ప్రదర్శకులపై కాల్పులు జరిపింది ఫలితంగా అనేకమంది నేలకొరిగారు. దక్షిణ కొరియా, టర్కీలలో చెలరేగిన ప్రజావెల్లువలలో ప్రధాన పాత్ర విద్యార్థులది కావడం విశేషించి పేర్కొనదగ్గ విషయం.

పార్లమెంటు విచారణ సంఘాల నిర్ణయాలను త్రుణీకరించిన పత్రికలను రద్దుచేసే అధికారాన్ని ఆ సంఘాలకు అప్పగిస్తూ టర్కీ ప్రభుత్వం కొత్తగా బిల్లు ప్రవేశపెట్టినందుకు వ్యతిరేకంగానే ఈ ప్రదర్శనలు జరిగాయని వార్తలు వెలువడ్డాయిగాని, టర్కీఘటనల వెనుక యింతకన్నా బలవత్తరమైన కారణాలే వున్నాయని చెప్పాలి. ఏమంటే పశ్చిమాసియారాజకీయాలలో టర్కీ నేడు ప్రమాదకరపాత్ర వహిస్తోంది.

కెమాల్ అటాటర్కీ ఏర్పరిచిన రిపబ్లికన్ పీపుల్స్‌పార్టీ క్షీణింపనారంభించడంతో నేటిటర్కీరాజకీయాలలో నూతన పరిణామాలు పొడసూపనారంభించాయి. ప్రస్తుత మెండిరిస్‌ప్రభుత్వం అధ్యక్షుడైన బేయార్‌లు రిపబ్లిక్‌పార్టీనుండి విడిపోయి డెమోక్రటిక్ పేరుతో ఒక పార్టీనిస్థాపించి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా నడవసాగారు. 1951 నాటికే టర్కీ ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమిలో చేరింది. ఆ తర్వాతనే దానికి అమెరికన్ సహాయం లభించింది. అంతేగాదు. అమెరికా, బ్రిటన్‌ల ప్రోద్బలం వల్లనే టర్కీ యుగోస్లావియా గ్రీస్‌లతో కలసి బాల్కన్ ఒప్పందం కుదుర్చుకున్నది. అలాగే ప్రస్తుత సెంటో, మాజీ బాగ్దాద్ సైనిక కూటమి నిర్మాణంలోనూ మెండిరిస్ ప్రభుత్వం ప్రధానపాత్ర వహించింది. ఇన్నివిధాలుగా జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలను దేశప్రజలు సహించలేకపోతున్నారనడానికి యిటీవలి ప్రజావెల్లువ ఒక నిదర్శనమనే చెప్పాలి. టర్కీ సైనికకూటాలలో చేరడంవల్ల సైనిక బడ్జెటును పెంచవలసి రావడంవల్లా, దేశ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో చిక్కుకుంటోంది వీటన్నింటికితోడు సంవత్సరంక్రితమే అమెరికా - టర్కీలమధ్య ద్విపక్ష సైనిక ఒప్పందం కుదిరింది. ఇది టర్కీకే కాకుండా యావత్తు పశ్చిమ ఆసియా ప్రజల శాంతిభద్రతలకే విఘాతం. పైగా టర్కీలో సైనికస్థావరాల నిర్మాణానికి, అత్యంత ఆధునిక అణ్వస్త్రాలను అట్టిపెట్టడానికికూడా అమెరికా ప్రయత్నిస్తోందన్న విషయం సభ్యప్రపంచానికి తెలుసు వీటన్నింటిదృష్ట్యా చూస్తే, టర్కీ రాజకీయ భవితవ్యం సంగతి అలావుంచి, ఆర్థిక పరిస్థితి ఎంతటి క్షీణదశకు చేరుతుందో అర్థం చేసుకోవచ్చు తుదకు అమెరికా పత్రికలు సహితం టర్కీ బడుగు స్థితికి గల కారణాలను దాచలేకపోతున్నాయి. “మనం అనుసరించే విధానాలూ, మనం టర్కీలో కీలక స్థావరాల ఏర్పాటుకోసం చేస్తున్న ప్రయత్నాలే నేటి టర్కీ ఆర్థిక దుస్థితికి కొంత కారణం” అని అమెరికన్ గుత్తపెట్టుబడిదార్ల పత్రిక “న్యూయార్క్ టైమ్స్” వెల్లడించింది.

ఈ విధంగా మిలటరీ ఖర్చును అమితంగా పెంచుకుంటూ పోవడంవల్ల, 1960-1961 టర్కీబడ్జెటు- 46కోట్ల 80లక్షల లైర్లు (టర్కీనాణెం) కేటాయించారు ఇది గత సంవత్సరం బడ్జెటులో కేటాయించబడిన మొత్తానికన్నా 10 శాతం ఎక్కువ. అలాగే, దేశంలో వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమలూ కుంటుపడుతున్నాయి. నిరుద్యోగం తీవ్రతరమవుతూంది. ఇన్ని సమస్యలు ముందుంచుకున్న టర్కీ ప్రభుత్వం బాధ్యతలేకుండా వ్యవహరిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదులతో పొత్తు కలిపిన ఫలితంగా, స్వదేశానికే కాకుండా పశ్చిమాసియా శాంతికే ప్రమాదం తెచ్చిపెడుతోంది

వ్యతిరేకతనెన్ని కొనసాగుతున్న సైనికీకరణ పథకాలు నానాటికీ తీసికట్టుగా వున్న ఆర్థిక పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలుగుతుండంటే ఆశ్చర్యపడాల్సిన పని లేదు. ఈ ప్రజా ఉద్యమాన్ని అణచేందుకు టర్కీ ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పూనుకుంది. నేడు రాజకీయ పార్టీల కార్యకలాపాలను నిషేధించడానికి గల కారణం యిదే

అమెరికా తొత్తుఅయిన సింగ్మన్‌రీ విధానాలపై ధ్వజమెత్తిన దక్షిణ కొరియా ప్రజావెల్లువచూచి కాళ్లువణకిపోయిన “న్యూయార్క్ టైమ్స్” టర్కీ ఘటనలపై చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. “మెండెరీస్ ప్రభుత్వ విధానాలు ప్రతిపక్షాలను మరిన్ని హింసాచర్యలకు పురికొల్పవచ్చు ఈ సందర్భంలో టర్కీ, దక్షిణ కొరియా పరిస్థితులమధ్య పోలిక లేకుండా వుండదేం” అని వ్రాసింది. అందుచేత ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను టర్కీ ప్రభుత్వం గమనించి వ్యవహరించాలి లేకపోతే సింగ్మన్‌రీకి పట్టినగతి మెండరీస్‌కూ కూడా కొద్ది కాలంలో తప్పకపోవచ్చు.

— ప్రసాద్.
మే 5

సిటాడెల్‌వారి “ముగ్గురు వీరులు” చిత్రంలో దృశ్యం.

సారధివారి “ఒకటే మార్గం”

హిందీలో విజయవంతమైన 'ఏక్ హీ-రాస్తా' చిత్రాన్ని అనుసరించి సారధివారు తీస్తున్న “ఒకటే మార్గం” ఇప్పటికి హైద్రాబాద్ సారధి స్టూడియోస్‌లో పదిరీళ్ళు పూర్తి అయినాయి.

మరల ఈ నెల 11 వ తేదీ నుండి షూటింగ్ ప్రారంభమవుతుంది.

ఈ చిత్రంలో సావిత్రి, జగ్గయ్య మొదలుగాగల వారు నటిస్తున్నారు.

ముగ్గురు వీరులు

విజయపురివీరన్ అను పేరుగల తమిళ చిత్రాన్ని తెలుగులో డబ్బింగు చేసి “ముగ్గురు వీరులు” అనే పేరుతో రాజశ్రీవారు ఈనెల 12 వ తేదీన ఆంధ్రప్రదేశ్ అంతటా విడుదల చేస్తున్నారు.

మరొక డబ్బింగుచిత్రం “మనసిచ్చిన మగువ” ఈ నెల 19 వ తేదీన విడుదల చేయబడుతుందని తెలుస్తోంది.

◆ ◆ ◆

రాజరాజేశ్వరి ఫిలింకంపెనీ అధినేత శ్రీ కడారు నాగభూషణంగారు తెలుగులో “ఉషాపరిణయం”, “దక్షయజ్ఞం” చిత్రాలను ఒకేసారి నిర్మించడానికిసన్నాహాలను చేస్తున్నట్లు తెలుస్తోంది.

'పెండ్లికానుక' చిత్రదర్శకుడు శ్రీధర్

ఈ మధ్యనే శ్రీమతి కన్నాంబ, శ్రీ నాగభూషణంగార్లు విజయవాడ సత్యనారాయణపురంలో తాము నిర్మించుకొన్న భవనానికి గృహప్రవేశ ఉత్సవాన్ని జరుపుకొన్నారు.

ఫిలిం నిర్మాతల సమావేశం

కేంద్ర ప్రభుత్వం విధించిన ఎక్సయిజు సుంకాన్నిగురించి చర్చించేందుకుగాను దక్షిణ భారత ఫిలిం ఛాంబర్ భవనంలో ఫిలిం నిర్మాతలు ఈ నెల ఎనిమిదో తేదీ ఆదివారం నాడు సమావేశం కాబోతున్నారు

మరాఠీ చిత్ర వ్యవసాయక సంఘం

నూతనంగా స్థాపించబడిన మరాఠీ చిత్ర వ్యాపారిక సంఘ కార్యాలయాన్ని నిర్మించేందుకుగాను ప్రఖ్యాత మరాఠీ - హిందీతార శ్రీమతి లలితా పవర్ బొంబాయిలోని చెంబురులో ఒకస్థలాన్ని దానంచేసింది ఇందులో ఒక హాలును నిర్మించిపెట్టడానికి కూడా ఆమెఅంగీకరించారు.

హిందీ 'పెండ్లికానుక'లో వైజయంతిమాల

వీనస్ పిక్చర్స్‌వారు హిందీలో నిర్మించుతున్న “పెండ్లికానుక”చిత్రంలో నాయకీ నాయకులుగా బి. సరోజాదేవి, రాజకపూర్‌లు నటించడానికి ఇంతకుముందు నిర్ణయమైంది కాని యిప్పుడు సరోజాదేవి బదులు వైజయంతిమాలను తీసుకొన్నారు.

వీరుగాక హిందీ చిత్రంలో శ్రీ బాలసచిదేవ్, సవితా చటర్జీ, ఆఘా మొదలైనవారు నటిస్తున్నారు.

హిందీ చిత్రానికికూడా శ్రీధర్ దర్శకత్వ బాధ్యతను నిర్వహిస్తారు

ఢిల్లీలో ఫిలిం ఫెడరేషన్ కార్యాలయం

భారత ఫిలిం ఫెడరేషన్ కార్యాలయాన్నొకదానిని ఢిల్లీలో నెలకొల్పడానికి నిర్ణయించారు.

ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ బి నాగిరెడ్డిగారు మద్రాసులో వుంటారు గాబట్టి కొద్దిపాటి సిబ్బంది మద్రాసులో కూడా వుంటుంది.

ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ ఆర్ శ్రీనివాసన్ శాశ్వతంగా కార్యాలయంలోనే వుంటారు.

“ధన్య మరాఠా దేశ్” “జై గుజరాత్”

బొంబాయి ద్విభాషా రాష్ట్రాన్ని విడదీసి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను మే ఒకటవ తేదీన స్థాపించిన సందర్భంలో భారత ప్రభుత్వ ఫిల్మ్స్ డివిజన్‌వారు రెండు డాక్యుమెంటరీ చిత్రాలను తయారుచేసి విడుదలచేశారు.

“ధన్య మరాఠా దేశ్” అనే పేరుతో గేవాకలర్‌లో ఒక రీలు డాక్యుమెంటరీ చిత్రాన్ని శ్రీ కుమార్‌సేన్ సమర్థ దర్శకత్వాన తయారైంది. మహారాష్ట్రకు సంబంధించిన చారిత్రిక, సాంస్కృతిక, పారిశ్రామిక అంశాలనన్నింటినీ డాక్యుమెంటరీలో చిత్రించారు

అలాగే గుజరాత్ రాష్ట్రానికి సంబంధించిన విశేషాలను మరొక డాక్యుమెంటరీ చిత్రించి మే ఒకటవ తేదీన ఆ రాష్ట్రమంతటా విడుదల చేశారు ఈ చిత్రానికి “జై గుజరాత్” అనే పేరుపెట్టారు.

ఈ రెండు చిత్రాల్లోనూ ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను పరిచయం చేస్తారు

అంతర్జాతీయ ఫిలిం ఉత్సవాలు

1961 ఫిబ్రవరి మాసంలో ద్వితీయ అంతర్జాతీయ ఫిలింఉత్సవాలను భారతదేశంలో జరపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన చిత్రాలను ఒకపక్షం రోజులపాటు బొంబాయిలోనూ, ఢిల్లీ, కలకత్తా, మద్రాసుల్లోనూ ఒక్కొక్కవారము ప్రదర్శించబడగలవని తెలుస్తోంది.

ఒలింపిక్‌కు భారత ఫుట్‌బాల్ జట్టు అర్హత

భారత ఫుట్‌బాల్ జట్టుకూ, ఇండొనేసియా జట్టుకూ రెండవసారి జకార్తాలో జరిగిన పోటీల్లో భారతజట్టు 2 గోలుల తేడాతో విజయం సాధించి, ఒలెంపిక్ పోటీల్లో పాల్గొనే అర్హతను సంపాదించినందులకు మన జట్టుకు జేజేలు.

లోగడ కలకత్తాలో భారతజట్టు ఇండోనేసియా జట్టును రెండు గోలుల తేడాతో ఓడించిన విషయం పాఠకులకు విదితమే

జకార్తాలో ఈ రెండు దేశాల జట్లుకు జరిగిన ఆటను 20 వేలమంది ప్రేక్షకులు ఆనందించారు. ఈ సారి ఆటలో విశేషమేమంటే, ఇండోనీషియాజట్టు భారతదేశానికి ఒక గోలు కూడా చేయలేకపోయింది.

ఆట ప్రారంభంనుండీ, ఇండోనీషియా జట్టు 'అఫెన్స్' ఆటనే ప్రదర్శించింది. భారతజట్టు గోల్ కీపరు తంగరాజ్ సామర్థ్యాన్ని ఇండోనేసియా ఫార్వర్డులు మొదటిభాగంలో పరీక్షించారు. ఆ జట్టు భారత దేశానికి నాలుగుసార్లు ప్రమాదం తెచ్చింది. అయినా, భారత జట్టులో డిఫెన్సు ఆటగాండ్ర నైపుణ్యమూ, తెలివీ వలన ఆ ప్రమాదాలు తప్పాయి. సగం ఆట ముగిసేసరికి, ఏ జట్టూ గోలు చేయలేక పోయింది.

భారత జట్టు ప్రతిభ

భారతజట్టులో, ఫార్వర్డయిన బెనర్జి అత్యుత్తమ ఆటను ప్రదర్శించి, కలిమ్మా ఆటగాండ్ర కుత్తేజం కల్గించాడు డిఫెన్స్ ఆడిన జార్నైల్ కూడా అద్భుతంగా ఆడాడు. సరే, భారత గోలుకీపరు అత్యద్భుతమైన చాకచక్యాన్నీ, సామర్థ్యాన్నీ ప్రదర్శించకపోతే యింకేముంది? ఫలితం మరో విధంగా ఉండేదేమో!

గోస్వామి ఒక గోలు చేశాడు. గోస్వామి గోలు చేసినపుడు, బంతి అతని చేతికి తగిలిందనీ ప్రేక్షకులు అరిచారు. కాని రిఫరీ 'హాండు' ఇవ్వలేదు. దానిపై ప్రేక్షకులు రిఫరీని కేకలు వేశారు. అయినా రిఫరీ నిర్ణయం మారలేదు.

సైమన్ సుందరరాజ్ రెండో గోలు చేశాడు అవిధంగా భారతదేశం ఒలెంపిక్ పోటీల్లో పాల్గొనే అర్హతను సంపాదించి పెట్టారు మన ఆటగాండ్రు.

భారత జట్టు ఓటమి

భారత జట్టు, ఇండోనేషియా జట్టుతో మరొక ఎగ్జిబిషను ఆట ఆడింది. భారత జట్టులో ముగ్గురను మార్చడం జరిగింది.

కాని, భారత జట్టు తన పూర్తి ప్రతిభను ప్రదర్శించలేదు. ఇండోనీషియా జట్టు బాగా ఆడింది. మొదట ఇండోనీషియా జట్టు ఒక గోలు చేసింది.

తరువాత రెండవ సగభాగంలో భారత జట్టులో మరికొన్ని మార్పులు జరిగాయి. బలరామన్ ఒక గోలు చేశాడు. ఆ తరువాత, ఆట ముగిసే ముందు ఇండోనీషియా జట్టు మరొక గోలు వేసి, విజయం సాధించింది.

ఒలెంపిక్ పోటీలకు జరిగిన ఆటనెగ్గి ఎంత ఎగ్జిబిషన్ ఆటఅయినా ఆ ఆటలో ఓడిపోవడం భారతీయులకు కొంచెం మనసు చివుక్కుమనక మానదు

ఇండోనీషియానుండి బయలుదేరిన భారత జట్టు సింగపూర్‌లో ఒక ఎగ్జిబిషన్ ఆట ఆడింది. ఆ ఆటలో భారత జట్టు సింగపూర్ జట్టును అతి సునాయాసంగా నాలుగు గోలులతో ఓడించింది.

ఫుట్‌బాల్ ఆట తీరులపై రహీం వ్యాఖ్య

భారత జట్టుకు శిక్షణ యిచ్చిన రహీం (హైదరాబాద్) భారత ఆటగాండ్ర ఆటపై ఈ విధంగా వ్యాఖ్య చేయడం గమనించదగింది.

“భారత ఫుట్‌బాల్ తిన్నయిన ఒక్క అవయవం లేని ఒంటె వంటిది. భారతీయ ఫుట్‌బాల్ ఆటను సరిచేసి, ఒక మంచి పద్ధతిలో పెట్టాల్సిన అవసరం యింకా వుంది ఈ మాటనే నేను పదే పదే చెబుతాను”

అంతర్జాతీయఖ్యాతిని సంపాదించిన భారతీయ ఆటగాండ్రలో చాలా మందిని ఆయన తయారు చేశారు. ఆయన మన ఆటగాండ్రకు యిచ్చు సలహా అత్యంత ముఖ్యమైంది. ఆధునిక ఫుట్‌బాల్ ఆటతీరులో భారతీయులకు శిక్షణ అవసరమని ఆయన నొక్కి చెబుతారు.

ఆటగాండ్రకు సలహా

ఆటను నేర్చుకుంటూ అభివృద్ధిలోనికి వస్తున్న యువకులు రహీం సలహాను నిశితంగా ఆలోచించి, ఆచరణలో పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆకాశంలో బెలూన్‌లా బంతిని గాలిలోకి ఎత్తుగా తన్నడంలో ఫుట్‌బాల్ ఆటతీరుకు పూర్వవిగ్రహం అంటారాయన. సాధ్యమైనంతవరకు బంతిని నేలమీద ఉండునట్లు ఆడే ఆటనే ఆయన నేర్పారు. దూరంగా ఉన్న మనిషికి బంతి అందించవలసినప్పుడు మాత్రమే, ప్రత్యర్థి తలపైగా కిక్కు కొట్టినట్లుగా ఆయన నేర్పారు

సెంటరు ఫార్వర్డు ఉండకుండా, గోలులు చేసేవారెక్కువమంది కావాలంటారాయన. ముగ్గురు ఫార్వర్డులు బంతిని గోలులోనికి కొట్టేవారవసరం అంటారు.

ఒలెంపిక్‌కు రష్యాజట్టు అనర్హత

ఒలెంపిక్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హతను సంపాదించుటకు జరిగిన పోటీలో బల్గేరియా అర్హతను సంపాదించగల్గిందిగాని, సోవియట్ యూనియన్ సంపాదించలేకపోయింది. ఒకసారి ఒలింపిక్ ఛాంపియన్నగా పేరొందిన ఈ సంవత్సరం ఒలింపిక్ పోటీల్లో సోవియట్ జట్టు పాల్గొనదు.

బల్గేరియాకు 5 పాయింట్లు, సోవియట్ యూనియన్‌కు 4 పాయింట్లూ వచ్చాయి. అందువలన సోవియట్ యూనియన్ అర్హతను పోగొట్టుకున్నదన్నమాట.

కొమింటాంగ్ చైనాకూ, కొరియాకూ జరిగిన పోటీలో, మొదటిసారి చైనా ఫుట్‌బాల్ జట్టు నెగ్గింది. రెండవసారి, ఆట జరుగుతూండగా, కొరియాజట్టువారు రిఫరీని కొట్టగాఆట ఆపివేయబడింది. అందువలన బహుశా కొమింటాంగు చైనా, అర్హతను సంపాదించవచ్చు.

ఆసియా మండలంలో టర్కీ, భారతదేశం బహుశా కొమింటాంగు చైనా జట్టులూ, ఆఫ్రికామండలంలో, ఐక్య అరబ్బు రిపబ్లిక్కు, ట్యునీషియా జట్టులూ, అమెరికామండలంలో అర్జెంటైనా, పెరూ, బ్రెజిల్ జట్టులూ ఒలింపిక్ పోటీల్లో పాల్గొనే అర్హత సంపాదించాయి.

ఆంధ్ర పోలీసు జట్టు గెల్పు

మద్రాసులో జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీల్లో, ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టు (హైదరాబాద్), ఇండియన్ ఎయిర్‌ఫోర్సు తాంబరం జట్టును అతిసునాయాసంగా అయిదు గోలులతో ఓడించింది.

ఆంధ్రజట్టు నిజానికెక్కువగోలులు చేయాల్సింది కాని, ఆంధ్ర జట్టు గోలు దగ్గర పాడుచేయబట్టి గోలుల సంఖ్య తగ్గింది. ఆంధ్ర జట్టులో జుల్ఫికర్ ఆట నైపుణ్యతకు మూలం.

కాంట్రాక్టు బ్రిడ్జి

ట్యూరిన్‌లో జరుగుతూన్న కాంట్రాక్టు బ్రిడ్జి ఒలెంపిక్ పోటీల్లో ఫ్రాన్సు ప్రపంచ ఛాంపియన్ షిప్పును సాధించుకుంది. అంతకు ముందువరకూ ఇంగ్లాండుకు ఛాంపియన్ అయ్యే అవకాశాలున్నా, అనుకోకుండా ఫ్రాన్సు ఆ అవకాశాన్ని చేజిక్కించుకుంది.

ఇదివరకు ఛాంపియన్ అయిన ఇటలీకి, రెండవ స్థానంకూడా దక్కకపోవడం ఈ పోటీల్లో సంభవించిన చిత్రం. రెండవస్థానం బ్రిటను సంపాదించింది. మూడవస్థానం అమెరికాకు లభించింది. తతిమ్మాదేశాల స్థానాల వార్తలు ఇంకనూ అందలేదు.

తొలిరౌండుల్లో ఒక అమెరికాజట్టు నోడించిన తరువాత, బాగా వెనకబడి పోయిందనే చెప్పవచ్చు.

చదరంగం

లాట్వియాకు చెందిన తాల్‌కూ, చదరంగం ప్రపంచ ఛాంపియన్ అయినబాట్వినిక్‌కూ మాస్కో పుష్కిన్ థియేటరులో జరుగుతూన్న ఛాంపియన్‌షిప్పు పోటీల్లో తాల్, ప్రపంచ ఛాంపియన్ అయ్యే అవకాశం నూటికి 90 పాళ్ళేర్పడింది.

23 ఏండ్ల యువకుడు తాల్ తన ప్రతిభనుఅద్భుతంగాప్రదర్శిస్తూ, అనుభవజ్ఞుడైన బాట్వినిక్‌ను ఆటలో నానా యాతనలు పెడుతున్నాడు. యిప్పటికి 24 ఆటల్లో 19 ఆటలుముగిశాయి. 19వ ఆటనుఉద్దండుడు తాల్ గెల్చాడు. అదే విధంగా అతడు 17 వ ఆటను గెల్చుకున్నాడు. 18 వ ఆట డ్రా అయింది.

ప్రపంచ ఛాంపియన్ కావడానికి తాల్‌కుమరొకపాయింటు వస్తే చాలు. తాల్‌కు 11.5, బాట్వినిక్‌కు 7.5 పాయింట్లు వచ్చాయి.

అర్నాల్డు ప్రతిభ

మద్రాసు టి. నగరసోషల్ క్లబ్బు నిర్వహించిన చదరంగం పోటీల్లో 40 మంది పాల్గొన్నారు. భారత ఛాంపియన్ అర్నాల్డు యీ పోటీలో విజయం సాధించాడు. అందరూ అనుకున్నట్లుగానే, అతడు నెగ్గాడు.

అర్నాల్డు 1955 సంవత్సరంలో చదరంగం ఆటలో ప్రవేశించాడు. అప్పటినుండి అతని ప్రతిభ నిరాఘాటంగా సాగిపోతోంది. అతడిప్పటికి 20 పోటీల్లో పాల్గొన్నాడు. అతడు ప్రథముడుగా 14 సార్లూ, మూడుసార్లు మరొకరితోపాటు ప్రథమస్థానం, మూడుసార్లు ద్వితీయుడుగానూ, మూడవవానిగా ఒకసారి వచ్చాడు.

హాకీ

బొంబాయిలో జరుగుతున్న గోల్డు కప్పు హాకీ టోర్నమెంటులో, సాదరన్ రైల్వేజట్టు, చివరకు ఎట్లాగయితేనేం సెంట్రల్ ఎక్సయిజు జట్టును ఒక గోలుతో ఓడించింది.

తరువాత లిస్తూనియన్ పంజాబు స్పోర్ట్సు జట్టును రెండవసారి ఆడిన ఆటలో ఒక గోలుతో ఓడించింది. మొదట ఈ జట్టుపై పంజాబు స్పోర్ట్సు జట్టు నెగ్గితే, ఈ జట్టు 'ప్రొటెస్టు' పెట్టింది. ఆ ప్రొటెస్టును చివరకు అనుమతించగా లిస్తూనియాజట్టు తిరిగి పంజాబు జట్టుతో ఆడవలసి వచ్చింది. ఈ జట్టుల ఆట చాల ఉద్వేగపూరితంగానూ, ఆకర్షణీయంగానూ ఉంది.

ఆ తరువాత లిస్తూనియా జట్టు మైసూరు జట్టునోడించి, నాగపూర్ జట్టుతో రెండుసార్లు డ్రా అయింది.

ఈ టోర్నమెంటులో ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఈ టోర్నమెంటులో [illegible] షీల్డు సంపాదించిన పంజాబు పోలీసుజట్టును బర్మాషెల్ జట్టు ఓడించడమే; బర్మాషెల్ జట్టులో టీంవర్కు బాగుంది. డిఫెన్సు ఆటగాండ్రుకూడా తమ కర్తవ్యాన్ని అద్భుతంగా నిర్వహించారు

పంజాబు పోలీసుల్లో ప్రఖ్యాత ఆటగాండ్రు బలబీర్ సింగ్, ఉద్ధంసింగ్ వగైరాలున్నా, వారి ప్రయత్నాలన్నీ విఫలం చేయబడ్డాయి. మొత్తంమీద, పోలీసుజట్టు సరిగా ఆడలేదనే చెప్పాలి. అందుకల్లనే, ఆ జట్టుకు ఓటమి ప్రాప్తించింది.

మద్రాసు జట్టుకూ, ఢిల్లీజట్టుకూ జరిగిన ఆటలో మద్రాసుజట్టు చాలా బాగా ఆడింది. ఆ మద్రాసుజట్టులో ఫార్వర్డులయిన తోళసింగం, కార్, కున్సినాథన్‌లు చాలా బాగాఆడారు.

బొంబాయిలో జరుగుతున్న టామిఎమ్మార్ గోల్డుకప్పు మహిళల హాకీ టోర్నమెంటులో, మద్రాసుజట్టు ([illegible]), లిన్నెట్సును ఓడించింది. మద్రాసుజట్టులో రెబెక్క బాగా ఆడింది. లిన్నెట్సుజట్టు బాగా ఆడలేదు.

బెంగాల్ టైగర్సుకబ్సు జట్టు, పూనా జట్టును ఒక గోలుతో ఓడించింది. ఆ తరువాత బెంగాల్ జట్టు లిస్తూనియా జట్టు నోడించి, ఫైనల్సుకు వచ్చింది. ఈ జట్టు చక్కగా, టీంవర్కును ప్రదర్శిస్తూ బాగా ఆడుతూంది. కాని, గోలులు చేయడంలోనే, సామర్థ్యం తక్కువగా కన్పిస్తోంది.

క్రికెట్టు

పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న భారత క్రికెట్టు జట్టుకూ, పాకిస్థాన్ అధ్యక్షు జట్టుకూ కరాచీలో జరిగిన పోటీ డ్రా అయింది.

ఈపోటీలో మొదటియిన్నింగ్సులో భారత జట్టులో మిల్ఖాసింగ్ 97 పరుగులు చేసి అవుటు కాలేదు. తతిమ్మా వారంతా అవుటయి పోయారు.

పాకిస్థాన్ జట్టులో మహమ్మద్ మునాఫ్, మహమ్మద్ ఫరూక్‌లు బాగా బౌల్ చేసి చెరి నాలుగు వికెట్లను తీసుకున్నారు.

పాకిస్థాన్ జట్టులో మొదటి యిన్నింగ్సులో ఆలిముద్దీన్ వంద పరుగులు చేశాడు.

రెండవ యిన్నింగ్సులో భారతజట్టు ఓడిపోయే పరిస్థితిలో ఉండగా, మరల మిల్ఖాసింగ్ 101 పరుగులుచేసి, ఇంజనీరు 71 పరుగులు చేసి, ఓడిపోకుండా రక్షించారు. మిల్ఖాసింగ్ బాటింగు ప్రతిభ నానాటికి పెంపొందుతోంది

దక్షిణాఫ్రికా ప్రభుత్వము అనుసరిస్తున్న జాతి విచక్షణా విధానానికి నిరసనగా దక్షిణాఫ్రికా క్రికెట్టు జట్టు పర్యటనను బహిష్కరించమన్న ఆందోళన నెమ్మదిగా తగ్గింది.

దక్షిణాఫ్రికా జట్టు మొదటి ఆటలో నెగ్గి, రెండవ ఆటలో వార్విక్ షైరుజట్టుతో ఆడుతోంది దక్షిణాఫ్రికాజట్టులో మెక్లియన్ 217 పరుగులు చేశాడు.

ఇంగ్లాండులో భారతీయుని గెలుపు

లండన్ విశ్వవిద్యాలయమూ, లాబరో కళాశాల, ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయాలకూ జరిగిన ఎథ్లెట్టు పోటీల్లో భారతీయ విద్యార్థి రంజిత్ భాటియా రెండుమైళ్ల పరుగులో ప్రథముడుగా వచ్చాడు. అతని రికార్డు 9 ని, 38 సెకండ్లు ఆఖరిపావుమైలూ 60 2 సెకండ్లలో పరుగెత్తాడు.

శ్రీ కామినేని ఈశ్వరరావు



ఈ మధ్య ఢిల్లీలో జరిగిన జాతీయ ఆటల పోటీలలో 291½ పౌనుల బరువును ప్రెస్ చేసి ఆసియా, భారత రికార్డును స్థాపించారు.

గదర్ పార్టీ చరిత్ర

(5 వ పేజీ తరువాయి)

హింసలు పెట్టేవాడు. మా అందరి చేతులకు సంకెళ్ళు విధించాడు. మేం సింగపూర్ చేరేవరకూ యీ సంకెళ్ళను ఏకబిగిని నాలుగైదు రోజులు వూడదీయనేలేదు. పైగా యిద్దరేసికి కలిపి ఒకే సంకెలి వుండేది. దీనితో పగలూ, రాత్రీ యెప్పుడూ కక్కసు దొడ్డికి వెళ్ళినా లేదా నిద్రపోతున్నా లేదా మేలుకొన్నప్పుడూ యీ జంట విడివడేదికాదు. ఇద్దర్ని కలిపి అధికారులు ఒక మనిషికింద లెక్కేసేవారు. ఈవిధంగా చివరకు ముఖం కడుక్కోడానికికూడా మేం నీళ్ళకు నోచుకోలేదు. ఆవిధంగా వరుసనే 36 గంటల పాటు మాకు అన్నపానీయాలు లేకుండా మాడ్చారు. ఆ తర్వాత పోలీసు ఉద్యోగి ఏవో కొన్ని బిస్కత్తులు తీసుకొచ్చి మా ముఖాన పడేసేవాడు. అదైనా రోజుకో పర్యాయం మాత్రమే. మా ఆరుగురికి – అంటే మూడు జంటలు – 12'×4' లు స్థలం మాత్రం రాత్రిపూట నిద్రపోవడానికి కేటాయించేవారు. మాలో చిన్నవాళ్ళం నేనూ, ఛటర్జీ. మాయిద్దర్నీ పోలీసు అధికారి నిర్దాక్షిణ్యంగా కొట్టేవాడు. ఒకనాటి సాయంత్రం పోలీసు అధికారి ఒక బ్రిటిష్ వనితను వెంటబెట్టుకుని వచ్చాడు. వెంట కెమెరాకూడా తెచ్చుకున్నాడు – మా ఫొటోలు తీసుకోడానికని. ఈలోపు ఛటర్జీ 'కాస్త ఉప్పు సప్లయి చేస్తారా' అని అడిగాడు ధైర్యంచేసి. 'ఉప్పు' అడిగిన పాపానికి ఛటర్జీని అధికారి లెంపకాయ వాయించాడు. దానిపై ఛటర్జీ “ఓరి చవట దద్దమ్మా” అన్నాడు. అధికారి ఎదురేటు – ఒట్టి పిరికిపంద, బ్రూట్ అంటూ ఛటర్జీ తన కసితీరా అనేశాడు. ఈ తిట్లు అధికారిపై కొంతపని చేశాయి. ఆ తర్వాత వాడు మళ్ళీ మా కంటికి అవుపించనేలేదు. ఆనాటి ఘటన జరిగినప్పటినుండి, మాకు కాపలాగా బ్రిటిష్ ఉద్యోగిగాదు; మలయా పోలీసు లుంటున్నారు. వాడు వెళ్ళి వీళ్ళు రావడంవల్ల వచ్చిన పెద్ద మార్పేమీ లేదు. కాకపోతే త్రాగడానికి కాస్త మంచితీర్థం దొరికాయి. వాడికంటే వీళ్లు కాస్త దయగా వున్నారు. సానుభూతి కనబర్చేవారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాది మా పట్ల కనపర్చిన ఈ అమానుష వైఖరి మాలో ఒక గట్టి నిర్ణయాన్ని పాదుకొల్పిందనే చెప్పాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం క్రూరాతి క్రూరమైనదని, నరరూప రాక్షసియని మేం గట్టిగా భావించాం. దాన్ని సమూలంగా నాశనం చేయాలన్న మా ప్రయత్నమూ సరైనదనే నమ్మకమూ కలిగింది.

భారత సైనికదళం: సాయుధ తిరుగుబాటు

మాపట్ల బ్రిటిష్‌వాళ్ళు ఇంతటి ప్రతీకార దీక్షతో అమానుషంగా ప్రవర్తించడానికి ఒక కారణంవుంది. సింగపూర్‌లోని రాజపుట్ ముస్లిం రెజిమెంటొకటి బ్రిటిష్ స్త్రీ, పురుషుల పైన, పిల్లలపైన కొంత అమానుషమైన హత్యాకాండ జరిపింది. ఈ రెజిమెంటులోని కొంత మంది మత గురువాంకారుల మూలంగా అప్పట్లో సింగపూర్‌లోని బ్రిటిష్ కుటుంబాలకు చెందిన 252 మంది సఫా అయిపోయారు. ఈ రెజిమెంటు భారతదేశంలో వున్నప్పుడు యూరప్‌కువేస్తే అక్కడకు పోమని నిరాకరించినట్లుంది. అందుకనే ఇతర రెజిమెంట్లకుకూడా వీరి ప్రభావం ప్రసరించకుండా వుండేందుకని ఈ రెజిమెంటును సింగపూర్‌కు బదిలీచేశారు. యూరప్ వెళ్ళవలసిందిగా తిరిగి బ్రిటిష్ అధికారులు వారిని కోరారు. టర్కీవారితో యుద్ధం కోసమే తమను ఓడెక్కిస్తున్నారు గదా అని వీరిలో కొంతమంది భావించారు. కాబట్టి వీరు రైఫిళ్ళు, ఫిరంగులతోనూ బయటికి వెళ్ళిపోయి సింగపూర్‌లో నివసిస్తున్న బ్రిటిష్ జాతికి చెందిన స్త్రీ పురుషుల్ని, వారి పిల్లల్ని చంపిపారేశారు. ఈ విధంగా సింగపూర్‌ను పట్టుకున్నారు. గాని, నాలుగు రోజులు మాత్రమే దానికి ఏలికలుగావున్నారు. తిరిగి రాజపుట్ ముస్లిం రెజిమెంటు అధికారంనుండి ఒక జపాన్ యుద్ధనౌక సింగపూర్‌ను స్వాధీనం చేసుకుని, తన సామ్రాజ్యవాద మిత్రదేశమైన బ్రిటన్‌కు అప్పగించింది. ఈ లోగా కాల్పుల్లో ప్రత్యక్షపాత్ర వహించిన తిరుగుబాటుదార్లు మాత్రం పొరుగు దేశాలకు తప్పించుకు పారిపోయారు. ఈ కాల్పుల్లో, హత్యాకాండలో పాల్గొననివారూ, తటస్థులుగా వున్న రాజపుట్ ముస్లిములంతా అరెస్టు చేయబడ్డారు. కోర్టు – మార్షల్ జరిపారు. కాల్చిచంపబడ్డారు. లేదా యావజ్జీవశిక్ష వేసి ప్రవాసం పంపించబడ్డారు.

ష్రాప్ షైర్ రెజిమెంట్

ఈ సమాచారం అంతా యెంతవరకు నిజమో నేను ఖచ్చితంగా చెప్పలేను. సింగపూర్ మిలిటరీ డిటెన్షన్ బ్యారెక్కులలో మమ్మల్ని నిర్బంధించి ఆరు నెలలపాటు వంటరిగా నానా హింసలూ పెట్టి అమానుష చర్యలకు గురిచేసినందున, అసలు మాపట్ల బ్రిటిష్ అధికారులిలా ప్రవర్తించడానికి కారణ మేమా నాఅని తెలుసుకోఅదుర్దాగావుంది మాకు. సింగపూర్‌లో ష్రాప్ షైర్ రెజిమెంటుకు చెందిన సైనికులున్నారు. వారు మమ్మల్ని కలకత్తాకు తీసుకువెళ్ళుతుండగా వాళ్ళ ధోరణిని బట్టిచూస్తే నేను పైనచెప్పిన విషయాలన్నీ సరైనవేనని తేలిపోయింది. అప్పుడీ గాథంతా నిజమే ననుకున్నాం. అప్పటికూడా, ఈ రాజపుట్ ముస్లిం రెజిమెంటు పైన గదర్ పార్టీ ప్రచార ప్రభావం ఎంతవరకుందో అన్న విషయమై నాకు బోధపడిందికాదు.

సరే నా నివేదిక పారాన్ని పూర్తి చేయాలిగామరి – ఎక్కడ విడిచామో, అక్కడినుండి ప్రారంభిద్దాం:

మేం ఆరుగురు ఖైదీలం. మమ్ములనందర్నీ సింగపూర్‌లోని బ్రిటిష్ మిలిటరీ డిపార్టుమెంటుకు (1915 లో) అప్పగించారు. మమ్మల్ని తీసికెళ్ళి డిటెన్షన్ బ్యారెక్కుల్లో పడేశారు, గదికొక్క ఖైదీ చొప్పున. ఈ గదికి ఒక కొయ్య తలుపుండేది. అదెప్పుడూ మూసేవుండేది. ఇలా ఆరు నెల్లు గడిపాం. బయట ప్రపంచంతో బంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈ చీకటి గదుల్లోనే మమ్మల్ని అట్టిపెట్టేసి బయట తాళాలేసేస్తుండేవారు. అయితే రోజుకు రెండుసార్లు, ఉదయంపూట కొద్ది నిమిషాలు దొడ్డికి వెళ్ళడానికి, సాయంత్రంపూట జైలు కాంపౌండులోనే కొద్ది నిమిషాలపాటు కాస్త నడక సాగడానికి మాత్రం తాళాలు తీసేవారు. అంతే. మాలో మేం ఎవరితోనూ మాట్లాడ కూడదు. సమాచారం అందించుకోకూడదని ఆంక్ష పెట్టారు. మాకు త్రాగడానికి మాత్రం రోజూ కావల్సినంత నీళ్ళు సప్లయి చేసేవారు. టూత్ బ్రష్ ఉపయోగించకూడదన్నారు. పళ్ళు తోముకోడానికి ఒక టాయిలెట్ కాగితం మాత్రం సప్లయి చేసేవారు. స్నానం చేయడానికంటూ వారానికో బకెట్ నీళ్ళు యిచ్చేవారు. గదిబయట అన్నపుచిప్ప పెట్టినప్పుడుమాత్రందానిని మేం అందుకునేందుకని రోజూ మూడుసార్లు – అదైనా ఒక్కనిముషం పాటు – తలుపు తీసుంచేవారు. ఒకరి కొకరిమధ్య ఉత్తరప్రత్యుత్తరాలు నడవరాదు.

(సశేషం)

విజయవాడ పారిశ్రామికవాడ

విజయవాడ – బందరు రోడ్డులో పోరంకి–పటమట మధ్య ప్రభుత్వం నెలకొల్పిన పారిశ్రామికవాడ ఉంది.

లఘు పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడంకోసం ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వం ఆంధ్రలో 7 చోట్ల ఇటువంటి పారిశ్రామిక వాడలను స్థాపించుతూంది. అవి సనత్‌నగర్, వరంగల్, సామర్లకోట, నంద్యాల, విజయవాడ, విశాఖపట్నం, కడప పట్టణాలు.

ఈ పారిశ్రామిక వాడలలో లఘు పరిశ్రమలు నెలకొల్పదలచిన వారికి ఫ్యాక్టరీ భవనాలు నిర్మించి అద్దెకు యిస్తారు. విద్యుచ్ఛక్తి, నీరు సరఫరా చేస్తారు. సాంకేతిక సహాయం, పరిశ్రమల సమాచారం, సాంకేతిక శిక్షణ, ఆర్థిక పెట్టుబడి, మార్కెటింగ్ సౌకర్యాలు, ముడిసరుకులు యిస్తారు.

విజయవాడ పారిశ్రామిక వాడకు ప్రభుత్వం 53 ఎకరాల స్థలం సేకరించింది. మొత్తం 27 లక్షల 29 వేలు ద్వితీయ ప్రణాళిక కాలంలో కేటాయించారు. 1957–58 లో 6 లక్షలు, 1958–59 లో 6 లక్షల 28 వేలు, 1959–60 లో 9 లక్షలు ఖర్చుచేసి 18 ఫ్యాక్టరీ భవనాలు నిర్మించారు.

ఇందులో ఎ బి సి డి తరగతులుగా ఫ్యాక్టరీభవనాలున్నాయి. ఎ తరగతి ఫ్యాక్టరీభవనాలకు నెలకు రు 748, బి తరగతికి రు 380, సి. తరగతికి రు 256, డి తరగతికి రు 161 అద్దె చెల్లించాలి.

ఎ తరగతి ఫ్యాక్టరీ భవనంలో కాస్టిల్ వర్క్సువారు ఇనుము, ఉక్కు రోలింగ్ మిల్లు నెలకొల్పుతున్నారు. ఇంకా కొన్ని యంత్రాలు రావలసి ఉండటంవలన ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ఎ తరగతి మరొక ఫ్యాక్టరీభవనం ఖాళీగానే ఉంది. ఇంకా ఎవరూ కోరలేదు.

బి తరగతి ఫ్యాక్టరీ భవనాల్లో ఒకదానిలో 'స్క్రూ'మెన్స్ కంపెనీవారు తీగమేకులు, స్క్రూమేకులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ప్రారంభమై దాదాపు రెండునెలలు కావస్తుంది. మరో బి తరగతి ఫ్యాక్టరీ భవనంలో ప్రభుత్వం లఘుపరిశ్రమల సేవాసంస్థను నడుపుతున్నారు ఇక్కడ పారిశ్రామిక దారులకు సాంకేతిక సలహాలు యిస్తున్నారు. ఇంజనీరింగ్ పనులు కూడా చేసి పెడుతున్నారు.

బి తరగతికి చెందిన మరో భవనంలో జి. కె. ఇండస్ట్రీస్‌వారు సిమెంటు పరిశ్రమకు కావలసిన ఉక్కు గుళ్ళ ఉత్పత్తి ప్రారంభించారు. ఈ తరగతికి చెందిన మరో భవనానికి నేషనల్ ఫుడ్ ఇండస్ట్రీస్‌వారు యంత్రసహాయంతో కిరసామగ్రి తయారుచేయడానికి తీసుకున్నారు.

ఇక సి తరగతి ఫ్యాక్టరీ భవనాలలో ప్రిమియర్ మెటల్ వర్క్సు విద్యుచ్ఛక్తి తీగలకు కావలసిన రాగి తీగను తయారు చేయడానికి యంత్రాలను నెలకొల్పుతున్నారు (2) ది జి కె ఇండస్ట్రీస్ వారుమరో ఫ్యాక్టరీలో బ్రైట్ బోల్టులు, నట్‌లు తయారు చేయడానికి యంత్రాలు నెలకొల్పుతున్నారు. (3) రామకృష్ణ ఎనామిల్స్ అండ్ సిరమిక్స్‌వారు పింగాణి ఎనామిల్ సామగ్రిని తయారు చేయడానికి సాధన సామగ్రిని నెలకొల్పుతున్నారు. (4) వెంకటేశ్వర స్టెయిన్‌లెస్ స్టీల్ కంపెనీవారు స్టెయిన్‌లెస్ స్టీల్ సామగ్రి తయారు చేయడానికి యంత్రాలు నెలకొల్పుతున్నారు.

డి తరగతి ఫ్యాక్టరీభవనాల్లో (1) ఎమ్. ఎస్. రత్నం అండ్ కంపెనీ అద్దాలు, అలంకరణ వస్తువులు ఉత్పత్తి ప్రారంభించారు. (2) గౌరీ శంకర్ ఇండస్ట్రీస్ వారు సైకిలు కారియర్‌లు 1959 డిసెంబరులో ఉత్పత్తి ప్రారంభించారు. (3) మరో భవనంలో బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి కంపెనీవారు ఇత్తడి, రాగి రేకులు ఉత్పత్తి ప్రారంభించారు. (4) శంకర కంపెనీవారు జెమ్ క్లిప్‌లు, గుండు సూదులు ఉత్పత్తి కేంద్రాన్ని (5) కాసార్ ఇండస్ట్రీస్‌వారు బకెట్‌లు, రివెట్లు, వాషర్లు ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పడానికి భవనాలను తీసుకున్నారు. (6) ఇండియన్ గ్రాఫైట్ క్రూసిబుల్స్ కంపెనీవారు మూసలు తయారు చేస్తున్నారు.

ఇవిగాక, మరో 4 సి తరగతి ఫ్యాక్టరీ భవనాలు ఇప్పుడు నిర్మిస్తున్నారు.

ప్రభుత్వ పరిశ్రమలు

ప్రైవేటు పారిశ్రామిక దారులే కాక పారిశ్రామికవాడ [illegible] ప్రభుత్వమే స్వయంగా (1) సైకిల్ విడిభాగాల ఫ్యాక్టరీ (2) పోత సామాగ్రి ఫ్యాక్టరీ (3) తోళ్ళ పరిశ్రమలను స్థాపించి నడుపుతున్నారు.

ఈ మూడు పారిశ్రామిక కేంద్రాలలో ఉత్పత్తిప్రారంభమైంది. ఇక్కడ సాంకేతిక శిక్షణకూడా యిస్తున్నారు

పారిశ్రామిక వాడలోని ఫ్యాక్టరీలలో ప్రస్తుతం, తయారవుతున్న తీగమేకులు స్క్రూమేకులు రాగి, ఇత్తడి రేకులు, సైకిలు విడిభాగాలు (కేరియర్లు స్టేండ్లు, ఎక్సిల్ రాడ్‌లు, హబ్ ఎక్సిల్స్, కప్స్) సిమెంటు గ్రైండింగ్ మీడియా (ఉక్కుగుళ్ళు) అద్దాలు, అలంకరణ సామాగ్రి మార్కెట్‌లో విడుదల అవుతున్నాయి. కొద్ది నెల్లలో ఎనామిల్ పింగాణి సామాగ్రి, విద్యుచ్ఛక్తి తీగలకు కావలసిన రాగితీగ, మూసలు, బకెట్లు, రివిట్లు, వాషర్లు ఉత్పత్తి ప్రారంభం కావచ్చు.

పారిశ్రామికవాడలో భూగర్భ మురుగునీటి పారుదల సౌకర్యం, రోడ్లు, ప్రతిఫ్యాక్టరీకి సెప్టిక్ టాంక్ మురుగుగొడ్లు ఉన్నాయి. కాంటీన్ కోసం, ప్రథమచికిత్సా కేంద్రంకోసం భవనం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రథమ చికిత్సాకేంద్రం మరొక భవనంలో పనిచేస్తున్న పోస్టాఫీసు ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. బ్యాంకింగ్ సౌకర్యంకోసం స్టేట్ బ్యాంకు బ్రాంచి నెలకొల్పవలసిందిగా కోరారు. రైల్వే ఔట్ ఏజెన్సీ స్థాపించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు ఇంతవరకు గృహవసతి లేదు. 1961 లో లేబర్ కాలనీ నిర్మించాలని ప్రతిపాదన ఉంది. ముడి సరుకులు నిల్వజేయడానికి గోదాము కూడా నిర్మించ నున్నారు

పరిశ్రమల పరిస్థితులు

ఇంతవరకు ఇక్కడ గౌరీశంకర్ కంపెనీవారు, ప్రభుత్వ పారిశ్రామిక కేంద్రంవారు సైకిలు విడిభాగాలు ఉత్పత్తి చేస్తున్నారు ఈ రెండు ఫ్యాక్టరీలలో ప్రధానంగా కారియర్లు, స్టాండులు ఎక్కువగా తయారు అవుతున్నాయి ప్రభుత్వ ఫ్యాక్టరీలో ఎక్సిల్స్, కప్స్‌కూడా తయారవుతున్నాయి. కాని, ఈ ఫ్యాక్టరీలో యంత్రాలు తగినన్ని లేవు. యంత్ర సౌలభ్యం వినియోగించి తయారు చేయవలసినచోట చేతితో చేస్తున్నారు. ఉదాహరణకు, కారియర్‌కు కావలసిన మందమైన రేకును తగిన సైజులో తెగగొట్టడానికి విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రం లేదు ఇందువలన ఉత్పత్తి మందకొడిగా సాగుతూంది.

పారిశ్రామిక వాడలోని ఫ్యాక్టరీ భవనాలలో పరిశ్రమలను స్థాపించదలచుకొన్నవారు తమ అవసరాలను కనీసం 2 నెలలు ముందుగా తెలియజేస్తేతప్ప ఇనుము, ఉక్కు, రాగి తదితర ముడిసామగ్రి సరఫరా చేయడం సాధ్యం కాదని పారిశ్రామికవాడ అధికారులు తెలియజేస్తున్నారు ప్రభుత్వ యంత్రాంగంలో పైనుండి క్రిందివరకు అన్ని స్థాయిల్లో వ్యాపించి ఉన్న విపరీత జాప్యం, అలసత్వం, వీటికన్న ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు ఈ ముడి సామగ్రుల సరఫరా విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వివక్ష ఈ దుస్థితికి కారణం. అందుచేత పారిశ్రామిక యజమానులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఆంధ్రప్రదేశ్‌కు తగిన కోటాలు సాధించుకోనిదే ఈ పరిస్థితి చక్కబడదు

ప్రభుత్వ శాఖలమధ్య సమన్వయ లోపం

వివిధ ప్రభుత్వ శాఖలమధ్య సమన్వయం లేకపోవడం కూడా పనులు శీఘ్రంగా జరగడానికి ఆటంకంగా ఉంది. పరిశ్రమలు నెలకొల్పడానికి తగిన హంగులు ఏర్పాటుచేయవలసింది ప్రభుత్వ పరిశ్రమలశాఖ. భవననిర్మాణము, విద్యుచ్ఛక్తి వైరింగు మొదలైనవి చూసేది పి డబ్ల్యు. శాఖ ప్రభుత్వ భవనాలకు ఎలక్ట్రిక్ వైరింగు చేయించాలంటే ఎక్కడెక్కడి టెండర్లు పిలిచి చేయించడానికి వీలుపడదు. స్వల్ప మార్పులకోసం కూడా ఒక శాఖనుండి మరొక శాఖకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరగడానికి నెలలు గడచిపోతుంటాయి పారిశ్రామిక వాడలోని ఫ్యాక్టరీలకు విద్యుచ్ఛక్తిసరఫరా ప్రారంభించడానికి ఆ శాఖ ఉద్యోగులువస్తే విద్యుచ్ఛక్తి వైరింగుపూర్తికాక లేదాపొరపాటుగా చేయడంవలన ఆ ఉద్యోగులు పని పూర్తికాకుండా తిరిగి పోవలసి వస్తుంది. అందుచేత యిటువంటి రెడ్ టేపిజాన్ని అరికట్టడం అవసరం.

మరో ముఖ్యమైన విషయం: పరిశ్రమలు నెలకొల్పకోదలచిన వారి అవసరాల ననుసరించి ఫ్యాక్టరీ భవనాల నిర్మాణం ఉండటం అవసరం వివిధ పరిశ్రమలకు వివిధపద్ధతుల్లో భవనాలు నిర్మించడం అవసరం కావచ్చు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పారిశ్రామిక వాడ పథకాన్ని తయారు చేసినపుడు ఎక్కువ ఖరీదుతో భవనాల నిర్మాణాన్ని తలపెట్టినట్లు కన్పిస్తుంది ఎక్కువ ఖరీదుతో కడితే ఎక్కువ అద్దె తీసుకోవలసి ఉంటుంది. పరిశ్రమలు ప్రారంభించడానికి వచ్చిన వారికి ఇది భారంగా తోచవచ్చు ఇతర రాష్ట్రాలలో పరిశ్రమల యజమానులకు ఇక్కడ పారిశ్రామిక వాడలలో అద్దెలు ఎక్కువ అనిపించినప్పటికీ ఆంధ్రలో చిన్న పారిశ్రామికయజమానులు సాహసించి ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్న స్థితిలో అద్దెలు కొంత ఎక్కువ అయినట్లు భావిస్తున్నారు. అందుచేత భవనాల నిర్మాణానికి ఎక్కువ డబ్బు వ్యయం కాకుండాఉండేట్లుచౌకగాను ఎక్కువ ప్రయోజనకరంగాను ఉండేటట్లు చూడాలి. ఎవరు పరిశ్రమలు నెలకొల్పకోదలచుకున్నారో వారికే అద్దెకొనుగోలు పద్ధతిని భవనాలను నిర్మించి యివ్వడంమంచిది. పారిశ్రామిక ఎస్టేట్‌ను ఆనుకొని ఉన్న స్థలాల్లో ఎవరైనా ప్రైవేటు యజమాన్యాన పరిశ్రమలు నెలకొల్పకోదల్స్తే అటువంటివారికి స్థలాలను కూడా కేటాయించాలి స్థలాలధరలు పెరిగిపోకుండా తగు దృష్టి తీసుకోవాలి.

ముడిసామాగ్రి కొనుక్కోవడానికి చిన్న పరిశ్రమదారులవద్ద ఎక్కువ డబ్బు ఉండకపోవచ్చు. అందుచేత సహకారసంఘాలద్వారా ఈ ముడి సామాగ్రిని తెప్పించుకోడానికి, నిల్వజేసుకోడానికి పారిశ్రామిక వాడలలో తప్పనిసరిగా గోదాములను నిర్మించి ఇవ్వడం అవసరం.

ఏమైనప్పటికీ పారిశ్రామిక వాడల స్థాపనవలనలఘుపరిశ్రమలకు ప్రోత్సాహం కల్గుతుందనడంలో ఎట్టి సందేహంలేదు ఆంధ్రలో పారిశ్రామిక సంస్థలను నడుపుకొనేసంప్రదాయం, పరిజ్ఞానం, అనుభవం, ఆర్థికస్తోమత తక్కువ అందుచేత ప్రభుత్వం చిన్న పరిశ్రమల దారులకు సహకార సంఘాలపెట్టి తద్వారా పై సహాయాలన్నింటినీ కల్గించడం, ఆ విధంగా ఈ పారిశ్రామిక వాడను పూర్తిగా వినియోగించుకొనేటట్లుచూడటం అవసరం.

6–5–60 — పరకాల

స్వీకారం

“మెరుపు”

(సచిత్ర పక్ష పత్రిక)

సంపాదకుడు: శ్రీకృష్ణ, సంయుక్త సంపాదకురాలు: శ్రీమతి కుసుమశ్రీ

విడిప్రతి: 15 నయాపైసలు, సాలు చందా: 3 రూపాయలు 60 నయాపైసలు.

అడ్రసు: 10 సి. యస్. రండో వీధి, మైలాపూర్, మద్రాసు - 4.

'రంగులబొమ్మ' (పిల్లల కథల సంపుటి). రచన: రాజేంద్ర. ప్రచురణ: సర్వోదయ పబ్లికేషన్సు ప్రొద్దుటూరు. వెల. 75 న. పై.

* * *

'సంపూర్ణరామాయణం' (బుర్రకథ) రచన: శ్రీ అన్నీరు, మిట్టగూడెం. వెల: 50 న. పై.

* * *

'అభ్యుదయము' (నాటకము) రచన: శ్రీకొలచల సూర్యనారాయణ, ఆగిరిపల్లి.

* * *

'అమరత్యాగి' (చారిత్రాత్మక నాటిక) రచన: శ్రీ మండ్యాల శ్రీనివాసులు. ప్రచురణ: నవశక్తి పబ్లికేషన్సు, ప్రొద్దుటూరు.
వెల 80 న. పై.

* * *

'సీతాకళ్యాణం' (సాంఘికం) రచన: కందుకూరి కోటేశ్వరరావు.
వెల 50 న. పై. నెల్లూరు.

* * *

'కోటి వెలుగులు' (నవల) రచన: శ్రీ కొండపల్లి వెంకట శేషగిరిరావు: ఉషశ్రీ ప్రచురణ అనంతగిరి. (నల్లగొండ జిల్లా) వెల రు 1–0–0.

* * *

'సతీశీలి' రచన: శ్రీ మంగళంపల్లి సూర్యనారాయణ, భీమవరంశాకశాల భీమవరం వెల 75 న పైసలు.

◆ ◆ ◆

'శ్రీ జేకిరాజు పెద బాపయ్య జీవన స్మృతి', రచన: శ్రీ కామరాజు హనుమంతరావు ప్రాక్పతీచీ గ్రంథ మాల రాజమండ్రి.

పారిశ్రామిక, వ్యాపార ప్రదర్శన

సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ వారిచే

విశాఖ పట్నంలో

విశాఖపట్నం, మే 8

విశాఖపట్నంలోని మున్సిపల్ స్టేడియంలో మే నెల అంతా సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ వారు నిర్వహింపదలచిన పారిశ్రామిక, వ్యాపార ప్రదర్శనను నేటుదయం 'పద్మభూషణ్' డాక్టర్ సర్ విజయ (ఎంపి) ప్రారంభోత్సవం జరిపారు. (వి.వి.)

ఆనందానికీ, విజ్ఞానానికీ సాహిత్యం సాటిలేని ఔషధం

తెలుగు రచయితల మహాసభలో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణ ప్రసంగం

(విశాలాంధ్ర విలేఖరి)

హైదరాబాద్, మే 6

ఇక్కడ జరుగుతున్న అఖిల భారత తెలుగు రచయితల మహాసభకు నేడు కేరళ గవర్నరు శ్రీ బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షత వహించారు.

ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సభను ప్రారంభించారు (వారి ప్రారంభోపన్యాసంలోని కొన్ని భాగాలను నిన్ననే యిచ్చాం. మరికొన్ని భాగాలు నేడిస్తున్నాం-సం)

శ్రీ రాధాకృష్ణ ఇలా అన్నారు: "పండితుడైనవాడికి మాత్రమే ఇతర పండితుల కష్టాలేమిటో తెలుస్తాయి. అటువంటి పండితులంతా తమ నెదుర్కొంటున్న కష్టాలను గూర్చి, తెలుగుభాషకై సాహితీ కళాకారులకున్న అవకాశాల్ని గూర్చి చర్చించుకోవడానికి ఇక్కడ సమావేశమైనారు. రచయిత కావడానికి మానవుడి మంచిలో విశ్వాసం వుండాలి. మన నెదుర్కొన్న కష్టాలెలాంటివైనప్పటికీ, సాహిత్యం మనకు ఊరడింపు కలిగిస్తున్నది. ప్రజల ఆరోగ్యానికీ, ఆనందానికీ, విజ్ఞానానికీ సాహిత్యం సాటిలేని మేటి ఔషధం."

శ్రీ రాధాకృష్ణ ఢిల్లీలోని అఖిల భారత సాహిత్య అకాడమీవారు ప్రచురించిన తెలుగు కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సంపుటిని శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు సంకలనం చేశారు. ఇందులో నన్నయ్యనుండి ఆధునిక కవులు శ్రీ దేవులపల్లి, శ్రీశ్రీ, ఆరుద్ర రచనలవరకూ వున్నాయి.

సంస్కృత భాష

శ్రీ రాధాకృష్ణ యింకా యిలా అన్నారు: సంస్కృత భాష ఆంధ్ర భాషకు యొనర్చిన సేవను గూర్చికూడా చర్చించాలని ఇక్కడ సమావేశమవుతున్న తెలుగు రచయితలు సంకల్పించారు. ఒక్క ఆంధ్రదేశంలోనే కాదు, యావద్భారతంలోనే సంస్కృతభాష తదితర భారతీయ భాషలన్నింటికి మూలకందంగా వుంది." భగవద్గీత, భారత రామాయణాలకు అనువాదాలున్నాయి. ఇవి మక్కికి మక్కీ అనుసరించినవి గాదు. పాదుక జపసంకీర్తనలూ కావు. ఆ అనువాదాలలో ఒక విశిష్టమైన సారస్వతసృష్టి అవుపిస్తుంది. ఈ కావ్యాలను అనువదించిన కవులు వాటిని మహాకావ్యాల స్థానానికి గొనిపోయారు. ఇవి నిజంగా ఒక్క తెలుగు సాహిత్యానికే అలంకారాలుగావు, భారతీయ సాహిత్యానికే దివ్యభూషణాలు. ఈ కావ్యాల అనువాదకులు కూడా ఆనాటి పరిస్థితుల్లో తమ నెదుర్కొన్న సవాళ్ళను తట్టుకుని తమ అభిప్రాయాలను అభివ్యక్తీకరించడానికి ప్రయత్నించిన వారే.

"ఈ అనువాదకులు ఏ పేరున పిలిచినా దేవుడొక్కడే అన్నారు మానవాతీతమైన శక్తి ఏదో ఒకటున్నదన్న విషయాన్ని మనమంతా అంగీకరిస్తాం. ఏకేశ్వరోపాసనను ఎంత అంగీకరిస్తామో, ఆ శక్తిని కల్పించే వివిధ రీతులనూ కొలిచే పద్ధతులంటేనూ మనం ఈసడించుకోము. సహన సంస్కారం కనపరుస్తాం.

"ఆ రోజుల్లో రచయితలు గూఢమైన భావార్థాలకే ఎక్కువ ప్రాధాన్యత నివ్వలేదు. భావగంభీరతకే వారెక్కువ ప్రాధాన్యత నిచ్చారు. మహా మహా విషయాలను, బహు తేలిక భాషలో సహితం వెల్లడించవచ్చునని వారు భావించారు. ఈ సందర్భంలో "భావగంభీరతకు విప్రనారాయణ చరిత ఉదహరింపవచ్చు."

"కాని మనం ఈనాడు మాటల గారడీలో మునిగిపోయాం. ఆడంబరత ఎక్కువైపోయింది. మనకున్న గొప్ప జ్ఞానాన్ని గూఢార్థంలో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాం. ఇది మంచిది కాదు. భావ గంభీరతను సాధించడానికది అడ్డు.

"భారత ప్రజలు అనాదినుండి ప్రజాతంత్ర భావాలు గలవారే. ప్రతి ఒక్కరూ పరబ్రహ్మ యేనని భావించారు. వైదికంగానే దేవి యీ భూమండలమై వెలసిందని విశ్వసిస్తున్నాం. ప్రత్యణువులోనూ ఈ దివ్యశక్తివుంది. అలాగే ప్రపంచంలో వస్తున్న ప్రతి అభ్యుదయకర మార్పునూ మనం అంగీకరిస్తున్నాం.

"నిశ్చలమైనదేదీలేదు. ఈ ప్రపంచం నిత్యప్రవాహినియైన సంసారసాగరం. అలాగే చివరకు ఉత్తమ సిద్ధాంతాలనుకున్నవికూడా శాశ్వతం కావు. అవికూడా కాలానుగుణ్యంగా మారుతూండాలి. ఆధునిక పరిస్థితుల కనుగుణంగా నిత్య నూతనత్వం పొందుతూండాలి. నేను కోరేదిదే" అని శ్రీ రాధాకృష్ణ అన్నారు.

మహాసభకు 500 మంది సాహితీ వేత్తలు ప్రతినిధులుగా హాజరైనారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులైన శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గ్రంథచిత్ర ప్రదర్శనను ప్రారంభోత్సవం చేశారు.

సారస్వత విధులు

ఈ సందర్భంలో శ్రీ గోపాలరెడ్డి ప్రసంగిస్తూ యిలా అన్నారు: "నిష్ఫలమైన జీవితాలను పుష్పింపజేసి, ప్రపంచాన్ని ఆనందడోలికలలో ఓలలాడింపజేయడం సారస్వత లక్ష్యంగా వుంది. అంతేగాదు; నైతిక ప్రమాణాలను సృష్టించి, రసజ్ఞతను కలుగజేసే సందోహం తన శక్తిగా సాహిత్యం ఎంచుకున్నది.

"భారతీయ సాహిత్యం మేధస్సును వికసింపజేసి, హృదయాలను తన మాధురీ జలోదారలతో తృప్తింపచేసి, మానవుల మంచిలో విశ్వాసాన్ని పాదుకొల్పింది" అని శ్రీ గోపాలరెడ్డి అన్నారు.

అంతకుముందు సభాధ్యక్షులు శ్రీ బూర్గుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంజీవయ్య ఏ యంత తక్కువ సాహితీ పరులు కారని శ్లాఘించారు.

ఆయన యింకా యిలా అన్నారు "సంప్రదాయంగా వస్తున్న రీతులనే ఉపలక్ష్యంగా ఎంచుకొన్న రచయితలకు, నూతనమార్గం త్రొక్కిన కవికీ వైషమ్య స్పర్థ వుండాల్సిన అవసరం లేదు. సాహిత్యం మారుపూవులూ ఆకుకాయలూ కాసి సర్వాంగ సుందరంగా భాసించడానికి రెండు మార్గాలూ అవసరమే.

"తెలుగులో బాలసాహిత్యం అభివృద్ధి చెందాల్సిన అవసరమెంతో వుంది.

"రచించిన గ్రంథాలు అచ్చుకాక యిబ్బందులు పడుతున్న రచయితల రచనలను ప్రచురించడానికి సహకార ప్రాతిపదికపై గ్రంథ ప్రచురణ సంస్థ నెలకొనడం హర్షించదగ్గవిషయం. కేరళ రచయితల సహకార ప్రచురణ సంస్థ రెండు సంవత్సరాలలో దాదాపు వెయ్యిపుస్తకాలు అచ్చువేసిందన్న విషయాన్ని గమనిస్తే సహకార ప్రచురణ సంస్థ ప్రాధాన్యత గోచరిస్తుంది."

తర్వాత అఖిలభారత సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ కృష్ణ కృపలానీ మాట్లాడుతూ, భారతీయ భాషల మధ్య అడ్డుగోడలను తొలగించి, వివిధ భాషల మధ్య సాన్నిహిత్యాన్ని సాధించడమే అకాడమీ లక్ష్యమన్నారు.

మహాసభ జయప్రదం కావాలంటూ శ్రీయుతులు హుమయూన్ కబీర్, సి. డి. దేశ్‌ముఖ్, వి. వి. గిరి, ముల్క్‌రాజ్ ఆనంద్, శ్రీమతి సోఫియా వాడియాలు పంపిన సందేశాలను శ్రీ దేవులపల్లి రామానుజరావు చదివారు.

మహాసభవారు ఆంధ్రలోని ప్రముఖ కవులు, పండితులను సంప్రదాయ పద్ధతిలో ధూపదీపచందన, తాంబూల కుంకుమ, ఫలపుష్పాదులతో, కాశ్మీరు పట్టుశాలువలతో ఘనంగా సన్మానించారు.

సన్మానింపబడ్డవారిలో శ్రీయుతులు శివశంకరస్వామి, రాయప్రోలు సుబ్బారావు, నాయని సుబ్బారావు, గడియారం వెంకటశేషశాస్త్రి, గుర్రం జాషువా; మాదిరాజు వీరభద్రరావు, తాపీ ధర్మారావు, శ్రీ శ్రీ గార్లు ఉన్నారు.

రాజభాషపై రాష్ట్రపతి ఆదేశాలు

అమలుజరపడానికి సన్నాహాలు

న్యూఢిల్లీ, మే 6

రాజభాషపై రాష్ట్రపతి విద్యా న్యాయ మంత్రిత్వ శాఖలకిచ్చిన ఆదేశాలను అమలుజరిపేందుకు తీసుకోవలసిన చర్యలను గూర్చి నేడు హోం మంత్రి శ్రీ పంత్ ఆ శాఖల ప్రతినిధులతో చర్చించారు.

హిందీలో శాస్త్రీయ సాంకేతిక పారిభాషిక పదజాలాన్ని రూపొందించేందుకు ఒక స్థాయీ సంఘాన్ని నియమించవలసిందిగా రాష్ట్రపతి విద్యాశాఖను ఆదేశించారు. అదేవిధంగా, న్యాయశాస్త్ర పారిభాషిక పదాలను తయారుచేయడానికీ శాసనాలను అనువదించడానికీ న్యాయశాస్త్ర నిపుణులతో మరొక స్థాయీ సంఘాన్ని నియమించవలసినదిగా న్యాయశాఖను ఆదేశించారు.

శ్రీ పంత్ కాక విద్యామంత్రి డా॥ కె. యల్. శ్రీమాలి న్యాయ శాఖ ఉపమంత్రి శ్రీ ఆర్. యం. హాజర్నవీస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇలాంటి సమావేశాలు ఇకముందు వరుసగా జరుగుతుంటాయి. ప్రస్తుత సమావేశంలో ప్రాథమిక విషయాలు మాత్రం చర్చించారు.

రక్షణ హోంశాఖలకు ఇచ్చిన ఆదేశాలను గురించి చర్చించడానికై మరొక సమావేశం జరుగుతుంది.

యర్రగొండపాలెం

కమ్యూనిస్టు అభ్యర్థి పోటీ

మార్కాపురం, మే 7

ఆంధ్రప్రదేశ్ శాసన సభకు కర్నూలు జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి జరుగనున్న ఉప ఎన్నికలో శ్రీ పూల సుబ్బయ్య కమ్యూనిస్టు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయ పట్టభద్రులు. కర్ణాటక విశ్వవిద్యాలయంలో 'లా' డిగ్రీ తీసుకున్నారు. 1954 నుంచి మార్కాపురంలో న్యాయవాదిగా ఉంటున్నారు. వయస్సు 31 సం.

శ్రీ సుబ్బయ్య 1952 నుంచి కమ్యూనిస్టుపార్టీ సభ్యులు. ప్రస్తుతం మార్కాపురం తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్నారు

వీరు మార్కాపురం, కంభం తాలూకాల్లోని అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజాభిమానం చూరగొన్నారు

వీరి అభ్యర్థిత్వాన్ని చాలమంది న్యాయవాదులు, అనేకమంది అభ్యుదయ కాములు, రైతు పెద్దలు, కాంగ్రెసభిమానులూ బలపరుస్తున్నారు.

ఆదివారంనాడు డిగోల్-నెహ్రూ భేటీ

పారిస్, మే 6

ప్రస్తుతం లండనులో జరుగుతూన్న కామన్వెల్తు ప్రధానుల సభలో పాల్గొంటూన్న భారత ప్రధాని నెహ్రూ ఆదివారంనాడు పారిస్ వస్తున్నారు. ఫ్రెంచిఅధ్యక్షులు డిగోల్ ఆయనతో ఒక గంటసేపు సంభాషణలు జరుపుతారు. ఆతరువాత వారి గౌరవార్థం తన అధికారి భవనంలో విందుచేస్తారు. ప్రధాని నెహ్రూ అదే రోజున లండనుకు తిరిగి వెళ్ళిపోతారు

పశ్చిమ దేశాలకు రష్యా నూనె ఎగుమతులు

న్యూయార్క్, మే 6

సోవియట్ దేశం పశ్చిమ దేశాలకు చేసిన ఎగుమతులు గత నాలుగేండ్లలోను మూడురెట్లు పెరిగాయనీ, ఇది సోషలిస్టు దేశాల ఉత్పత్తిలో 12 శాతం వుంటుందనీ "విదేశ వ్యాపారం" అనే పత్రిక వ్రాసింది.

క్రూడాయిల్ గాని, శుద్ధి చేసిన ఆయిల్ నుగాని రష్యా ఇంత వరకు 30 పశ్చిమ దేశాలకు సప్లయి చేసిందనీ, గత రెండేండ్లలోను కమ్యూనిస్టుదేశాలకు సప్లయి చేసేసరుకుకంటే పశ్చిమ దేశాలకు ఎగుమతి చేసే సరుకు ఎక్కువగా వున్నదనీ ఆ పత్రిక తెలిపింది.

ప్రాక్పశ్చిమాల మధ్య ఉద్రిక్తత సడలబోదని హెర్టర్

వాషింగ్టన్, మే 7

సోవియటు యూనియన్ కొన్ని పశ్చిమ దేశాలపై దుమ్మెత్తిపోస్తూంటే ప్రాక్పశ్చిమ దేశాల మధ్య నిజమైన ఉద్రిక్తతా నివారణ సాధ్యంకాదని ఉత్తర అట్లాంటిక్, ఆగ్నేయాసియా సైనికకూటాలు భావిస్తున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి హెర్టర్ నేడన్నారు.

కృశ్చేవ్ ప్రసంగం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికావారు ప్రకటించారు. కాని, తన విమానం ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పుడు, అటువంటి సమయంలో వైమానికుని బయటికి నెట్టివేసే పరికరాలను ఉపయోగించకుండా, అతను గాలిగుమ్మటంద్వారానే బయటికి దూకాడన్న వాస్తవ విషయం, అమెరికావారి సంజాయిషీ నిజంకాదనీ, ఈ వైమానికుడు పూర్తిగా మామూలు స్థితిలోనే ఉన్నాడని స్పష్టంచేస్తూంది.

ఈ వైమానికుడు తాను తలపెట్టిన మొత్తం ప్రయాణాన్ని మూడుగంటల 40 నిమిషాల్లో పూర్తి చేయాలనుకున్నాడు.

ఈ విమానం శిథిలాలు కూడా ఇప్పుడు మాస్కోలోనే ఉన్నాయి. సోవియట్ వారి చేతుల్లో పడకుండా ఆత్మహత్య చేసుకోడానికి అమెరికా అధికారులు ఈ వైమానికుని కిచ్చిన సాధనాలను విదేశాల దౌత్యప్రతినిధులకు చూపిస్తాము

అమెరికావారు తాము క్రైస్తవులమనీ, కమ్యూనిస్టులు నాస్తికులనీ ప్రచారం చేస్తారు. కాని, కమ్యూనిస్టులు మానవుని విషయంలో ఇంత ఘాతుకంగా ఎన్నడూ ప్రవర్తించలేదు, ప్రవర్తించరు కూడాను.

ఈ వైమానికునికి, అతని అధికారులు సోవియట్ రూబుళ్లను చాల ఇచ్చి పంపారు. కాని, ఇంతలోనే సోవియట్ కొత్త రూబుల్ నాణాన్నికూడా నిర్ణయం చేసింది. తమ వైమానికుడు ఎటువంటి చిక్కుల్లో పడిపోతాడో, అతనిని పంపినవారు, పాపం ఊహించలేకపోయారు.

సోవియట్ నాణాలనే కాదు; ఫ్రెంచి బంగారు ఫ్రాంకులనూ, పశ్చిమజర్మనీ మార్కులనూ, ఇటలీ లీరా నాణాలనుకూడా చాలాఇచ్చారు. రెండు బంగారు రిస్టువాచీలూ, రెండు బంగారు కంకణాలూ కూడా అతని వద్ద ఉన్నాయి.

ఈ వైమానికుని వద్ద నిశ్శబ్దంగా ప్రేలే రకం పిస్టోలుకూడా ఉంది

ఇతనివద్ద ఫ్రెంచి నాణాలుకూడా ఉండడం దేనికి? వాటిని సిలోఫేన్ కాగితంలో భద్రంగా చుట్టారు. అమెరికావారన్నట్లు గాలి నమూనాలను పరిశీలించడానికి ఇవికూడా అవసరం కాబోలు! స్త్రీలు ఉపయోగించే ఉంగరాలు అతనిదగ్గర ఏడు ఉన్నాయి.

ఇంకా పైకిపోయి అంగారక గ్రహాన్ని చేరుకుని, అక్కడఉన్న స్త్రీలను, వశపరచుకోవాలనుకున్నాడు కాబోలు. (పెద్దగా నవ్వు)

అమెరికా విమానంలోని కెమెరా మంచిదే! అయితే, అది తీసినఫోటోల కన్నా సోవియట్ ఫోటోలే మంచివి. (నవ్వు)

పశ్చిమరాజ్యాల ప్రచారం

శిఖరాగ్ర సమావేశాన్ని కృశ్చేవ్ భగ్నం చేయాలనుకుంటున్నాడని పశ్చిమరాజ్యాలు ఆరోపిస్తున్నాయి ఆ ఉద్దేశమే లేకపోతే కృశ్చేవ్ ఈ విమానం ఉదంతాన్ని సుప్రీమ్ సోవియట్ ఎదుటికి తెచ్చిఉండేవాడు కాదని ఆ దేశాలు ప్రచారం చేస్తున్నాయి.

కాని, మేము అటువంటి వాళ్లము కాము.

రోట్లో తలకాయ పెట్టారు రోకటి పోటు తినండి.

ఈ విమానాన్ని కూల్చడానికి బాధ్యులయిన సోవియట్ సైనికులకూ సైనికాధికారులకూ, ఉన్నత బిరుదు పతకాలను ఇస్తాము.

నార్వేలోని బోడ్ నిచేరుకొనేలాగా ఫోటో తీయవలసిన ప్రదేశాలను గుర్తుపెట్టిన ఒక మ్యాపుకూడా యీ విమానంలోఉంది.

ఈ విమానం సోవియట్ సరిహద్దును దాటి 1,250 మైళ్ళ దూరం వచ్చింది. సరిహద్దును దాటిన దగ్గర్నుంచి అది సోవియట్ రక్షణ సిబ్బంది పరిశీలనలోనే ఉంది. పై నుండి ఉత్తరువులు అందడంతోనే దానిని నేల కూల్చారు.

ఏయే దేశాల్లో అయితే అమెరికా విమాన స్థావరాలున్నాయో, ఆ దేశాలవారికి, అక్కడ అమెరికన్లు చేస్తున్న పనులు బహుశా తెలియకపోవచ్చు. కాని, వారా విషయాలు తెలుసుకోవడం వారికే మంచిది. ఎందువల్లనంటే, ఆ స్థావరాల్లోని అమెరికన్లు నిప్పుతో ఆడుతూన్న చెలగాటంవల్ల కొంపకి నష్టపడేది ఆ దేశాలవారే కాగలరు.

ఈ ఘటనకు సంబంధించిన అమెరికా విమానం అధమా శుభమూ తెలియని ఒక వాతావరణ పరిశీలక విమానం మాత్రమే అని అమెరికా అధికారులు చేసిన ప్రచారాన్ని నమ్మేవారు అమెరికాలో చాలమంది ఉన్నారు. అసలు విషయం వారికి కూడా తెలియడం కోసమే ఈ ఘటనను గురించి ఇంత వివరంగా చెప్పాను.

ఆకాశంలో సరిహద్దులు ఉండకూడదనీ, అన్ని దేశాల విమానాలు ఎటు పడితే అటు ఎగిరే అవకాశం ఉండాలనేది అమెరికావారి వాదన. సోవియట్ ఆకాశ సరిహద్దులను తమంతట తాము తెరచివేయడానికి అమెరికావారు నిశ్చయించుకున్నట్లుంది. ఇటువంటి మీరి సైనికస్థావరాలకూ, శత్రుపర్యలకూ తమ భూభాగాలను వేదికగా ఉపయోగించుకోడానికి కొన్ని ప్రభుత్వాలు అవకాశాలు కలిగిస్తున్నాయి. పాకిస్తాన్, టర్కీ, నార్వేదేశాలు; వీటిలోకొన్ని. "మహాశయులారా, నిప్పుతో చెలగాటమాడకండి" అని నేను ఆదేశాలవారికి చెప్పదలచుకున్నాను. ఈస్థావరాలలో అమెరికావారు ఏమిచేస్తున్నారో అమెరికా గూఢచారి శాఖాధిపతి అయిన అలెన్ డల్లెస్‌ని ఆ దేశాలవారు అడిగి తెలుసుకోవడం మంచిది.

ఈ విమానం గురించిన యథార్థ విషయాలను అమెరికావారు సోవియట్ వచ్చి చూచి తెలుసుకోవచ్చు. అందుకు వారికి స్వాగతం.

ఈ విమానం గురించి తన కేమీ తెలియదని అధ్యక్షులు ఐసెన్‌హోవర్ అన్నారు. ఆ మాటలు నమ్మాలనే నాకుంది.

అయితే, అదే నిజమయితే, పరిస్థితి మరీ ప్రమాదకరం అన్నమాట. సైనిక తత్వవాదులదీ, సైనికాధికారులదేమో అమెరికాలో నిజమయిన అధికారంఅని అనుకోవలసివస్తుందన్న మాట. ఇటువంటి చర్యలను సైనికాధికారులు తమంతటతాము జరిపించగలపరిస్థితి ఏర్పడడం కన్నా ప్రపంచ శాంతికి ఎక్కువ ప్రమాదకరమయిన విషయం వేరొకటి ఉండదు.

వాతావరణం నమూనాలను పరిశీలించడానికి అని అమెరికావారు అంటున్న ఈ విమానంలోని పరికరాలు నిజంగా ఎంత ఘాతుకమయినవో వెల్లడిచేయడంకోసం ఒక ప్రత్యేక పత్రికా గోష్ఠి జరపడం అవసరమనుకుంటాను.

ఈనాడు ఒక చిన్న ప్రమాదం కోటానుకోట్ల ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టగలదు

మన సోవియట్ మాతృభూమి రక్షణ పాటవాన్ని ఇకముందుకూడా పెంచడం చాల అవసరం.

తమ సైనిక శక్తినీ, సర్వసన్నద్ధతనూ పెంచుకోవడం విషయంలో సోవియట్ ప్రజలుమునుపటికన్నా ఎక్కువ దీక్షను కనబరచాలన్న విషయాన్ని యీ సంఘటన నిరూపిస్తూంది.

ఏప్రిల్ తొమ్మిదవ తేదీని కూడా ఒక అమెరికా విమానం సోవియట్ పైకి వచ్చింది. అయితే అమెరికావారు అది నిజంకాదంటున్నారు. మనం ఆ దొంగను పట్టుకోలేక పోయాము. కాబట్టే వారలా కాదనగలుగుతున్నారు.

అందుచేతనే, మే ఒకటి తేదీని మన దేశంలోకి జొరబడిన దొంగను పోనివ్వకూడదని సోవియటుప్రభుత్వం అనుకుంది.

దుస్సాహసంతో కూడిన ఇటువంటి పనిమీద తమ విమానాన్ని పంపగలిగిన అమెరికావారు, హైడ్రోజన్ బాంబును అమర్చిన విమానాన్ని కూడా పంపగలిగిన సమర్థులన్న మాటేకదా!

అమెరికావారు గనక నిజమయిన క్రైస్తవులయినట్లయితే వారికి పాప భీతి ఉండేది. ప్రజలకు యుద్ధభీతిని కలిగించడానికి వెనుకాడేవారు. అయితే వారు అనుసరిస్తున్నది క్రీస్తు బోధనలనుకాదు; పెట్టుబడిదారీ దోపిడీ సిద్ధాంతాలనే వారు అనుసరిస్తున్నారు.

ఇప్పుడు మనం దొంగను పట్టుకున్నాము. బాధ్యతనుండి తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు.

సోవియట్ తన సాయుధ బలాలను తగ్గించుకొనే కార్యక్రమం ప్రారంభించింది ఈ సంఘటన జరిగినంత మాత్రాన ఆ కార్యక్రమాన్ని మానుకోవలసిన అవసరంలేదు అయితే తిరుగులేని రాకెట్ ఆయుధాలను మాత్రం మనం ఎక్కువగా సమకూర్చుకోవాలి.

సోవియట్ ప్రజల్లో అమెరికావట్ల శత్రుభావాన్ని రెచ్చగొట్టడం నా ఉద్దేశంకాదని నొక్కిచెప్పదలచుకున్నాను. సర్వదా జాగరూకులై ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడమే నా ఉద్దేశం.

టర్కీలోని అమెరికా సైనిక స్థావరంలో అతనితోకలిసి పనిచేస్తూన్న కొంతమందిఅమెరికా సైనికోద్యోగులపేర్లను పవర్స్ తెలిపాడు. అతని దళం అధిపతి కర్నల్ విల్లింగ్ షెల్టన్ అట. అతని డిప్యూటీ లెఫ్టినెంట్ కర్నల్ కార్ల్ పంక్ అట.

భూమినుండి 20 కిలోమీటర్ల ఎత్తున (ఒక కిలోమీటరు అయిదు ఫర్లాంగులు) ఉండగా ఆ విమానాన్ని సోవియటువారు కూల్చారు.

కృశ్చేవ్ తన 59 నిమిషాల ప్రసంగాన్ని ముగిస్తూ, "కమ్యూనిజానిదే అంతిమ విజయం! కమ్యూనిస్టుపార్టీ పతాకకింద, కమ్యూనిజం విజయసాధనకు పురోగమించండి! ప్రపంచశాంతి వర్ధిల్లాలి!" అని నినాదాలిచ్చారు.

ఇది దురదృష్టకర సంఘటన అని శ్రీ నెహ్రూ

లండన్, మే 7

రష్యాభూభాగంలో అమెరికా విమానం కూల్చివేయబడినఘటనదురదృష్టకరమైనదని ప్రధాని నెహ్రూ నేడు వ్యాఖ్యానించారు. శిఖరాగ్ర సమావేశం వాతావరణాన్ని ఇటువంటి సంఘటన కొంతభంగపరుస్తుందని ఆయన అన్నారు. భారతీయ విలేఖరుల సమావేశంలో శ్రీ నెహ్రూ మాట్లాడుతూ ఆయన ఇలా అన్నారు:

"ఇది జరగడం దురదృష్టకరం. అయితే శిఖరాగ్ర సమావేశం జరగకుండా ఆగదు. కాని ఆ సమావేశ వాతావరణానికి కొంచం భంగం వాటిల్లింది."

కృశ్చేవ్ కు ఘనా ఆహ్వానం

మాస్కో, మే 6

ఘనా సందర్శించవలసిందిగావచ్చిన ఆహ్వానాన్ని సోవియట్ ప్రధాని కృశ్చేవ్ అంగీకరించారనీ, వారు వెళ్లే తేదీ తర్వాత నిర్ణయమవుతుందని నేడు "టాస్" ప్రకటించింది.

ప్రస్తుతం మాస్కోలోవున్న ఘనా ప్రతినిధివర్గ నాయకుడు కోజ్జో బోట్సియో నేటి ఉదయం ప్రధాని కృశ్చేవ్‌ను క్రెమ్లిన్ భవనంలో కలుసుకున్నప్పుడు ఆహ్వానించారు.

సుప్రీం సోవియట్ ఆహ్వానాన్ని పురస్కరించుకొని యీ ఘనా ప్రతినిధివర్గం సోవియట్ దేశంలో పర్యటిస్తున్నది.

25 వేల రూపాయల పొదుపు పత్రాలు

న్యూఢిల్లీ, మే 7

మే 16 నుండి 25 వేల రూపాయల జాతీయ పొదుపుపత్రాలను ప్రవేశపెడుతున్నామని కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది.

ప్రస్తుతం 5, 10, 50, 100, 500, 1000, 5000 రూపాయల పొదుపు పత్రాలుమాత్రమే జారీలోవున్నాయి. ప్రావిడెంటు ఫండులో జాతీయ పొదుపు పత్రంలో కొనే సంస్థల కోసమే ఈ కొత్త పత్రాలు జారీచేయబడ్డాయి.

భారతదేశానికి పోలెండ్ అప్పు

రు 14 కోట్లు యివ్వడానికి ఒప్పందం

న్యూఢిల్లీ, మే 7

భారతదేశానికి పోలెండు యివ్వదలచిన రు. 14 కోట్ల 30 లక్షల అప్పు గురించి నేడిక్కడ ఉభయ దేశాల ప్రతినిధులు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ అప్పుపై వడ్డీ 2½ శాతం. రూపాయి నాణెంలోనే సాంవత్సరిక వాయిదాలపై చెల్లించుకోవచ్చు. ఈ అప్పుక్రింద దిగుమతి చేసుకోదలచిన సామాగ్రినంతనూ దిగుమతి చేసుకున్న ఏడాదికి, మొదటి వాయిదా చెల్లించాలి. జూన్ 30వ తేదీలోగా భారతదేశానికి కావలసిన పరికరాల గురించి కాంట్రాక్టులు కుదుర్చుకోవాలి. ఉభయ ప్రభుత్వాలూ అంగీకరించిన పరిశ్రమల స్థాపనకు అవసరమైన యంత్రాలను పోలెండు వద్ద కొనడానికి ఈ అప్పును వినియోగించుకోవాలి. ప్రాజెక్టుపని, యంత్రాలు నెలకొల్పడానికి సాంకేతిక సహాయం మొదలైన వాటికి యివ్వవలసిన డబ్బుగురించి వేర్వేరుగా ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. ఈ ఒప్పందం క్రింద కొనే, అమ్మే సరకుల ధర ప్రపంచధరలను బట్టి ఉంటాయి.

తిరుపతి, మే 6

తూర్పుగోదావరిజిల్లా వెనుకబడిన జాతుల మహాసభ కాకినాడలో 13వ తేదీ సాయంత్రం జరుగుతుందనీ, అంతకు ముందు ప్రకటించినట్లు 12వ తేదీన జరుగదనీ శ్రీ గౌతు లచ్చన్నగారు తెలియజేస్తున్నారు.

టెండరు నోటీసు

గుంటూరుజిల్లా, గుంటూరు తాలూకా పెదకాకాని పంచాయతీ యేరియాలో ఈ క్రింద వుదహరించిన పనులు చేయుటకు "సీలువేసిన టెండర్లు" ది 14-5-'60 తేది సాయంత్రం 4 గంటలకు కోరబడుచున్నవి. అదే తేదీ సాయంత్రం 4½ గంటలకు పంచాయతీ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచే టెండర్లు తెరువబడును. ఇతర వివరములు పంచాయతీ ఆఫీసు పనిచేయు కాలమందు తెలుసుకొనవచ్చును.

పని పేరు	ఎస్టిమేటు	డిపాజిట్టు
1. 1వ వార్డు (పాతవూరు)లో మంచినీటిబావిని బాగు చేయుట.	రు 260	రు 15
2 2వ వార్డులో బండిలదొడ్డివద్ద బావిని బాగుచేయుట.	70	5
3 1వ వార్డు (పాతవూరు)లో ఎలిమెంటరీస్కూలువద్ద బావికి యిరువైపుల ఆర్. సి పైపులు వేయుట.	140	5
4. 1వ వార్డు (పాతవూరు)లో మెయిన్ రోడ్డునుండి పీర్లపంజా వెనుకప్రక్కగా శ్రీ షేక్ మౌలా యింటి వరకుగల బజారుకు గ్రావెలుతోలి రోడ్డువేయుట.	300	15
5. 2వ వార్డులో నాగండ్లవారి బజారుకు గ్రావెలు తోలి రోడ్డువేయుట.	480	25
6 5వ వార్డు (క్రిస్టియన్) పేటలో "శ్మశానమునకు" పోవు రోడ్డులోగల వంతెన రిపేరుచేయుట.	500	25
7. 2వ వార్డులో శ్రీ వలివేటి వెంకట సుబ్బయ్యగారి బేర్నలవద్దనుండి కొనిగండ్ల రోడ్డును కలుపు బజారుకు గ్రావెలుతోలి రోడ్డు వేయుట.	1900	95
8. 1వ వార్డు (పాతవూరు)లో శ్రీ మన్నవ వెంకయ్య గారి వేర్లవద్దనుండి శ్రీ బోయపాటి సూర్యనారాయణగారి యింటికి రెండువైపులగల బజారుకు గ్రావెలు తోలి రోడ్డువేయుట.	900	45
9. 1960 - 61 సంవత్సరములకు యీ పంచాయతీకి కావలసిన స్టేషనరీ సప్లయి చేయుట.	—	10
మొత్తము	రు 4,550	రు 280

(సం) సి రాఘవరావు బి. ఏ,

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, పెద్దకాకాని పంచాయతీ. 6-5-60



రేడియో

సోమవారం, మే 9

విజయవాడ

357 1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం; ప్రసారవిశేషాలు, 6-35 వాద్యసంగీతం, 6-40 భక్తిరంజని (హై బి), 7-0 తె వా, 7-15 శహనాయీ (హై బి), 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం వా, 8-15 హిం వా, మధ్యాహ్నం 12-30 కార్మికులకు, 1-0 సంగీతగోష్ఠి, 1-30 లలితసంగీతం, 1-50 తె వా, సాయంత్రము 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం. వా, 6-15 గ్రామస్థులకు, 7-0 తె వా, 7-15 గ్రామస్థులకు, 7-30 విశ్వవిద్యాలయాలకు (హై బి), 7-45 ఎస్ వి సత్యనారాయణ (హై బి), 9-0 ఆం. వా, 9-5 ఆంగ్లప్రసంగం, 9-30 ఆంధ్రదేశపు జానపదగేయాలు; 9-45 సంగీత రసాస్వాదన ద్వారం వెంకటస్వామి నాయుడుగారితో పరిచయము: ఎస్ శ్రీనివాసరావు (మ. బి); 10-0 ఉషా పరిణయం [సంగీత నాటిక] రచన: మెలటూర్ వెంకటరామశాస్త్రి; 11-15 సమాప్తి

హైదరాబాద్ - ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం. 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ 6-40 భక్తిరంజని; 7-0 తె వా, 7-15 బిస్మిల్లాఖాం, స్వరం, 7-30 ఖుర్షీద్ ఖాటిమూర్; 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం వా; 8-15 హిం వా, 8-30 హిందూస్తానీ సంగీత పాఠ, మధ్యాహ్నం: 12-30 కార్మికులకు (వి. బి, 1-0 వీణ; 1-30 శాస్త్రీయ, ఉపశాస్త్రీయ సంగీత్; 1-50 తె వా, 2-0 వి ఎస్. అనంత శాస్త్రి (హై బి) వలె; 2-10 ఉ. వా, 2-20 హైదరాబాద్ బి వలె; సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం వా, 6-15 కదంబ కార్యక్రమం [హిందీ], 7-0 తె వా; 7-15 రూపకము (ఉర్దూ), 7-30 గోఖలే బహుముఖ ప్రజ్ఞ (ప్రసంగం); 7-45 కరుణాకర్, మృదంగం, 9-0 ఆం. వా, 9-15 ఉ వా, 9-30 విజయవాడ వలె, 9-45 రసమయి (మ బి); 10-0 విజయవాడవలె, 10-30 సమాప్తి.

హైదరాబాద్ - బి

42 02 మీ (7140 కిలోసై)

ఉదయం; 6-30 సుప్రభాత్, కార్యక్రమవివరణ

50 86 మీ (9720 కిలోసై)

మధ్యాహ్నం 12-30 కార్మికులకు; 2-0 వీణ.

60.12 మీ (4990 కిలోసై)

సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు, 7-0 తె వా 7-15 గ్రామస్థులకు; 7-30 హైదరాబాద్ ఎ వలె, 9-15 లలిత్ సంగీత్, 9-30 హైదరాబాద్ ఎ వలె; 10-30 సమాప్తి

సరుకు ధరలు

విజయవాడ, మే 7

[illegible] 1 కుంచం

బంగారం ధరలు

మేలిమి	సావరిన్		140 0 0
	మారక		189 8 0
	నవరసు		91 0 0
వెండి	100 తులములు		227 0 0
	తులము		2 5 0

ధాన్యం ధరలు

14 నెంబరు		రు 30 0 0
సంకరాలు		27 8 0
12 నెంబరు		26 12 0
[illegible]		26 8 0
[illegible]		26 8 0

బియ్యం ధరలు

14 నెంబరు		70 0 0
సంకరాలు		64 0 0
12 నెంబరు		62 0 0
[illegible]	59-0-0	60 0 0
[illegible]	59-0-0	60 0 0

అపరాల ధరలు

మినుములు 240 శా		46 0 0
పెసలు	41 -	46 0 0
నల్లకందులు నీలాలు		47 0 0
కచ్చ సెనగలు 280 (బసX)		45 0 0
కచ్చ సెనగలు ([illegible]		42 8 0
సెనగలు ([illegible]		43 4 0
సెనగలు ([illegible]		37 4 0
[illegible]		44 0 0
ఉలవలు	39-0-0	43 0 0
ఆముదాలు		47 8 0
పంచదార (ఫ్యాక్టరీ)		118 2 6
[illegible] బెల్లం		88 12 0
కొబ్బరి [illegible]	6 8-0	7 8 0
[illegible] "	5 0 0	8 0 0
మిర్చి "	24 0 0	30 0 0
పసుపు		1 6 0
[illegible]	8-0-0	13 0 0
[illegible]		24 0 0
[illegible] 177 శా		
[illegible]		76 0 0
[illegible]		77 0 0
[illegible]		20 6 0
[illegible] 160 [illegible]		25 4
[illegible] 1000		
	కొత్తవి	185 0 0
పంచదార 100		133 0 0
" పాతది (మే)		118 8 0
కవుకు 2 వ పట్టు		18 0 0
" 3 వ పట్టు		5 0 0
ఎర్రగోధుమలు		38 0 0
జొన్నలు "		64 0 0
కందిపప్పు	52 0 0	67 0 0
సెనగపప్పు		41 0 0
మైదా పెద్దకట్ట		44 0 0
" చిన్నది		35 0 0

హైదరాబాద్‌లో మరో ఇద్దరిసోషలిస్టుల అరెస్టు

హైదరాబాద్, మే 6

శ్రీ మతి లక్ష్మీబాయి, శ్రీ రామారావు అనే ఇద్దరు సోషలిస్టుపార్టీ వాలంటీర్లు నేడిక్కడ అరెస్టయినారు పార్టీ ప్రారంభించిన శాసనోల్లంఘనోద్యమ సందర్భంలోనే ఈ అరెస్టు జరిగింది.

Rs 1,70,000 TO BE DISTRIBUTED IN PRIZES

CLOSING 17-5-60 కళ్ళికోట కాలేజిలాటరీ DRAWING 29-5-60

మొదటి ప్రయిజు రు 85,000 లు లగాయితు రు రు 75 లు వరకు 322 ప్రైజులు

టిక్కట్టు 1కి రు. 1-15 న. పై. 6 టిక్కట్లు రు 5-15 న. పై

16 టిక్కట్లు రు. 12/- లు 78 టిక్కట్లు రు 40 లు.

(టిక్కట్లకు మంచి కమిషన్, కావలసినవారు, 0-25 న పై. పంపండి)

SANNIDHANAM VENKATESWARLU,
KALESWARARAO ROAD VIJAYAWADA - 2. A. P.

అమెరికాలో నాసిరకం మందుల తయారీ

అవి ప్రమాదకరమని డాక్టర్ల హెచ్చరిక

["సిన్హువా" విలేఖరి]

జెనీవా, మే 6

అమెరికాలో నేడు మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతోపాటు అనవసరమైన ఆరోగ్యానికి ప్రమాదకరమైన మందులను కూడా తయారు చేయడంవల్ల ప్రజల్లో ఆందోళన బయలుదేరినట్లు ఒక అమెరికన్ పత్రిక వెల్లడించింది.

మందులను తయారుచేసే గుత్తకంపెనీలు వైద్యసంస్థలపైన, వైద్యగ్రంథ ప్రచురణలపైన ఒత్తిడి చేస్తున్నాయి వాటిని కంట్రోల్ చేస్తున్నాయి ఇందుకు కారణం ఆ సంస్థలకూ, ప్రచురణలకూ పెద్ద పెద్ద ఎడ్వర్‌టైజ్‌మెంటు రేట్లు చెల్లిస్తూండడమే నని తేలింది. ఈ విషయాలన్నీ అమెరికా సెనేట్ ఉపసంఘ చర్చల్లో వెల్లడైనాయి. వీటిని గతనెల 25వ తేదీన అమెరికన్ వారపత్రికయైన "నేషనల్ గార్డియన్" పత్రిక ప్రకటించింది.

సెనేట్ ఉపసంఘం ముందు సాక్ష్యమిస్తూ, ఇయోవా యూనివర్సిటీ (అమెరికా) మెడికల్ ప్రొఫెసర్ డాక్టర్ విలియం బీన్ అనేక రహస్యాలు వెల్లడించాడు. ఈ నాడు మార్కెట్లో వున్న కొన్ని అమెరికన్ మందులు చాల ప్రమాదకరమైనవని ఆయన చెప్పాడు పెద్దపెద్ద లాభాలు తీయలనే దుర్బుద్ధితో మార్కెటులో కొత్తమందును ప్రవేశ పెట్టేందుకుగాను మందుల కంపెనీలు మందులను సరిగా పరీక్షించకుండానే (క్లినికల్ టెస్టింగ్) మార్కెట్‌కు పంపుతున్నాయని ఆయన చెప్పాడు. ఫలితంగా మందులకల్లకలిగే ప్రమాదకర ఫలితాలేమిటో తెలుసుకోకుండానే గుత్తవ్యాపారులీ పని చేస్తున్నారని ఆయన విమర్శించారు.

అంతేగాదు. మందుల పరిశ్రమలోని గుత్తపెట్టుబడిదారులు కొన్ని వైద్యసంఘాలకు, వార్తాపత్రికల సంపాదకులను ధనం ఎరచూపి లకట్టుకుని వుంచడంవల్ల ఆ సంఘాలు, సంపాదకులూ ఆయా ప్రత్యేక మందులపై వ్యాఖ్య చేయడానికి గాని, విమర్శించడానికిగాని సాహసించ లేక పోతున్నారని కూడా డాక్టర్ బీన్ తెలియజేశాడు

తర్వాత న్యూయార్క్‌లోని మౌంట్ సినాయ్ ఆస్పత్రిలోని డాక్టర్ హాన్స్ పాస్నర్ సాక్ష్యమిస్తూ మందుల పరిశ్రమలు "అద్భుత మందులు" అన్న పేరుతో తయారు చేస్తున్న మందులవల్ల కామెర్లు, తదితర లివర్ వ్యాధులూ సోకుతున్నాయనిచెప్పారు వీటివల్ల అనేక ప్రమాదాలుకూడా వాటిల్లాయన్నారు.

తరువాత కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఫ్రెడరిక్ మేయర్స్ మాట్లాడుతూ, మందులు తయారు చేయడంలో అమెరికా మందుల పరిశ్రమకే అగ్రతాంబూలం అని విర్రవీగుతున్నారుగాని అసలు లోగుట్టు బయటపడేంతవరకే ఈ పటన అని" సవాల్ చేశారు. అభివృద్ధి సాధించడంలో నిజంగా మన మందుల పరిశ్రమ వెనకబడి వుందనే చెప్పాలి"అని ఆయన అన్నాడు. విదేశాలలో కొత్తగా కనిపెట్టిన పరుకును కాపీచేసి మార్కెట్లో కలాపంపోలా అన్నదే నేటి అమెరికన్ మందుల పరిశోధనా కార్యక్రమంగా వుందని విమర్శించారు.

ఆయన యింకా యిలా అన్నారు: "వివిధ మందుల కంపెనీలు ఒకే రకమైన మందులకోసం పోటాపోటీలు పడుతున్నప్పుడు, తమ ట్రేడ్‌మార్క్‌ను స్థిరం చేసుకోవడానికి నానా తిప్పలు పడ్డం మామూలైపోయింది. మందులకు సంబంధించిన అనేక ఎడ్వర్టయిజ్‌మెంట్లు ఆ సంపూర్ణ ప్రకటనలుగా వుండడమే గాకుండా చాలఅమర్యాదకరంగా కూడా వుంటున్నాయి"

తర్వాత స్క్విబ్ లేబరేటరీస్ మాజీ మెడికల్ డైరక్టర్ డాక్టర్ డేల్ కనోన్స్ సాక్ష్యమిస్తూ, ఊపరి సలుపని అమ్మకాలు నెత్తిన వుండడంవల్ల మందుల పరిశ్రమ డాక్టర్లపైన విలువలేని మందులను బలవంతాన రుద్దుతున్నాయి. ఈ మందులు మంచిగన్నా చెడే ఎక్కువ కల్గిస్తాయని చెప్పారు మందుల కంపెనీలు తలపెట్టిన పరిశోధనా కార్యక్రమాల్లో సగానికిపైగా నిరుపయోగమైనవనే చెప్పాలి. ఏవో లాభాలు వస్తాయనే దృష్టితో దిండం తప్ప ఆ కార్యక్రమాలు ఎందుకూ పనికిరానివని ఆయన విమర్శించాడు. ఈనాడు అమెరికన్ మందుల పరిశ్రమ ఒకేఒకలక్ష్యంవుదన్నాడు. "జనాన్ని ఒప్పించలేకపోతే, కనీసం వాళ్ళను గందరగోళంలోనైనా పడవేయి" ఇదే నేటి విధానమన్నారు.

డాక్టర్లను, ప్రజలను "ఒప్పించడానికి", "గందరగోళ" పర్చడానికిగాను అమెరికన్ మందులపరిశ్రమగుత్తవ్యాపారులు కోట్లాదిడాలర్ల ధనాన్ని ఖర్చు పెడుతున్నారని ఉతా యూనివర్సిటీకిచెందిన డాక్టర్ జేమ్స్ బౌన్ తన సాక్ష్యంలో తెలిపాడు సంవత్సరానికి 24 వేల 247 టన్నుల మందుల అడ్వర్‌టైజ్‌మెంట్లు చూడలేక డాక్టర్లకు తలనొప్పి వస్తుందనికూడా ఆయన అన్నారు ఈ మందుల కంపెనీలకు అడ్వర్‌టైజ్‌మెంట్లకోసం అయిన పోస్టేజి ఖర్చు ఒక్కటే సంవత్సరానికి 1 కోటి 20 లక్షల డాలర్లు అని ఆయన అంచనా వేశారు. ఇవి గాక "ఫ్రీ శాంపిల్స్" పేరుతో 6 కోట్ల 80 లక్షల డాలర్లు ఖర్చు పెడుతున్నారు డాక్టర్ల చెత్తబుట్టల్లోకి వెళ్తున్న ఎడ్వర్‌టైజ్‌మెంట్లకు మందులపరిశ్రమ గుత్తాధిపతులు వెచ్చిస్తున్న ధనంతో కొత్తగా 58 ఆస్పత్రులను నిర్మించవచ్చునని జేమ్స్ బౌన్ తెలిపాడు.

మే 11 బుద్ధజయంతి మధ్యప్రదేశ్‌లో

భోపాల్, మే 6

ఈ నెల 11వ తేదీన బుద్ధజయంత్యుత్సవాల సందర్భంలో రాష్ట్రంలో అన్ని కసాయి దుకాణాలను మూసి వేయించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఉప ముఖ్యమంత్రికి వజ్రోత్సవం

ఈ నెల 31 న

విజయవాడలో

హైదరాబాద్, మే 5

ఈ నెల 31వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారికి వజ్రోత్సవం జరపాలని నిశ్చయింపబడింది. ఈ ఉత్సవసభకు కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి అధ్యక్షత వహిస్తారు:

ఉత్సవ నిర్వాహకులుగాను శ్రీ ఎం. ఆర్. అప్పారావుతో ఒక మిటీ ఏర్పడింది.

ఈ సందర్భంలోనే ఒక సావనీర్ ప్రచురిస్తున్నారు. నిధిసేకరణకు ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తారని, ఆ రూపేణా వచ్చిన ధనాన్ని శ్రీ రంగారెడ్డి పేరుతో హైదరాబాద్‌లో విద్యార్థి హాస్టల్ ఒకటి నిర్మిస్తారని తెలుస్తోంది

షేక్ అబ్దుల్లా అల్లుని విడుదల

శ్రీనగర్, మే 6

శ్రీ షేక్ అబ్దుల్లా అల్లుడూ, కాశ్మీర్ జనవాక్య సేకరణ సమితి ముఖ్యనాయకుల్లో ఒకరూ అయిన శ్రీ గులాం మహమ్మద్ షాను కాశ్మీరు ప్రభుత్వం నేడు విడుదల చేసింది.

శ్రీ షా అబ్దుల్లా ప్రభుత్వంక్రింద పౌరసరఫరా శాఖ కంట్రోలరుగా పనిచేశారు.

పై సమితికి చెందిన మరో ఏడుమంది రాజకీయ ఖైదీలు కూడా విడుదల చేయబడ్డారు.

చిత్తూరుకు డ్రైనేజి స్కీము

మునిసిపాలిటీకి మంత్రి సలహా

చిత్తూరు, మే 5

ఆంధ్ర ప్రదేశ్ మునిసిపాలిటీల, పరిశ్రమల మంత్రి శ్రీ ఎ సి సుబ్బారెడ్డికి నేటి ఉదయం యిక్కడ ప్రభుత్వ పశువైద్య ఆస్పత్రిలో పౌరసన్మానం జరిగింది. సన్మాన పత్రానికి శ్రీ సుబ్బారెడ్డి సమాధానమిస్తూ, పూర్తి వివరాలతో డ్రైనేజి స్కీముకు సంబంధించిన ప్రాథమిక అంచనాలన్నింటిని తయారుచేసి యిక్కవలసిందిగా చిత్తూరు మునిసిపాలిటీని కోరారు మునిసిపాలిటీ స్వంత నిధుకే ఇందుకు ఉపయోగపడేటట్లు స్కీమును తయారు చేయాలన్నారు.

పౌరసన్మానపత్రాన్ని మునిసిపల్ ఛైర్మన్ శ్రీ ఎన్. పి. వీరరాఘవులుగారు సమర్పించారు.

శ్రీ సుబ్బారెడ్డి తన ప్రసంగంలో యింకా ఈ క్రింది విషయాలను తెలియజేశారు.

తృతీయ ప్రణాళికలో డ్రైనేజి పథకాల క్రింద మొత్తం రు 7 కోట్లుఖర్చుపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. యిందులో నూర్ కోట్లు తృతీయప్రణాళికలో మిగిలిపోయిన పథకాలకు ఖర్చు చేయబడుతుంది. ఈలోగా యింకా ఎక్కువ పథకాలను అమలు జరిపే నిమిత్తం రాష్ట్రప్రభుత్వానికి యింకా ఏక్కువ గ్రాంట్లు యివ్వవలసిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరనున్నాము.

తర్వాత శ్రీ విజయసింహారెడ్డి గారి వందన సమర్పణతో సభ ముగిసింది.

"క్లియోపాత్ర" బహిష్కరణ సమాప్తి

వాషింగ్టన్, మే 7

న్యూయార్క్ ఓడరేవులో ఐక్య అరబ్ రిపబ్లిక్‌కు చెందిన "క్లియోపాత్ర" ఓడను అమెరికా కార్మికులు పికెటింగ్ చేయడాన్ని విరమించమని అమెరికా ట్రేడ్‌యూనియన్ సంస్థల అధిపతి జార్జిమీనీ నేడిక్కడ ప్రకటించారు.

అమెరికా తాత్కాలిక విదేశాంగ మంత్రి డగ్లస్ డిల్లన్, అమెరికా ట్రేడ్‌యూనియన్ సంస్థల ప్రత్యేక సలహాదారు ఆర్థర్ గోల్డ్‌బర్గు నేడిక్కడ సమావేశమై చర్చలు జరిపిన అనంతరం యీ ప్రకటన వెలువడింది.

మూడువారాలుగా "క్లియోపాత్ర" అనే ఓడను అమెరికన్ రేవు కార్మికులు సరుకులు దించకుండా పికెటింగు చేస్తున్నారు. రేవులో మొదటిసారిగా నేడు పికెటింగుచేసేవారు కనిపించలేదు. సరుకులు దించడం సోమవారం నుంచి ఆరంభమవుతుందని తెలుస్తోంది.

అమెరికా కార్మికులు యీ ఓడలో సరుకులు దించడం ఆరంభించడంతోటే అరబ్ ఓడరేవుల్లో అరబ్ కార్మికులు అమెరికా ఓడలను బహిష్కరించడం అంతమవుతుందని అంతర్జాతీయ అరబ్ కార్మిక సంఘం ప్రతినిధి ఒకరు కెయిరోలో చెప్పారు.

నేఫా ప్రాంతానికి కమీషనర్ నియామకం

న్యూఢిల్లీ, మే 6

నేఫాప్రాంతానికి శ్రీ జి.యస్ పూరిని కమీషనర్‌గా నియమించారు. ఈయన అస్సాం గవర్నరుక్రింద నేఫా ప్రాంతానికి సంబంధించిన వ్యవహారాలు చూచే సలహాదారుకు తోడ్పడుతూ ప్రధాన కార్యనిర్వాహకోద్యోగిగా వుంటారు. శ్రీ పూరి ఇంతవరకు విదేశాంగ శాఖలో నేఫా-నాగాపర్వతప్రాంతాల విషయాలు చూచే డిప్యూటీ సెక్రటరీగా వుండేవారు ఈయన తన కొత్త పదవిని మే 9న స్వీకరిస్తారు.

ఇంఫాల్‌లో అరెస్టులు

ఇంఫాల్, మే 6

నేడు నగరంలో 144వ సెక్షన్‌ను ధిక్కరించి మణిపూర్‌కు బాధ్యతాయుతప్రభుత్వాన్ని ఏర్పర్చవలసిందిగా కొంతమంది ఆందోళనకారులు పెద్ద ప్రదర్శన జరిపిన సందర్భంలో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఏప్రిల్ 25న విధించిన కర్ఫ్యూ రేపటితో పూర్తవనున్నది.

తృతీయ ప్రణాళిక ముసాయిదా

నెలాఖరుకు సిద్ధం

ఆగ్రా, మే 6

తృతీయ ప్రణాళిక ముసాయిదాను ఈ నెలాఖరుకు సిద్ధంచేసి కేంద్రమంత్రివర్గ పరిశీలనకు పంపించ గలమని ప్రణాళికసంఘసభ్యుడు శ్రీమన్ నారాయణ్ నేడు విలేకరులతో అన్నారు.

ముసాయిదాపై వివరమయిన చర్చలు ఆగస్టునెలలో ప్రారంభం కావచ్చునని, అవి సంవత్సరం ఆఖరువరకు కొనసాగ గలవని అన్నారు. 1961 ప్రారంభంలో ప్రణాళిక తుదిసర్వరూపం ప్రకటింప బడగలదని అన్నారు.

మహామారి

కోట, మే 2

నెల్లూరుజిల్లా కోట పరిసరప్రాంతాలలో మహమారి (పెద్దమ్మవారు) వ్యాపించి ఇప్పటికి షుమారు రెండు మూడు మాసాలు అవుతుంది. కర్లపూడి గ్రామంలో యిప్పటికి ముగ్గురు చనిపోయారు. ప్రజలు చాలా భయపడి పోతున్నారు.

ప్రతిమా కాన్వెంటుస్కూలు
తణుకు

హైస్కూలు ఇంగ్లీషు బోధనలో 5-12 సంగల మధ్య బాలబాలికలకు, హాస్టలు సౌకర్యముతో జూన్ 6న తిరిగి ప్రారంభమగును. వివరములకు :
— ప్రిన్సిపాల్.

రు. 1,75,000 లు
కళ్ళికోట లాటరీ

1. వ ప్రయిజు రు 85,00 /- 2. వ ప్రయిజు రు 30,000/- 3 వ ప్రయిజు రు 10,000/- ఇతర ప్రయిజులు 560.

1 టిక్కెట్టు రు 1-0, 3 టి రు 2-65, 7 టి. రు 5-0, 18 టి రు. 10-0 పోస్టు ఉచితం.

ముగింపు 18-5-60; డ్రా 29-5-60

అమ్ముకొనువారలకు పుస్తకము 18 రు 9/-

టిక్కెట్లకొరకు నేడే M. O చేయండి.

యం సుబ్బారావు, రామకృష్ణ ఏజెన్సీస్
అరండల్ పేట - విజయవాడ 2

కుష్టు స్థాపితము 1920 బొల్లి

మేహవాడ, చర్మ సుఖవ్యాధులకు గ్యారంటీచికిత్స

కేట్లాగుఉచితము

REDDY RDY

రెడ్డి అండ్ కో., రిజిష్టర్డ్
శ్రీకృష్ణాశ్రమము
గోపాలపురం. (తూ॥గో॥జిల్లా)

శ్రీ వత్స వారి
సినేడెక్స్
[illegible]
గజ్జి, తామర, పుండ్లు మొదలగు చర్మవ్యాధులకు దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్
[illegible]

శుక్రవారం 6-5-60 వ తేదీనుండి ఆఖరి 5 వ వారం

సరస్వతి పిక్చర్ ప్యాలెస్ - గుంటూరు

Cecil B. De Mille's A Paramount Picture

THE TEN COMMANDMENTS
(Vistavision Technicolo ur)

సిసిల్. బి. డి. మిల్లీస్

ది టెన్ కమాండ్‌మెంట్స్ (టెక్నికలర్‌లో)

రోజూ 2 ఆటలు సాయంత్రం గం॥ 5-30, రాత్రి గం॥ 9 30 లకు
ప్రతి ఆదివారం ఉదయం గం॥ 9-30 లకు ఆటలు గలవు
హెచ్చింపు రేట్లు : రు 2-25, 1-50, 0-94, 0-62



త్వరలో!
ఆంధ్ర ప్రేక్షక మహాజనులు మరువజాలని మహత్తర పౌరాణిక చిత్రం "గాంధారి గర్వభంగం" అందించిన
శ్రీకృష్ణసాయి ఫిలింస్ సమర్పించు
ద్వితీయ కానుక
అత్యద్భుత జానపద చిత్రం
వీరజగ్గడు
తెలుగు
సోల్ డిస్ట్రిబ్యూటర్స్
పూర్ణా ఫైనాన్సియర్స్
FLOODLIGHT
మాటలు, పాటలు... ఆరుద్ర + సంగీతం... పామర్తి + దర్శకత్వం... చంద్రకాంత్ + నిర్మాత .... యర్రా అప్పారావు + పూర్ణా రిలీజ్

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట ప్రింటర్సు, విజయవాడ-3